అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 08, సంచిక: 185 | బుధవారం | 04-06-2025 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ప్రధాని మోదీకి ఇండియా లేఖ

పహల్గామ్ అనంతర పరిణామాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని 16 విపక్ష పార్టీల నేతల విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలనే డిమాండ్ రోజు రోజుకూ బలపడుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు మంగళవారం ఇండియా కూటమి పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయి. పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలనే అంశంపై 16 పార్టీల నాయకులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రతిపక్ష పార్టీలు మంగళవారం ఢిల్లీలో భేటీ అయ్యాయి. పహల్గామ్ దాడి, ఆ తర్వాత ఆపరేషన్ సిందూర్, భారత్‌–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదన పాకిస్థాన్ కాల్పుల్లో సరిహద్దు ప్రాంతాల్లో పౌరుల మరణం వంటి వరుస సంఘటనలను చర్చించడానికి పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశపర్చాల్సిన అవసరముందని సీనియర్ ప్రతిపక్ష నాయకుడు చెప్పారు. పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్‌కు కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలిచామని, ఇప్పుడు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలన్న తరువాయి 2లో

# బనకచర్లను ఒప్పుకోబోం

- ప్రాజెక్టును అడ్డుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం
- కేంద్ర జలశక్తి మంత్రి దృష్టికి తీసుకెళ్లాం
- నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరాం
- మీడియా 'చిట్‌చాట్'లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్ట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఈ ప్రాజెక్ట్‌ను అడ్డుకునేందుకు తాము చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తనతో కలిసిన కొందరు జర్నలిస్టులతో మంగళవారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్ట్ అంశాన్ని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని, ఈ ప్రాజెక్ట్ నిర్మించకుండా అడ్డుకోవాలని ఆయనను కోరామన్నారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, కేంద్ర జలశక్తి మంత్రికి లేఖలు రాసినట్లు వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఒప్పుకోబోమని, త్వరలోనే తమ కార్యాచరణను ప్రకటిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు
# ప్రభాకర్‌రావు విచారణకు హాజరయ్యేనా..

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) మాజీ చీఫ్ టి. ప్రభాకర్ రావు విషయంలో ఇటీవల కొన్ని కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. గత నెల 29న సుప్రీం కోర్టులో ప్రభాకర్‌రావుకు తాత్కాలిక ఊరట లభించింది. ఆయన పాస్‌పోర్టును పునరుద్ధరించేందుకు.. ప్రయాణ పత్రాలు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే, ఆయనపై తదుపరి విచారణ వరకూ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని సూచించింది. జూన్ 5న విచారణ కోసం హైదరాబాద్‌లోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముందు హాజరుకావాలని ఆదేశించింది. అయితే ప్రభాకర్‌రావు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. సుప్రీంకోర్టు తరువాయి 2లో

## పహల్గామ్ ఉగ్రదాడికి ముందే భారత్‌పై
# విషం చిమ్మిన పాక్ ఆర్మీ చీఫ్

సిడిఎస్ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ వెల్లడి

వెయ్యి కోతలతో భారత్‌ను రక్తసిక్తం చేయాలనేది పాక్ అనుసరిస్తున్న విధానం అని మండిపాటు



**పుణే :** పహల్గామ్ ఉగ్రదాడి ఘటనకు ముందు నుంచే పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీం మునీర్ భారతదేశం, హిందువులకు వ్యతిరేకంగా 'విషం చిమ్మారు' అని, తాత్కాలిక నష్టాలకు వృత్తిపరమైన సైనికులు ఏమాత్రం ప్రభావితం తరువాయి 2లో




## పదేళ్లలో తలసరి ఆదాయం రెట్టింపైతే
# ప్రజల కొనుగోలు శక్తి ఎందుకు పెరగలేదు

సిపిఐ జనగామ జిల్లా మహాసభలో కూనంనేని సాంబశివరావు 03

## మిస్ వరల్డ్ పోటీలపై
# ఆరోపణలు రుజువు చేయాలి

లేకపోతే బిఆర్ఎస్ నేతలు నడిరోడ్డుపై ముక్కు నేలకు రాయాలి


మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్



ప్రజాపక్షం/హైదరాబాద్

''మిస్ వరల్డ్–2025 కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన ఒక్కో అందాల భామకు 30 తులాల బంగారం ప్రభుత్వం ఇచ్చిందని, చౌమహల్లా ప్యాలెస్‌లో ఒక్కొక్కరికి రూ.లక్ష భోజనం పెట్టి దుబారా చేశారని, మిస్‌వరల్డ్ ప్రోగ్రాంకు రూ.200 కోట్లకుపైగా ఖర్చు చేశారని'' బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీశ్‌రావు చేసిన ఆరోపణలు రుజువు చేయాలని.. లేని పక్షంలో తరువాయి 2లో





# ప్రపంచం
WORLD NEWS

## విశ్వాస ఓటుకు పోలాండ్ ప్రధాని సిద్ధం

**వార్సా :** పోలాండ్ దేశం నూతన రాజకీయ వాస్తవాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో తమ ప్రభుత్వం పార్లమెంటులో విశ్వాస పరీక్షను కోరనుందని పోలాండ్ ప్రధాన మంత్రి డొనాల్డ్ టస్క్ తెలిపారు. తన రాజకీయ మిత్రపక్ష సభ్యుడు, లిబరల్ వార్సా మేయర్ ఇటీవల అధ్యక్ష ఎన్నికల్లో సంప్రదాయవాద అభ్యర్థి కారోల్ వావోక్కీ చేతిలో ఓటమి పాలైన నేపథ్యంలో మంగళవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. వార్సాలో జరిగి క్యాబినెట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన అధ్యక్షుడు వచ్చినందున తాము నూతన రాజకీయ వాస్తవికతను ఎదుర్కొంటున్నామని, కానీ, రాజ్యాంగం, మన విధులు, పౌరుల ఆకాంక్షలు మారలేదన తెలిపారు. టస్క్ ప్రభుత్వానికి సంబంధించిన రోజువారీ నిర్ణయాలు తీసుకుంటుందని, అయితే అధ్యక్షుడికి చట్టాలను వీటో చేసే అధికారంతో పాటు, విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేసే అధికారం ఉంటుంది. కాబట్టి నావరోక్కీ అధ్యక్షుడిగా గెలుపొందడంతో టస్క్‌కు తన ఐరోపా అనుకూల ఎజెండాను ముందుకు తీసుకెళ్ళడం కష్టం గా మారనుంది. అత్యంత సంక్లిష్టమైన కూటమికి ప్రధాని టస్క్ నేతృ త్వం వహిస్తున్నారు. నిజానికి పార్లమెంటరీ ఎన్నికలు 2027 చివరలో జరగనున్నాయి. కొందరు రాజకీయ ప్రత్యర్థులు టస్క్‌ను దిగిపోవాలని కోరుతున్నారు.

## ఆహారం కోసం వెళ్తున్న వారిపై ఇజ్రాయెల్ కాల్పులు
# 27 మంది దుర్మరణం

### మృతుల్లో ముగ్గురు చిన్నారులు , ఇద్దరు మహిళలు
### పరిస్థితులు చూస్తుంటే చావటమే మేలు : గాజావాసులు ఆవేదన



**రఫా :** మానవత్వాన్ని మరిచి గాజాలో పాలస్తీనా వాసులు ఆకలిలో మలమలలాడుతూ చనిపోయేలా చేస్తున్న ఇజ్రాయెల్ మరింత దారుణానికి ఒడిగడుతోంది. అంతర్జాతీయ సమాజం నుంచి వస్తున్న విమర్శలతో తమ ఆధీనంలో ఉన్న మిలిటరీ జోన్‌లలో ఆహారాన్ని పంపిణీ చేసే సహాయ కేంద్రాలకు వెళ్తున్న పాలస్తీనావాసులపై ఇజ్రాయెల్ సైనికులు కాల్పులు జరుపుతున్నారు. సైన్యం వైపు వస్తున్నారనే కుంటి సాకులతో పౌరులపై కాల్పులు జరిపే దాష్టీకానికి పాల్పడుతున్నారు. సహాయ పంపిణీ కేంద్రాల వద్దకు వెళ్తున్న పాలస్తీనా వాసులపై ఇజ్రాయెల్ సైనికులు మంగళవారం జరిపిన కాల్పులలో 27 మంది మరణించారు. గడిచిన మూడు రోజుల్లో ఇలాంటిది ఇది మూడవ ఘటన అని పాలస్తీనా వైద్య అధికారులు,ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు.నిర్దేశిత మార్గాన్ని విడిచి, తమ బలగాల వైపు సమీస్తుండగా, హెచ్చరికగా కాల్పులు జరిపినా కొంత మంది అనుమానిత వ్యక్తులు ముందకు రావడంతో వారిపై కాల్పులు జరిపినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలియజేసింది. ఇజ్రాయెల్ మిలిటరీ జోన్‌లో ఇజ్రాయిల్, అమెరికా మద్దతుతో నిర్వహిస్తున్న సహాయ పంపిణీ కేంద్రం వద్ద ఈ కాల్పులు జరిగాయి. ఈ నూతన విధానాన్ని ఐక్య రాజ్యసమితి తిరస్కరించింది. ఇది గాజాలో పెరిగిపోతున్న ఆకలి సంక్షోభాన్ని పరిష్కరించకపోగా, ఇజ్రాయెల్ ఆ సహాయాన్ని ఆయుధంగా వాడుకుంటుందని తెలిపింది. మంగళవారం జరిగిన కాల్పుల్లో క్షతగాత్రులకు సంబంధించిన నివేదికలను పరిశీలిస్తున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. ఆదివారం, సోమవారం నాడు తమ బలగాలవైపు సమీపిస్తున్న వారిపై హెచ్చరికగా కాల్పులు జరిపామని తెలుపగా, పాలస్తీనా వైద్య అధికారులు కాల్పుల్లో 34 మంది చనిపోయారని చెప్పారు. పౌరులుపై కాల్పులు జరిపారనడాన్ని లేదా వారిని సహాయ కేంద్రాలకు రాకుండా అడ్డుకుంటున్నారనే విమర్శలను సైన్యం తిరస్కరించింది. సహాయ కేంద్రాలను నిర్వహిస్తున్న గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్(జిహెచ్ఎఫ్) ప్రతినిధులు మాట్లాడుతూ తమ వద్ద ఎలాంటి హింస చోటు చేసుకోలేదని పేర్కొన్నారు. అయితే, మంగళవారం నాడు పంపిణీ కేంద్రానికి సమీపంలో జరిగిన కాల్పుల్లో పౌరులు ఎవరైనా చనిపోయారా అనే అంశంపై సైన్యం దర్యాప్తు చేస్తున్నదని తెలిపారు. కాగా,ఆహారం కోసం సహాయ కేంద్రాలకు వెళ్తునవారిపై గత ఎనిమిది రోజులుగా ఇజ్రాయెల్ జరిపిన కాల్పుల్లో 102 మంది మరణించారని పాలస్తీనా అధికారులు చెబుతున్నారు.

**'ఎట్లాగైనా చనిపో-వడం ఖాయం'**

దక్షిణాది నగరం రఫాలో జిహెచ్ఎఫ్ పంపిణీ కేంద్రాలకు కిలోమీటర్ దూరంలో కాల్పులు జరిగాయి. ఆ ప్రాంతమంతా ఇజ్రాయెల్ మిలిటరీ జోన్‌గా ప్రకటించారు. అక్కడికి జర్నలిస్టులను కూడా అనుమతించడం లేదు. రఫా నగర నిర్వాసితుడు 50 సంవత్సరాల యాస్సర్ అబూ లుబ్దా మాట్లాడుతూ మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు కాల్పులు ప్రారంభమయ్యాయని, అనేక మంది చనిపోవడం లేదా గాయపడడాన్ని తాను చూసానని తెలిపారు. ఖాన్ యూనిస్ నగరానికి చెందిన మహిళ నీమా అల్ –ఆరజ్ మాట్లాడుతూ ఇజ్రాయెల్ కాల్పులు విచక్షణారహితమైనవని, తాను సహాయ పంపిణీ కేంద్రం వద్దకు చేరుకునే వరకు అక్కడ ఏమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు అమరులు మరో వైపు క్షతగాత్రులు ఉన్నారని, అక్కడి నుంచి తాను వెళ్ళిపోనని, ఏ విధంగానైనా తాము చనిపోవడం ఖాయమని బాధతో అన్నారు. మరో సాక్షి రషా అల్ నహల్ మాట్లాడుతూ అన్ని వైపుల నుంచి తుపాకుల కాల్పులు జరిగాయని, తాను డజన్‌కు పైగా మృతదేహాలను లెక్కపెట్టానని, అనేక మంది రోడ్డుపై గాయపడి ఉన్నారని తెలిపారు. తాను సహాయ కేంద్రం వద్దకు చేరేసరికి అక్కడ ఏమీ లేదని వాపోయారు. అక్కడ నేలపై పడి ఉన్న పాస్తా, చిరిగిన సంచుల్లో మిగిలిన బియ్యాన్ని ఆమె ఏరుకున్నారు. దీని కంటే చావటం మేలు అని, తమ ఎడల జరుగుతున్నది చూస్తుంటే చావే గౌరవప్రదంగా ఉంటుందని అన్నారు. ఐక్యరాజ్య సమితి మానవహక్కుల హైకమిషనర్ కార్యాలయ అధికార ప్రతినిధి కాల్పుల్లో 27 మంది మరణించారని జెనీవా పాత్రికేయులకు నిర్ధారించారు. మరణించిన వారిలో ముగ్గురు పిల్లలు, ఇద్దరు మహిళలు ఉన్నట్లు నాస్సెర్ ఆసుపత్రిలోని నర్సింగ్ హెడ్ మహ్మద్ సఖ్ తెలిపారు. పాలస్తీనా ప్రజలకు ఎదుట దారుణమైన ప్రత్యామ్నాయాలు మిగిలాయి. ఒకటి ఆకలితో చావటం లేదా సహాయ కేంద్రాల వద్దకు ఆహారం కోసం వెళ్ళేటప్పుడు కాల్పుల్లో మరణించటం అని యుఎన్ మానవ హక్కుల హైకమిషనర్ అధికార ప్రతినిధి వోల్కర్ తుర్క్ అన్నారు.

## భారత్‌తో వాణిజ్య ఒప్పందం
# ఎంతో దూరం ఉండబోదు

### అమెరికా వాణిజ్య మంత్రి



**వాషింగ్టన్ :** భారత్–అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం ఎంతో దూరంలో ఉండబోదని ఆశించవచ్చని, దీని కోసం ఇరు దేశాలు కృషి చేస్తున్నాయని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ తెలిపారు. తాను ఈవిషయంలో ఆశావాదిగా ఉన్నట్లు పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశ సుంకాలు అత్యంత రక్షణవాదంతో ఉన్నాయని భావిస్తున్నారని, అనేక వస్తువులపై 100 శాతం సుంకాలు విధించిందని అన్నారు. వాటిని సముచిత స్థాయికి తీసుకురావాలని, అలా చేస్తే మంచి వాణిజ్య భాగస్వాములం అవుతామని, ఇవన్నీ కూర్చొన్ని మాట్లాడుకోవచ్చని, పెద్దగా ఇబ్బంది కలిగించే అంశాలు కావని చెప్పారు. అమెరికా– ఇండియా స్ట్రాటర్జిక్ పార్ట్నర్‌షిప్ ఫోరమ్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో సోమవారం లుట్నిక్ కీలకోపన్యాసం చేస్తూ లుట్నిక్ అన్నారు. భారతదేశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బాగా మెచ్చుకుంటారని, గౌరవిస్తారని, ఇరు దేశాలకు సంయుక్తంగా గొప్ప సంబంధాలు ఉండబోతున్నాయని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్ట్ లుట్నిక్ అన్నారు. భారతీయుల హృదయాంతరాలలో పట్టుదల, గాఢమైన వాంఛ ఉందని, అందుకే దేశ ఆర్థిక వ్యవస్థ ముందకు సాగుతోందని అన్నారు.భారతదేశం అత్యంత అసాధారణ ఆర్థిక వ్యవస్థలలో ఒకటి అని తమ అధ్యక్షుడు ట్రంప్ 'అమెరికా ఫస్ట్' అని ఆలోచిస్తారే తప్ప , 'అమెరికా ఓన్లీ(అమెరికా మాత్రమే)' లేదా 'అమెరికా ఎక్స్‌క్లూజివ్లీ(అమెరికా ప్రత్యేకం)' అని అనుకోరని తెలిపారు. ముందు ఆయన ఇంటిని చక్కదిద్దుకోవడం ద్వారా బలంగా, ధృడంగా ఉండబోతున్నారని, ఆ తరువాత మిత్రులను చూసుకుంటారని చెప్పారు. ఆయన తప్పకుండా భారతదేశాన్ని కూడా జాగ్రత్తగా చూసుకుంటారని, ఆయన భారతదేశాన్ని గాఢంగా ప్రశంసిస్తారని, గౌరవిస్తారని, మన మధ్య గొప్ప సంబంధాలు ఉండబోతున్నాయని అన్నారు. భారతదేశంలో తయారీరంగాన్ని మరింత ప్రోత్సహిస్తారా? అని అడిగిన ప్రశ్నకు లుట్నిక్ స్పందిస్తూ తాము అమెరికాకు అడ్వాన్స్‌డ్ తయారీరంగం తిరిగి రావాలని కోరుకుంటున్నట్లు జవాబిచ్చారు.

## పాకిస్థాన్ జైలు నుంచి 216 మంది ఖైదీల పరారీ



**కరాచీ :** పాకిస్థాన్‌లో భూకంపం కారణంగా ముందు జాగ్రత్త చర్యగా జైలును ఖాళీ చేయిస్తుండగా తలెత్తిన గందరగోళంలో 216 మంది ఖైదీలు జైలు నుంచి తప్పించుకున్నారు. ఈ సందర్భంగా ఒక ఖైదీ చనిపోగా, ముగ్గురు పారామిలిటరీ ఫ్రాంటియర్ కోర్ సిబ్బంది, జైలు సిబ్బంది ఒకరు గాయపడ్డారు. కరాచీలోని మాలిర్ జైలులో ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు జియో న్యూస్ తెలిపింది. జైలు అధికారుల వివరణ ప్రకారం తప్పించుకున్న వారిలో 86 మంది ఖైదీలను తిరిగి పట్టుకున్నారు. గడిచిన 24 గంటల్లో కరాచీలో అనేక మార్లు భూకంపం సంభవించింది. ప్రకంపనల కారణంగా బ్యారక్‌ల నుంచి 600 మంది ఖైదీలను బైటికి తీసుకువచ్చినట్లు జైలు సూపరింటెండెంట్ అర్షద్ షా తెలిపారు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న గందరగోళంలో 216 మంది తప్పించుకున్నారని ఆయన చెప్పారు. ఇది లఅత్యంత తీవ్రమైన ఘటన అని సింధ్ ప్రాంత హోం మంత్రి జియా ఉల్ హసన్ లంజార్ అన్నారు. తప్పించుకున్న ఖైదీల వివరాలను గుర్తించామని, వారి నివాసాలు, చుట్టు పక్కల ప్రాంతాలలో దాడులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మాలిర్ జైలులో ఘటన జరిగిన సమయంలో 6 వేల మందికి పైగా ఖైదీలు ఉన్నారు.

## భారతదేశం, పాకిస్థాన్‌ల మధ్య
# పరస్పర విశ్వాసాన్ని పెంపొందించుకోవాలి

### రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావరవ్

**మాస్కో :** భారతదేశం, పాకిస్థాన్‌ల మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా ఇరు దేశాల మధ్య పరస్పర విశ్వాసాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావరవ్ అన్నారు. పాకిస్తాన్ పర్యటను వెళ్ళిన ప్రధాన మంత్రి ప్రత్యేక సహాయకుడు సయ్యద్ తారిఖ్ ఫతేమీతో సమావేశం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపినట్లు 'టాస్' వార్తా సంస్థ పేర్కొంది. ద్వైపాక్షిక సహకారం, ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతపై చర్చ జరిగింది. పాకిస్థాన్– భారత్ మధ్య పరిస్థితులపై పాకిస్థాన్ వైఖరిని ఫతేమీ తెలియజేశారు.న్యూఢిల్లీ, ఇస్లామాబాద్ మధ్య పరస్పర విశ్వాస స్థాయిని పెంపొందించుకునేందుకు ప్రత్యక్ష చర్చలు అవసరమని రష్యా వైపు నుంచి తెలిపామ''ని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రాథమికంగా ఐక్యరాజ్య సమితి, షాంఘై సహకార సంస్థ(ఎస్‌సిఒ)కు అనుగుణంగా అంతర్జాతీయ నమూనాలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలను బలోపేతం చేయాల్సిన ప్రాధాన్యతను ఉభయ పక్షాలు అంగీకరించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉక్రేన్‌పై రష్యా రాకెట్ దాడి

### ముగ్గురు మృతి : జెలెన్‌స్కీ

**కీవ్ :** ఉక్రేన్ పట్టణం సుమీలో మంగళవారం జరిగిన రష్యన్ రాకెట్ దాడులలో ముగ్గురు మరణించారని, అనేక మంది గాయపడ్డారని ఆ దేశ అధ్యక్షుడు వొలోదమిర్ జెలెన్‌స్కీ అన్నారు. టర్కీలోని ఇస్తాంబుల్‌నగరంలో రష్యా–ఉక్రేన్ దాడులలో పెద్దగా ముందడుగు పడలేదు. మరుసటి రోజే సుమీ నగరంపై దాడులు జరిగిందని, రష్యాకు యుద్ధాన్ని ఆపివేయాలనే ఆలోచన లేదని జెలెన్‌స్కీ ఆరోపించారు. అంతర్జాతీయ ఒత్తిడి లేకుండా, అమెరికా, ఐరోపా, ప్రపంచంలో అధికారం ఉన్న ప్రతి ఒక్కరూ నిర్ణయాత్మక చర్యలు తీసుకోకుంటే పుతిన్ కనీసం కాల్పుల విరమణకు కూడా అంగీకరించబోరని కవ్వింపు వ్యాఖ్యలు చేశారు.

# బడా పెట్టుబడిదారుల చేతుల్లో మోదీ కీలుబొమ్మ

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా



ప్రజా ఉద్యమాలకు సిద్ధంకండి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** బడాపెట్టుబడిదారుల చేతుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కీలుబొమ్మగా మారారని సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా ఆరోపించారు. మంగళవారం సిపిఐ నాగర్‌కర్నూల్ పట్టణశాఖ సమావేశం కొట్ర శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా బాల్‌నర్సింహ్మా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు వచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఊదలగొట్టే ఉపన్యాసాలు ఇస్తూ ప్రజలను భ్రమలలో ముంచుతున్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బడా పెట్టుబడిదారి పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ ఆస్తులను అప్పనంగా అప్పజెప్పడం జరిగిందన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు లక్షలకోట్ల రూపాయలను మాఫీ చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయమంటే ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటదని సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనడం రైతులపై ప్రేమ ఎంత ఉందో దేశప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్. ఆనంద్, మండలపార్టీ కార్యదర్శి మర్యాదవెంకటయ్య, పట్టణ కార్యదర్శి గోపిచారి, పట్టణ సహాయ కార్యదర్శి కొత్తరామస్వామి, నాయకులు ఆనంద్, సుధాకర్, ఆంజనేయు లు, జమీర్, నాగయ్య పాల్గొన్నారు.

సిపిఐ తాడూరు మండల పరిధిలోని గుంతకోడూరు గ్రామంలో శాఖ మహాసభకు ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు వార్ల వెంకటయ్య హాజరై మాట్లాడుతూ వంద సంవత్సరాలుగా భారతదేశంలో పేద ప్రజల అభివృద్ధి కోసం తారతమ్యాలులే ని సమ సమాజం కోసం అలుపెరుగని పోరాటంచేసిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలపై పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు. మహాసభ అనంతరం నూతన కార్యదర్శిగా ఏకాంబరం గౌడ్, సహయ కార్యదర్శులు గా కొంగరి శ్రీనివాసులు, రామకృష్ణలను ఏకగ్రీవంగా ఎ న్నుకున్నారు. కార్యక్రమంలో తాడూరు మండలకార్యద ర్శి కుతుబుద్దీన్, డిహెచ్‌పిఎస్ జిల్లాప్రధాన కార్యదర్శి బండి లక్ష్మిపతి, చంద్రయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**తిమ్మాజిపేటలో :** సిపిఐ తిమ్మాజిపేట మండల 18వ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాల్‌నర్సింహ్మా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో కమ్యూనిస్టుపార్టీ ఏర్పడి వంద సంవత్సరాలైందని అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏరోజు అధికారంలో లేకున్నా పేదలకు పదిలక్ష ల ఎకరాల భూమిని పంచిన ఏకైక పార్టీ అన్నారు. కా ర్యక్రమంలో తిమ్మాజిపేట మండల కార్యదర్శి ఎండి. ఖా జ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శివశంకర్, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శివకృష తదితరులు పాల్గొన్నారు.

## పాక్ ఆర్మీ చీఫ్ (మొదటి పేజీ తరువాయి)

కాబోరని, ఆ తరహా ఎదురుదెబ్బల కంటే మొత్తం ఫలితాలే ముఖ్యమైనవి అని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్)జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. మంగళవారం నాడు పుణేలోని సావిత్రీభాయి పూలే యూనివర్సిటీలో 'భవిష్యత్తు యుద్ధాలుయుద్ధ క్షేత్రాలు' అంశంపై జరిగిన ఒక కార్యక్రమంలో జనరల్ చౌహాన్ ప్రసంగించారు. పాకిస్థాన్ వెయ్యి కోతలతో రక్తసిక్తం చేసే విధానాన్ని భారతదేశం పట్ల అనుసరిస్తున్నదని, అయితే న్యూఢిల్లీ మాత్రం ఆపరేషన్ సిందూర్ ద్వారా సీమాంతర ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పూర్తిగా ఒక నూతన రెడ్‌లైన్‌ను గీసిందని అత్యున్నత సైనిక కమాండర్ అనిల్ చౌహాన్ తెలిపారు. ఆయన తన ప్రసంగంలో ఆపరేషన్ ప్రారంభ దశలో భారతదేశం వెల్లడించని సంఖ్యలో యుద్ధజెట్లను కోల్పోయిందని అంగీకరించినందుకు తనపై వచ్చిన విమర్శలను తిరస్కరించినట్లు వ్యక్తమైంది. 'మన వైపు నష్టాల గురించి నన్ను అడిగినప్పుడు నష్టాలు ఫలితాల కంటే ముఖ్యమైనవి కావని అన్నానని, నీవు ఏవిధంగా నడుచుకుంటున్నావనేదే ముఖ్యమైనది' అని ఆయన చెప్పారు. నష్టాల గురించి, సంఖ్యల గురించి అనేకసార్లు మాట్లాడటం సరియైనది కాదని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. యుద్ధంలో, ఎన్ని ఎదురుదెబ్బలు ఎదురైనప్పటికి కూడా మీరు మీ మనోధైర్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, నష్టాలు ముఖ్యం కాదని, ఫలితాలే ముఖ్యమని సిడిఎస్ అన్నారు.రాజకీయాలు సహా యుద్ధంలోని వివిధ అంశాలను, హింస గురించి ఆయన ప్రస్తావించారు. ఆపరేషన్ సిందూర్‌లో కూడా ఆ తరహా రకమైన రాజకీయాలు సమాంతర దృగ్విషయంగా సంభవిస్తున్నాయి అన్నారు. జనరల్ చౌహాన్ ప్రస్తావించారు. భారతదేశాన్ని వెయ్యి కోతలతో రక్తసిక్తం చేయాలనే దృక్పథాన్ని ఇస్లామాబాద్ కలిగిఉన్నదని చెప్పారు. పహల్గామ్ దాడి సమయంలో బాధితుల పట్ల పాకిస్తాన్ మద్దతు ఉగ్రవాద మూకలు చూపించిన క్రూరత్వమే అందుకు ఉదాహరణ అన్నారు. ఆపరేషన్ సిందూర్ నిర్వహించడం వెనక పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం ఆపివేయాలని, పాకిస్థాన్ భారతదేశంపై ఉగ్రవాద చర్యలను ఉసిగొల్పేందుకు స్థావరాలను నిర్వహించకూడదనేదే ముఖ్యోద్దేశమని సిఓడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్ చెప్పారు.ఉగ్రవాదం, బెదిరింపుల నీడలో భారతదేశం జీవించేందుకు ఎప్పుడూ సిద్ధపడదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ తన ప్రతిదాడిని 48గంటల పాటు నిర్వహించాలనుకుందని, కానీ 8గంటల్లోనే ఆగిపోయిందని చెప్పారు.భారతదేశం మొత్తం విధానం గురించి జనరల్ అనిల్ చౌహాన్ మాట్లాడుతూ 'మేం ఉగ్రవాదాన్ని నీటితో అనుసంధానించాం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఒక కొత్త మార్గాన్ని గీసాం' అని అనిల్‌చౌహాన్ చెప్పారు.

## నేతన్న పథకానికి మార్గదర్శకాలు విడుదల : మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేత కార్మికుల సంక్షేమానికి ప్రజా పాలన ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులోభాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన తెలంగాణ చేనేత అభయహస్తంలో భాగంగా తెలంగాణ నేతన్నకు భరోసా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ. 48.00 కోట్లు కేటాయించినట్లు తుమ్మల తెలిపారు. ఈ పథకం ద్వారా జియో ట్యాగ్ చేయబడిన మగ్గాలపై పనిచేస్తున్న కార్మికులకు, అనుబంధ కార్మికులకు వేతన ప్రోత్సాహకం కింద గరిష్టంగా సంవత్సరానికి నేత కార్మికులకు రూ. 18,000, అనుబంధ కార్మికులకు రూ. 6,000 అందించడం జరుగుతుందన్నారు. దీంతో దాదాపు 40,000 మంది చేనేత, అనుబంధ కార్మికులు లబ్ధి పొందుతారని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలకు ప్రత్యేకంగా తయారుచేయబడిన యూనిక్ లోగోను జతచేయడం జరుగుతుందని, తద్వారా చేనేత ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను, నేత కార్మికుని వివరాలను వినియోగదారులు తెలుసుకోవచ్చునన్నారు. దీంతో తెలంగాణ చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పెరిగే అవకాశాలు ఏర్పడతాయని ఆయన తెలియజేశారు.ఈ పథకం నేత, అనుబంధ కార్మికులందరికీ వర్తిస్తుందన్నారు. 18 సంవత్సరాలు నిండి జియో ట్యాగ్ చేయబడిన మరమగ్గాలపై పనిచేసే కార్మికులు, ప్రీలూమ్, ప్రిపరేటరి ప నులైన డైయింగ్, టైయింగ్, డిజైనింగ్, వార్పింగ్, వైండింగ్, సైజింగ్ మొదలైన అనుబంధ పనులు చేసే కార్మికులు, చేనేత వృత్తి ద్వారా వారి వార్షిక ఆదాయంలో కనీసం 50 శాతం పొందుతున్నవారు అర్హులని తెలిపారు. నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలోకి వేతన ప్రోత్సాహకం కింద సంవత్సరానికి రెండు విడతలుగా (ఏప్రిల్ నుండి సెప్టెంబర్ అక్టోబర్ నుండి మార్చి) నేత కార్మికునికి రూ. 9,000, అనుబంధ కార్మికునికి రూ. 3,000 జమ చేయడం జరుగుతుంది. అయితే మొదటి విడతలో 50 శాతం వార్పులు పూర్తి చేయని వారు, రెండో విడతలో పూర్తి చేసినట్లైతే మొత్తం ప్రోత్సాహకం సంవత్సరాంతంలో చేనేత , అనుబంధ కార్మికులకు అందించబడుతుందని మంత్రి తెలిపారు.

## 'ఇండియా' లేఖ

(మొదటి పేజీ తరువాయి)

తమ డిమాండ్‌ను అంగీకరించాలని ప్రతిపక్ష నాయకులు విజ్ఞప్తి చేశారు. కాగా సమావేశంలో కాంగ్రెస్ జైరామ్ రమేష్, దీపేందర్ హుడా, తృణమూల్ కాంగ్రెస్ డెరెక్ ఓ బ్రెయిన్, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) మనోజ్ ఝా, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) రామ్‌గోపాల్ యాదవ్ , శివసేన (యుబిటి) సంజయ్ రౌత్ ఈ సమావేశానికి హాజరయ్యారు. 'పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేస్తూ పదహారు పార్టీలు ప్రధానమంత్రికి లేఖ రాశాయి. ప్రభుత్వం పార్లమెంటుకు బాధ్యత వహిస్తుంది. పార్లమెంటు ప్రజలకు బాధ్యత వహిస్తుంది' అని సమావేశం తర్వాత ఓ బ్రెయిన్ విలేకరులతో అన్నారు. ఈ లేఖను త్వరలో ప్రధానమంత్రి కార్యాలయానికి పంపుతామని ప్రతిపక్ష నాయకులు తెలిపారు. ప్రత్యేక సమావేశాన్ని డిమాండ్ చేయడానికి ఉమ్మడి ప్రయత్నం చేయాలని పార్లమెంటరీ పార్టీ నాయకులు మాత్రమే కాకుండా, ఆయా పార్టీల అధ్యక్షులు కూడా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) నాయకుడు అఖిలేష్ యాదవ్, టిఎంసి నాయకుడు అభిషేక్ బెనర్జీ, డిఎంకె నేత టిఆర్ బాలు, శివసేన (యుఎన్‌టి) నేత అరవింద్ సావంత్ సంతకం చేసిన వారిలో ఉన్నారు. డింకె, నేషనల్ కాన్ఫరెన్స్, సిపిఐ,(ఎం), సిపిఐ(ఎం), ఐయుఎంల్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్‌ఎస్‌పి), విదుతలై చిరుతైగల్ కచ్చి (విసికె), కేరళ కాంగ్రెస్, ఎండిఎంకె, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ కూడా ఈ లేఖపై సంతకం చేసిన వారిలో ఉన్నారు. కరుణానిధి జయంతి సందర్భంగా డిఎంకె సమావేశంలో పాల్గొనలేకపోయింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కూడా ఇదే డిమాండ్‌ను లేవనెత్తుతూ ప్రధానమంత్రికి విడిగా లేఖ రాస్తామని పేర్కొంది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌సిపి) గతంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి డిమాండ్ లేదని చెప్పినప్పటికీ, ఈ విషయంపై తాను ఎన్‌సిపి నాయకులతో మాట్లాడుతానని రౌత్ అన్నారు. 'శరద్ పవార్ సాహబ్ కూడా మాతో ఉన్నారు. ఈ లేఖలో ఫ్లోర్ లీడర్ల సంతకాలు ఉన్నాయి... సుప్రియా సులే జీ దేశం వెలుపల ఉన్నారు. నేను ముంబైకి వెళ్ళినప్పుడు ఆయనతో మాట్లాడతాను' అని ఆయన అన్నారు. కాంగ్రెస్, అన్ని ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వానికి మద్దతు ఇచ్చాయని హుడా అన్నారు. ప్రత్యేక సమావేశానికి డిమాండ్‌ను తాము లేవనెత్తామని, ఇది చాలా ముఖ్యమన్నారు. పాకిస్తాన్‌ను ఒంటరిగా చేయడానికి, ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ఎలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి?, ముందుకు సాగే మార్గం ఏమిటి? పార్లమెంటులో చర్చించాని ఆయన అన్నారు. భారత ప్రజలను చీకటిలో ఉంచుతున్నారని రాంగోపాల్ యాదవ్ అన్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం చాలా ముఖ్యమని, ఆపరేషన్ సిందూర్‌పై మొత్తం ప్రపంచానికి చెబుతున్నారు, కానీ పార్లమెంటును, భారత ప్రజలను చీకటిలో ఉంచుతున్నారు అని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ గురించి ప్రజాప్రతినిధులకు తెలియజేయానికి జరిగిన అఖిలపక్ష సమావేశంలో కూడా ఈ డిమాండ్‌ను లేవనెత్తారు. ఉగ్రవాదంపై భారతదేశ వైఖరిని తెలియజేయడానికి వివిధ దేశాలకు వెళ్లిన బహుళ పార్టీల ప్రతినిధులు దేశానికి తిరిగి వచ్చిన తర్వాత, జూన్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించాలని తృణమూల్ కాంగ్రెస్ సూచించింది. ఏప్రిల్ 22న కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన దాడిలో 26 మంది మరణించారు. దీనికి ప్రతి చర్యగా భారత సాయుధ దళాలు పాకిస్తాన్, పిఒకె లోపల ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశాయి. తరువాత ఆపరేషన్ సిందూర్ కింద పొరుగు దేశంలోని వైమానిక స్థావరాలపై బాంబు దాడి చేశాయి.

## ఆరోపణలు రుజువు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

నడిరోడ్డుపై ముక్కు నేలకు రాయాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బిఆర్‌ఎస్ నేతలకు డిమాండ్ చేశారు. మిస్‌వరల్డ్‌పై ప్రతిపక్ష పార్టీలు చేసిన పలు ఆరోపణలపై మంత్రి జూపల్లి కృష్ణారావు సచివాలయం వేదికగా మంగళవారం విలేకరుల సమావేశంలో వివరణ ఇచ్చారు. జూపల్లి మాట్లాడుతూ.. మిస్ వరల్డ్ ఫోగ్రాంపై బిఆర్‌ఎస్ పార్టీ నేతలు చేసిన ఆరోపణలపై చర్చిండానికి తెలంగాణ భవన్‌కు, ఆబిడ్స్ నడి బొడ్డుకు రావడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని బిఆర్‌ఎస్ నేతలకు ఇజ్జత్ ఉంటే రావాలని ఆయన సవాల్ విసిరారు. ఇందుకోసం తాను వారం రోజుల గడువు కూడా ఇస్తున్నానన్నారు.కాళేశ్వరం విచారణ,ఫోన్‌ట్యాపింగ్,ఈకార్ రేస్ తదితర కుంభకోణాలపై బిఆర్‌ఎస్ నేతలపై వచ్చిన ఆరోపణలను పక్కదారి పట్టించేందుకే ఉద్దేశ్య పూర్వకంగా ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారానికి తెర లేపారని జూపల్లి ఆరోపించారు. మిస్‌వరల్డ్ పోటీల ద్వారా తెలంగాణ టూరిజం ప్రపంచ వ్యాప్తంగా వెళ్లిందని, దీన్ని ఓర్వలేకనే బిఆర్‌ఎస్ నేతలు కావాలని అబద్దాలను ప్రచారం చేసే పనిలో పడ్డారని అభిప్రాయపడ్డారు.

### సున్నా ఖర్చుతో ప్రపంచవ్యాప్తంగా ప్రచారం..

మిస్‌వరల్డ్2025 కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ టూరిజం ప్రమోషన్ (ప్రచారం) జరగడం గర్వంగా ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం రూ.200 కోట్లకు పైగా ఖర్చు పెట్టిందని బిఆర్‌ఎస్ నేతలు పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. మిస్‌వరల్డ్‌కు ప్రభుత్వం రూ.31 కోట్లు ఖర్చు పెట్టిందని.. స్పాన్సర్ల రూపంలో ప్రభుత్వానికి ఇప్పటి వరకు రూ.21 కోట్లు తిరిగి వచ్చాయని, ఇంకా రూ.10 కోట్లకు పైగా స్పాన్సర్ల నుంచి రావాల్సి ఉందని.. ఈ లెక్కన పైసా ఖర్చు లేకుండా ప్రపంచ దేశాలన్నీ కూడా తెలంగాణ వైపు చూసే విధంగా చేశామన్నారు. దీన్ని బిఆర్‌ఎస్ నేతలు జీర్ణించుకోలేక తలతోక లేని ఆరోపణలు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ టూరిజం ప్రమోషం కోసం బిఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.115 కోట్లు ఖర్చు పెట్టిందని తెలిపారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇంత ఖర్చు పెట్టినా ఒక్క ఉద్యోగం కూడా సంపాదించలేక పోయిందన్నారు.

### ఇబ్బంది పెట్టారనేది అవాస్తవం..

మిస్ ఇంగ్లాండ్‌ను ఇబ్బంది పెట్టారనేది వాస్తవం అయితే మిగతా 108 మంది పోటీదారులు చివరి వరకు ఉండేవారు కాదన్నారు. మిస్ వరల్డ్ పోటీల కోసం వచ్చిన అందగత్తెలు చివరిదాకా చాలా హ్యాపీగా ఉన్నారని చెప్పారు. ఏమీ జరగని దానికి ఏదో జరిగినట్టు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వాళ్లను ఇబ్బంది పెడితే.. మళ్లీ మళ్లీ తెలంగాణకు రావాలని ఉందని ఎందుకు చెబుతారని ప్రశ్నించారు. మిస్ వరల్డ్ విన్నర్‌గా గెలిచిన థాయిలాండ్ సుందరి ఓపల్ సుచాతకు తెలంగాణ ఆతిథ్యం, ఇక్కడి పర్యాటక ప్రాంతాలు నచ్చాయని చెప్పారు. తన జీవితంలో హైదరాబాద్‌ను మరువ.. అవకాశం వస్తే మళ్లీ ఇక్కడికి వస్తానని ఓపల్ సుచాత చెప్పారన్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... మిస్ వరల్ పోటీలను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతంగా నిర్వహించడాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు.ప్రజల దృష్టి మరల్చేందుకు అనవసర విషయాలను లేవనెత్తుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ది కోసం అసత్యాలను ప్రచారం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎంఎల్‌ఎ రాజేష్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ హన్మంతు జండగే, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ కె.లక్ష్మి పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## 10 నుంచి గాంధీభవన్‌కు మంత్రులు
### నేడు గాంధీభవన్‌లో ప్రారంభించనున్న మంత్రి పొన్నం



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌లో ఈనెల 10వ తేదీ నుంచి మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం పునప్రారంభం కానుంది. కొన్ని అనివార్య కారణాల వల్ల కొద్దిరోజులుగా ఆగిపోయిన ముఖాముఖి కార్యక్రమాన్ని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ చొరవ తీసుకుని మళ్ళీ ప్రారంభించనున్నారు. బుధవారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాన్ని తిరిగి పారంభిస్తారు. గాంధీభవన్‌లోని ఇందిరా భవన్‌లో ఈనెల 10వ తేదీ నుంచి ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ముఖాముఖీ జరుగుతుంది. మొదటగా రోజుకు ఇద్దరు కార్పొరేషన్ చైర్మన్‌లు, తర్వాత ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ఇతర ప్రజాప్రతినిధులు వరుసగా అందుబాటులో ఉంటారని టిపిసిసి ఒక ప్రకటనలో తెలియజేసింది.

---

**పదేళ్లలో తలసరి ఆదాయం రెట్టింపైతే**

# ప్రజల కొనుగోలు శక్తి ఎందుకు పెరగలేదు?
### సిపిఐ జనగామ జిల్లా మహాసభలో కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** పదేళ్లలో దేశ తలసరి ఆదాయం రెట్టింపు అయితే ఆకలి చావులు, రైతు ఆత్మహత్యలు ఎందుకు ఆగలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత తలసరి ఆదాయం రెట్టింపు అయితే ప్రజల కొనుగోలుశక్తి ఎందుకు పెరగలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎందుకు రాలేదని, రైతుల పంటకు గిట్టుబాటు ధర ఎందుకు లభించడం లేదని ప్రశ్నించారు. సిపిఐ జనగామ జిల్లా 4వ మహాసభలు నర్మెట మండల కేంద్రంలో మంగళవారం ప్రారంభం అయ్యాయి. బస్టాండ్ నుండి వినాయక గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్.రాజారెడ్డి అధ్యక్షత వహించగా కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మోదీ అధికారంలోకి రాకముందు కేవలం రూ.50 లక్షల కోట్లు ఉన్న అప్పు నేడు రూ.160లక్షల కోట్లకు పెరిగిందన్నారు. మోదీ వచ్చిన తరువాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇండ్లు లేని నిరుపేదలు పెరిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం పేరు మీద ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం రాజ్యమేలుతుందని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీకి బాస్ ట్రంప్ అని, అందుకే ఆయన చెప్పినట్లు వింటున్నారని మండిపడ్డారు. దేశ సంపద కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీల వద్దనే కేంద్రీకృతం అయ్యిందన్నారు. దేశంలో కార్పొరేట్, పెట్టుబడిదారులకు మోదీ ప్రభుత్వం ప్రజల సంపదను ధారాదత్తం చేస్తూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయంగా నిలుస్తారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలుకు కేవలం రూ.119 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందన్నారు. దీనిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెనకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లను ఆర్థిక, సాంఘీక, రాజకీయరంగాలలో, ఉద్యోగాలు, కాంట్రాక్టులలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐని స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో ఐదు లక్షల మందితో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమాలకు కేంద్రంగా ఉన్న జనగామ గడ్డపై ఎర్ర జెండా ఎగరవేయాలని, కష్టజీవులకు అండగా ఉంటు మరిన్ని పోరాటాలు చేయాలన్నారు.

**జనగామ జిల్లా అభివృద్ధి కోసం సమరశీల పోరాటాలు : తక్కెళ్లపల్లి**

జనగామ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సమరశీల పోరాటాలు నిర్వయిస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రెండు సంవత్సరాల క్రితం ఖాజీపేటలో ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన కోచ్ ఫ్యాక్టరీకి నేటికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టును పూర్తిచేయాలని, గుడిసెలు వేసుకొని ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న వారికి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా ఇళ్లు కట్టించాలన్నారు. సిపిఐ జనగామ జిల్లా 4వ మహాసభల సందర్భంగా నర్మెట మండల కేంద్రంలో భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించారు. నర్మెట బస్టాండ్ నుండి పురవీధుల గుండా సభాస్థలి వినాయక పంక్షన్ హాల్ వరకు ర్యాలీ జరిగింది. ర్యాలీలో ముందు భాగంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆదిసాయన్న, ఆకుల శ్రీనివాస్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య, జిల్లా సమితి సభ్యులు కావటి యాదగిరి, జువారి రమేష్, పాతూరి రమేష్, జీడీ ఎల్లయ్య, బోనగిరి కుమారస్వామి, నీల కనకయ్య, చామకూర యాకుబ్, మోటే శ్రీశైలం, గుగులోతు సఖి, సముద్రాల రాజు తదితరులు పాల్గొన్నారు.








తెలంగాణ సాయుధ పోరాట రథసారథి, స్వాతంత్ర్య సమరయోధుడు
పద్మవిభూషణ్
కామ్రేడ్ రావి నారాయణరెడ్డి
118వ జయంతి

04.06.2025 (బుధవారం), ఉదయం 10-30 గం॥లకు
రావినారాయణరెడ్డి ఆడిటోరియం, లోటస్‌పాండ్, బంజారాహిల్స్

సభాధ్యక్షులు : శ్రీ కందిమళ్ళ ప్రతాపరెడ్డి, కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్
అతిథులు : శ్రీ కె. జానారెడ్డి, మాజీ మంత్రివర్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు
డాక్టర్ కె.నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి
శ్రీ బి.వి.రాఘవులు, సిపిఐ(ఎం) పోలిట్‌బ్యూరో సభ్యులు
శ్రీ కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి
శ్రీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎం.పి.
శ్రీ ఎం. కోదండరాం, శాసనమండలి సభ్యులు
శ్రీ కె.శ్రీనివాస్ రెడ్డి, చైర్మన్, తెలంగాణ మీడియా అకాడమీ

ప్రజానాట్యమండలి కళాకారులచే విప్లవ గీతాలు ఆలపించబడును
అందరూ ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయవలసిందిగా ఆహ్వానిస్తున్నాం

తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు
9849080212, 9490952646


---

# ఆగస్టు 15నాటికి భూసమస్యలు పరిష్కారం
### భవిష్యత్‌లో భూ పంపిణీకి నియోజకవర్గ అసైన్‌మెంట్ కమిటీలు : డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క
### మంత్రులు తుమ్మల, పొంగులేటితో కలిసి ఖమ్మం జిల్లా మొలుగుమాడు గ్రామంలో భూ భారతి సర్వే – రెవెన్యూ సదస్సు ప్రారంభించిన భట్టి



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** భవిష్యత్‌లో అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి మిగులు భూములను, ఇంటి పట్టాల పంపిణీ, భూ పంపిణీ కార్యక్రమాన్ని తిరిగి ప్రవేశ పెడుతున్నట్లు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. దేశానికే తలమానికంగా భూ భారతి రెవెన్యూ చట్టాన్ని ప్రజా ప్రభుత్వం రూపొందించిందని, పేద ప్రజలకు చుట్టంగా భూ భారతి చట్టం పనిచేస్తుందన్నారు. ఖమ్మం జిల్లా, ఎర్రుపాలెం మండలం మొలుగుమాడు గ్రామంలో భూ భారతి సర్వే, రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల కార్యక్రమాన్ని మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సిసిఎల్‌ఎ నవీన్ మిట్టల్, సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమీషనర్ డాక్టర్ జ్యోతిబుద్ధ ప్రకాశ్, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌లతో కలిసి మంగళవారం ప్రారంభించారు. డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క మాట్లాడుతూ నక్షాలు లేకుండా మన రాష్ట్రంలో 413 గ్రామాల్లో దశాబ్దాల కాలంగా పాలన సాగుతోందని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కష్టాలు పడుతున్నారని, భూ భారతి చట్టం ద్వారా ఆ గ్రామాల ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు సర్వే చేయించి సరిహద్దులను నిర్ణయించి ఇబ్బందులు లేకుండా చేయాలని పైలెట్ ప్రాజెక్టు కింద మొలుగుమాడు గ్రామాన్ని ఎంపిక చేశామని తెలిపారు. దేశ చరిత్రలో చాలా అరుదుగా భూ భారతి వంటి అద్భుతమైన చట్టాలు వస్తాయని అన్నారు. 2020 సంవత్సరంలో వచ్చిన ధరణి చట్టం వల్ల అనేక సమస్యలు వచ్చాయన్నారు. భూభారతి చట్టం ప్రకారం ప్రతి సంవత్సరం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ అమ్మకాలు, కొనుగోలు వివరాలు అప్‌డేట్ చేస్తూ భూ రికార్డులను మాన్యువల్‌గా రాసి పంచాయతీ కార్యాలయంలో అతికించడం జరగుతుందని అన్నారు. అర్హులైన వారికి భూ భారతి చట్టం ద్వారా పట్టాలు పంపిణీ చేస్తామని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టాపాస్ పుస్తకాల్లో ఉన్న తప్పుల కారణంగా రైతులు చాలా ఆందోళనకు గురవుతున్నారని, గ్రామంలో ఉన్న తక్కువ విస్తీర్ణం భూమికి కూడా కొన్ని చోట్ల పట్టాల్లో వేల ఎకరాలు ఉన్నట్లు ఉందని తెలిపారు. భూముల ధరలు పెరిగిపోవడం వల్ల అన్నదమ్ములు, స్నేహితుల మధ్య కూడా గొడవలు జరిగి హత్యల వరకు దారితీస్తున్నాయని, వీటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు నుంచి వచ్చిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వేగవంతంగా సర్వే చేసి నిఖార్సైన రికార్డులు తయారు చేస్తామని తెలిపారు. భూముల రికార్డులు సక్రమంగా నిర్వహించేందుకు రైతులు, భూ యజమానులు నుంచి టోకెన్ అమౌంట్ సేకరించాలని మంత్రి సూచించారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 3 నుంచి 20 వరకు అన్ని రెవెన్యూ గ్రామాల్లో తహశీల్దార్ అధ్యక్షతన రెవెన్యూ బృందం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తెలిపారు. భూ హక్కులకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న గతంలో సివిల్ కోర్టుకు వెళ్లాల్సి ఉండేదని, నేడు రెవెన్యూ కోర్టు ద్వారా అధికారుల వద్ద వాటిని పరిష్కారం లభిస్తుందని అన్నారు. గతంలో ఇందిరమ్మ ప్రభుత్వం 25లక్షల ఎకరాల అసైన్డ్ భూములు వరకు పేదలకు పంచిందని, అటువంటి భూములను ధరణి పేరుతో లక్షలాది ఎకరాలను తారుమారు చేశారని, వీటిలో జరిగిన అక్రమాలను కూడా ప్రత్యేకంగా పరిశీలిస్తామని, అసైన్డ్ భూహక్కుదారులకు కూడా పూర్తి హక్కులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రైవేట్ వ్యవస్థల్లో మొదటి విడత కింద రాష్ట్రంలో 6వేల మంది సర్వేయర్లకు శిక్షణ అందించి వారికి లైసెన్స్ జారీ చేస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జెడి ప్రసన్నలక్ష్మి, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ యాకుబ్, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్‌డిఓ నర్సింహారావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి శ్రీనివాసులు, ఎర్రుపాలెం తహశీల్దార్ ఉషాశారద, పాల్గొన్నారు.

---

### రాజీవ్ యువ వికాసం రుణాల మంజూరు వాయిదాతో
# నైరాశ్యంలో నిరుద్యోగ యువత

(ఇ.చంద్రశేఖర్)

**హైదరాబాద్ :** రాజీవ్ యువ వికాసం రుణాల మంజూరు పత్రాల పంపిణీని వాయిదా వేయడం, రుణ పరిమితిని రూ.4లక్షల నుంచి లక్ష రూపాయలకు తగ్గిస్తున్నట్లు వార్తలు వస్తుండడంతో నిరుద్యోగ యువతలో నైరాశ్యం ఆవహించింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీన రుణాలను అందుకుంటామని ఎదురుచూసిన యువత నిరాశకు గురైంది. గత పదేళ్లలో నిరక్ష్యానికి గురైన నిరుద్యోగ యువతకు (ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలు, ఇబిసిలు) స్వయం ఉపాధి కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తొలుత సుమారు రూ.6250 కోట్లతో దాదాపు 5 లక్షల మంది నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించడం లక్ష్యంగా నిర్ణయించింది. మొదటి దశలో జూన్ మాసంలో 85,000 మంది లబ్ధిదారులకు రూ.650.00 కోట్లు సబ్జిడీ, రెండోదశలో జూలైలో 1,00,000 మందికి, రూ.1,000,00 కోట్ల సబ్సిడీ, మూడవ దశలో ఆగస్టులో 1,00,00 మందికి రూ.1,50,000 సబ్సిడీ, నాలుగవ దశలో సెప్టెంబర్‌లో రూ.1,00,234 మంది లబ్ధిదారులకు రూ.1,60,050 కోట్ల సబ్సిడీ, మొత్తం 4,93,234 మంది లబ్ధిదారులకు, రూ.6250 కోట్ల సబ్సిడీ ద్వారా రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ పథకాన్ని అన్ని రాజకీయ పార్టీలు కూడా అభినందించాయి. యువత నుంచి భారీ స్పందన లభించింది. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, లబ్ధిదారుల గుర్తింపు తదితర అన్ని ప్రక్రియలు సవ్యంగానే సాగుతున్నాయి. అయితే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో నిరుద్యోగ యువతకు నామమాత్రంగా రుణాలు ఇవ్వడం, నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోవడం, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు రాని వారు అధికంగా ఉండడంతో వారంతా కలిసి భారీ సంఖ్యలో 16,23,764 మంది స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం రుణాల పథకం కింద దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం రూ.6250 కోట్లతో మొత్తం 4,93,234 మందికి స్వయం రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించగా, అనూహ్యంగా 16 లక్షలకు పైగా దరఖాస్తులు రావడంతో ప్రభుత్వం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య ఇంత భారీగా ఉండగా, ఇంకా దరఖాస్తులు చేసుకోని వారు ఎంత మంది ఉంటారోనని, తద్వారా రాష్ట్రంలో నిరుద్యోగం ఎంత తీవ్ర స్థాయిలో ఉందో అర్థమౌతుందనే చర్చ కూడా కొనసాగుతున్నది. ఇదిలా ఉండగా, ఇంత మంది నిరుద్యోగులకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.6250 కోట్లు ఏ మాత్రం సరిపోవని, అదనంగా రెండింతల నిధులు అవసరమని ప్రభుత్వ, బ్యాంకుల అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ విషయంలో ఎలా ముందుకు వెళ్ళాలని ప్రభుత్వం ఆలోచిస్తున్న నేపథ్యంలో రాజీవ్ యువ వికాసానికి ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, అనర్హులకు యువ వికాసం అందకుండా చూడాలని పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని ముఖ్యమంత్రి దృష్టికి మంత్రులు తీసుకువచ్చారు. ఫలితంగా "పెద్ద సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి పరిశీలన తరువాతే అర్హుల జాబితాలను ప్రకటించాలి. మరింత లోతుగా విశ్లేషించి లబ్దిదారులను గుర్తించాలి. ఒక్క అనర్హుడికి కూడా రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి చేకూరవద్దు.

ఈ అంశంపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుందాం" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో ఉపాధిని పొందడం ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందని గంపెడాశలు పెట్టుకున్న నిరుద్యోగులు ఒక్క సారి గాదిగాలు పడ్డారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రుణాల మంజూరు పత్రాలను అందుకుంటామని ఆశగా ఎదురుచూసిన నిరుద్యోగులు నిరాశ చెందారు. పైగా రూ.4 లక్షల రుణ పరిమితిని లక్ష రూపాయలకు పరిమితం చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు వార్తలు వస్తుండడంతో రూ.4 లక్షల రుణం కోసం దరఖాస్తు చేసుకున్న యువతను అసంతృప్తికి గురిచేస్తున్నది. తమ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 5వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో రాజీవ యువ వికాసం రుణాల పంపిణీపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని నిరుద్యోగ యువత కోరుతున్నది.




---

### రాగల రెండురోజులు మోస్తరు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల రెండురోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పారు.

---

**గులాబీ నేతల్లో కొత్త టెన్షన్**
**పార్టీలో పరిణామాలతో గందరగోళం**

# ఎవరితో 'టచ్'లో ఉందాం?

(కె.సంతోష్ కుమార్)



**హైదరాబాద్ :** బిజెపిలో బిఆర్‌ఎస్ విలీనం అనే చర్చ నుంచి బయట పడేందుకు బిఆర్‌ఎస్ తీవ్ర స్థాయిలో ప్రయత్నిస్తోంది. విలీనం అనే పదం 'కారు' జోరుకు బ్రేకులు వేయడమే కాదు, గులాబీ శ్రేణులను ఆయోమయానికి గురి చేస్తోంది. ఒక వేళ గులాబీ పార్టీ విలీనమైతే తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటనే కొత్త చర్చకు తెర తీసింది. సాక్షాత్తు కెసిఆర్ కుమార్తె, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత బిజెపిలో బిఆర్‌ఎస్ విలీనం అంశాన్ని ప్రాస్తవించడంతో బిఆర్‌ఎస్ వర్గాల్లో సర్వత్రా అనుమానాలు, అయోమయానికి దారితీసింది. విలీనం ఉండబోదని మాజీ మంత్రి హరీశ్ రావు, మరి కొంత మంది ముఖ్య నాయకులు స్పష్టం చేస్తున్నప్పటికీ క్యాడర్‌లో మాత్రం నమ్మకం కలగడంలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. బిఆర్‌ఎస్‌లో ఆధిపత్యపోరు గులాబీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'బిఆర్‌ఎస్ వరంగల్ సభ'తో పార్టీలో జోష్ నింపింది. ఈ సభ ద్వారా ఆ పార్టీ శ్రేణులకు భవిష్యత్‌పై కొంత ఆశలు చిగురించాయి. కానీ 'ఆపరేషన్ సక్సెస్..పేషంట్ డెడ్' అన్న చందంగా వరంగల్ సభ మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**కవితకు వారంతా దూరం?**

కెసిఆర్‌కు కాళేశ్వరం విచారణ కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ బుధవారం ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నాకు ఎవరు పాల్గొంటారనే అంశం ప్రస్తుతం బిఆర్‌ఎస్‌లో చర్చనీయంశంగా మారింది. ఇప్పటికే కవిత కార్యక్రమాలకు చాలా మంది నాయకులు దూరంగా ఉంటున్నారు. ఇది వరకు బిఆర్‌ఎస్‌లో పార్టీ పదవులను,ఎంఎల్‌ఎ టికెట్లను, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఆశించే నాయకులు కవిత ఇంటి చుట్టూ తిరిగే వారు. ఇందులో చాలా మంది ఎంఎల్‌ఎ, ప్రజాప్రతినిధులుగా గెలిచిన తర్వాత కూడా కవిత వెంటే ఉన్నారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆ నాయకులంతా కవిత వద్ద కనీసం కనిపించడం లేదు. కవిత వెంట వెళ్తే బిఆర్‌ఎస్‌తో తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందనే భయం వారిని వెంటాడుతోంది. మరో వైపు కవిత వర్గం కూడా అటువంటి నాయకుల తీరు పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కవిత వెంటే కొందరు ముఖ్యులు మాత్రమే ఉంటున్నారు.

**ఆ ముగ్గురిలో ఎవరితో టచ్‌లో ఉందాం?**

బిఆర్‌ఎస్‌లో కొందరు నాయకులు ఎవరి వెంట ఉండాలి.?, ఎవరికి నిత్యంటచ్‌లో ఉండాలి ? అనే అంశంపైన బిఆర్‌ఎస్ నాయకులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ఇప్పటి వరకు కవిత వెంట తిరిగి, ప్రస్తుతం ఆమెకు దూరంగా జరిగితే భవిష్యత్తులో మళ్లీ కవితకు బిఆర్‌ఎస్‌లో ప్రాధాన్యత పెరిగితే తమ పరిస్థితి ఏమిటనేది ఆ నాయకులకు పెద్ద సమస్యగా మారింది. మరో వైపు కెటిఆర్ వెంటే కొనసాగాలంటే, ముందుగా కెటిఆర్ కోటరిని దాటడం కొందరు నేతలకు ఆటంకంగా మారింది. అలాగని మాజీ మంత్రి హరీశ్‌రావుకు అటాచ్ అవుదామంటే బిఆర్‌ఎస్‌లో ఆయన పాత్రపైన కూడా రకరకాల అభిప్రాయాలు, అంచనాలు, అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలాంటి గందరగోళ,అయోమయ పరిస్థితులను తాము ఎన్నడూ ఎదుర్కొనలేదనే కొందరు నాయకులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగానైన కెసిఆర్ కనీసం తెలంగాణ భవన్‌కు రాలేదు.పైగా గన్ పార్క్ వద్ద అమరులకు కూడా నివాళ్లు అర్పించలేకపోయారని, మరోవైపు కెటిఆర్ అమెరికాలో ఉన్నారని, ఇలాంటి అయోమయ పరిస్థితుల్లో తమ రాజకీయ భవిష్యత్తుపై గులాబీ నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు.


**శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానము**
గూడెం గ్రామము, దండేపల్లి మండలము, మంచిర్యాల జిల్లా.

Rc.No.SSSD/132/2025. బహిరంగ వేలము ప్రకటన-5 తేది: 03.06.2025

ఇందుమూలముగా యావన్మందికి మరియు వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా! మంచిర్యాల జిల్లా, దండేపల్లి మం॥, గూడెం గ్రామము యందలి శ్రీ సత్యనారాయణస్వామిదేవస్థానము వద్ద ఈ క్రింద తెలిపిన వేలము తేది: 12.06.2025 గురువారం రోజున మధ్యాహ్నం గం. 2:00ల నుండి దేవాదాయ శాఖ అధికారులు పర్యవేక్షణలో, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు మరియు హాజరు సభ్యుల సమక్షములో దేవాలయ కార్యనిర్వహణాధికారిచే దేవస్థాన కార్యాలయమునందు బహిరంగ వేలము నిర్వహించబడును.

| క్ర.సం. | బహిరంగ వేలము వివరములు | ధరావత్తు సొమ్ము | కాల పరిమితి |
|---|---|---|---|
| 1. | టెంకాయలు అమ్ముకొను హక్కు | రూ. 1,00,000/- | తేది: 19.06.2025 నుండి తేది: 18.06.2026 వరకు |
| 2. | వంట చెరకు, పూలు, పండ్లు అమ్ముకొను హక్కు | రూ. 50,000/- | తేది: 15.06.2025 నుండి తేది: 14.06.2026 వరకు |
| 3. | టీ, టిఫిన్స్ అమ్ముకొను హక్కు | రూ. 20,000/- | |

కావున ఆసక్తి గల వారు ధరావత్తు చెల్లించి ఆధార్ కార్డు ఇచ్చి బహిరంగ వేలము పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాను. ఇట్టి వేలము పాట షరతులు వేలము పాటకు ముందు చదివి వినిపించబడును. ఇతర వివరములకు కార్యాలయము నందు సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 2971-PP/CL/ADVT/1/2025-26, Date: 03-06-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నార్త్ ట్యాంక్స్ డివిజన్, హైదరాబాద్.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

| NIT Nos. | పనుల పేరు | ఇసివి మొత్తం (రూ.) | బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేది / ఆఖరి తేది |
|---|---|---|---|
| NIT No. 03/EE/NTD/2025-26, తేది: 03.06.2025 | మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, గాజులరామారం గ్రామం యొక్క మద్దెల కుంట ఎఫ్‌టిఎల్ ప్రాంతంలో ఆక్రమణదారులు పడేసిన చెత్తను తొలగించడం | రూ. 39,33,129/- | 04.06.2025@ 11.00 A.M / 13.06.2025@ 11.00A.M |
| NIT No. 04/EE/NTD/2025-26, తేది: 03.06.2025 | రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, మదీనాగూడ గ్రామంలో పటేల్ చెరువు ఇన్లెట్ వద్ద తెగిపోయిన కట్ట భాగాన్ని పునరుద్ధరించడం మరియు బాక్స్ కల్వర్టు నిర్మాణం, | రూ. 38,11,433/- | 04.06.2025@ 11.00 A.M / 13.06.2025@ 11.00A.M |
| NIT No. 05/EE/NTD/2025-26, తేది: 03.06.2025 | రంగారెడి జిల్లా, ఉప్పల్ మండలం, నాచారంలోని హెచ్ఎంటి నాచారం సరస్సు వద్ద కట్ట పునరుద్ధరణ | రూ. 16,72,407/- | 04.06.2025@ 11.00 A.M / 13.06.2025@ 11.00A.M |

సంప్రదించవలసిన అధికారి చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నార్త్ ట్యాంక్స్ డివిజన్, బుద్ధ భవన్, 3వ అంతస్తు, ఎం.జి.రోడ్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నార్త్ ట్యాంక్స్ డివిజన్, హైదరాబాద్.

DIPR R.O. No. : 3002-PP/CL/ADVT/1/2025-26, Date: 03-06-2025

ప్రజాపక్షం
బుధవారం, 04 జూన్


## మోదీ 3.0 : తొలి సంవత్సరం

ప్రధాని నరేంద్ర మోదీ మూడవ దఫా పదవీకాలంలో తొలి సంవత్సరం మే 9తో ముగుస్తుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బిజెపి దేశవ్యాప్తంగా వేడుకలకు సన్నద్ధమవుతోంది. ప్రభుత్వ ప్రధాన సాఫల్యాలను ప్రచారం చేసే బాధ్యత మంత్రులు, ఎంపిలకు అప్పగించబడింది. ఈ ఉత్సవాల నిర్వహణలో ఎన్‌డిఎ భాగస్వాములు కూడా పాలుపంచుకుంటున్నాయి. ప్రధానంగా ఐదారు అంశాలపై ప్రచారం చేస్తారు. పహల్గాం టెర్రర్ దాడికి భారతసైన్యం జవాబు మోదీ నాయకత్వం, వక్ఫ్ సవరణ చట్టం, బి.ఆర్.అంబేద్కర్‌ను గౌరవిస్తున్న తీరు, ఒక దేశం–ఒకే ఎన్నికలు ప్రతిపాదన, ఆర్థికవ్యవస్థ పరిమాణం ప్రపంచదేశాల్లో నాల్గవ స్థానానికి చేరటం, అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట పెరుగుదల. హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి విజయాలు వగైరా. మోదీ మూడవ ప్రభుత్వం బిజెపి మైనారిటీ ప్రభుత్వం, నితీశ్‌కుమార్, చంద్రబాబునాయుడుపై ఆధారపడి ఉన్నదన్న విషయం ప్రజలు గుర్తు చేసుకోకూడదనే రీతిలో మోదీ మొదటినుంచీ వ్యవహరిస్తున్నారు. పార్లమెంటులో బిజెపి సంఖ్యాబలం శక్తిమంతుడైన మోదీ నాయకత్వంలోనే 2019తో పోల్చితే 303 సీట్ల నుంచి 63 సీట్లు కోల్పోయింది. ఇండియా కూటమి ఎంపిల సంఖ్య 234కు పెరిగింది. అయితే బలం బలహీనతలను పరిగణలోకి తీసుకోకుండా మోదీ మునుపటి ఏకపక్ష పాలనలోనే చతురతతో ముందుకు సాగారు. ముందుగా నిర్ణయించిన 100 రోజుల కార్యక్రమంతో ప్రభుత్వాన్ని నడిపించారు. ఎప్పటిలాగే విదేశీయాత్రలతో తన ప్రతిష్టకు ఎన్నికలు జేసిన మచ్చ కనిపించకుండా చేసుకున్నారు. ఇంతలో వచ్చిన హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్ర ఎన్నికల్లో కాషాయజెండా ఎగరటం ప్రజల దృష్టిలో ప్రతిష్టను కూడగట్టింది. రెండోవైపున రానున్న బీహార్ ఎన్నికల దృష్ట్యా నితీశ్‌కుమార్‌కున్న అవసరాలు, ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ ప్రక్రియకు చంద్రబాబునాయుడు అధికంగా కేంద్రసహాయంపై ఆధారపడి ఉండటం నరేంద్రమోదీ వ్యక్తిగతంగా కలిసి వచ్చింది. కాబట్టి ఈ సానుకూలతలను ఉపయోగించుకున్న నరేంద్రమోదీ ఎన్‌డిఎను పటిష్టం చేసుకోవటమే గాక, రెండోవైపున ఇండియా కూటమిలో బీటలు తెచ్చే వ్యూహాలు అమలు జరిపారు. గొప్పలు ప్రచారం చేసుకోవటానికి వాటికి అంశాలున్నాయి. అయితే మెజారిటీ ప్రజల జీవితాలను నిరంతరం పీడించే ధరల పెరుగుదల, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు స్వల్ప ఎగుడుదిగుళ్లతో హెచ్చుస్థాయిలో కొనసాగుతూనే ఉన్నాయి.

పాకిస్తాన్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం, టెర్రరిస్టు దాడులు బిజెపికి ఎప్పుడూ ఉపయోగపడుతూనే ఉంటాయి. గతంలో పుల్వామా దాడిలాగే ఏప్రిల్‌లో పహల్గాంలో ముష్కరులు హిందూ టూరిస్టులను ఏరికోరి చంపిన ఘోరకలి, అనంతరం సైనికచర్య 'ఆపరేషన్ సిందూర్' మోదీ బృందం రాజకీయ ప్రచారానికి ఆయుధమైనాయి. గుజరాత్, మధ్యప్రదేశ్, బెంగాల్, బీహార్ ఇలా అన్ని సభల్లోనూ మహిళలను సమీకరించి వారి సిందూరానికి రక్ష మోదీ అన్నంతగా ప్రచారం చేస్తున్నారు. పాక్ టెర్రరిజాన్ని ఎండగట్టడానికి విదేశాలకు పార్లమెంటరీ అఖిలపక్ష బృందాలను పంపారు. తద్వారా పెంపొందించుకునిన జాతీయోన్మాదం వల్లబడుతుందా వచ్చే సంవత్సరం ఆరంభంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల వరకూ కొనసాగించటం, రాజకీయ లబ్ధి పొందటం బిజెపి వ్యూహం. అయితే పాకిస్తాన్–భారత్ మధ్య కాల్పుల విరమణ తానే సాధించానంటూ ట్రంప్ మోదీ అహానికి తూట్లు పొడుస్తున్నారు. ఇది అంతర్జాతీయంగా, దేశంలో మోదీ అనుకూల ప్రచారం గాలి తీస్తున్నది.

ప్రతిపక్షాలకు బిజెపి వ్యతిరేకత ఒక్కటే సరిపోదు. 2024 ఎన్నికలకు ప్రతిపక్ష ఐక్యవేదికగా ఆవిర్భవించిన 'ఇండియా' కూటమి పొందికలో ఉన్న వైరుధ్యాలే పెద్ద బలహీనత. భాగస్వాముల్లో అత్యధికం ప్రాంతీయ పార్టీలు, వాటికి రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో ఉన్న వైరుధ్యం కూటమిలో ఐక్యతకు ఆటంకమవుతున్నది. ఆకాంక్షాపరులు ఎక్కువ మంది ఉన్నందున రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని అంగీకరించటానికి వారు సిద్ధంగా లేరు. రెండోవైపున, కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించి బిజెపి ప్రతిపక్ష నాయకులను బెదిరించి లొంగదీసుకుంటోంది. గత పదేళ్లలో కేంద్ర ఏజెన్సీలు కనీసం 100 మంది ప్రతిపక్ష నాయకులపై దర్యాప్తు చేశాయి. వారిలో చాలామంది ఆ తర్వాత బిజెపిలో చేరారు. దర్యాప్తు ఎదుర్కొంటున్న 25 మంది ప్రతిపక్ష నాయకుల్లో 23మందిపై కేసులు ఉపసంహరణ జరిగింది. లేదా దర్యాప్తు నత్తనడక నడుస్తోంది. ప్రతిపక్ష పార్టీల్లో ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ఎన్నికల తర్వాత ఎక్కడా వినిపించడం లేదు. కారణం తెలియదు. ఈ పరిస్థితుల్లోనే నరేంద్రమోదీ ప్రభుత్వం తమ సొంత ఎజెండాను ముందుకు నడుపుతోంది. వక్ఫ్ సవరణ బిల్లు ఇందుకొక ఉదహరణ. లీగల్ చిక్కులన్నీ అధిగమించి 'ఒక దేశం–ఒకే ఎన్నికలు' చట్టం కోసం శతధా ప్రయత్నిస్తోంది. బిజెపి ఎజెండాలోని మూడో ముఖ్యాంశం ''ఉమ్మడి పౌరస్మృతి''ని ఈ తరంలో మోదీ నెరవేర్చవచ్చు. తస్మాత్ జాగ్రత్త!

# యుద్ధభూమిలో అంతరిస్తున్న మతం



డాక్టర్ దేవరాజు మహారాజు

ఒకప్పుడు ప్రపంచంపై క్రైస్తవాన్ని బలవంతంగా రుద్దిన ఇంగ్లాండ్‌లో ప్రస్తుతం అక్కడ అది తగ్గుముఖం పడుతూ ఉంది. క్రైస్తవాన్ని పాటించే జనాభా శాతం అక్కడ వేగంగా మారిపోతూ ఉంది. ఒకప్పుడు అది పూర్తి క్రైస్తవ దేశం. ఇటీవలి కాలందాకా అక్కడ అరవై శాతం క్రైస్తవులు ఉండేవారు. ఆ శాతం కిందికి పడిపోయి, ప్రస్తుతం అక్కడ నలభై ఆరు శాతం మాత్రమే ఉన్నారు. ఏ మతాన్నీ పాటించని వారి సంఖ్య ఇంగ్లాండులో గణనీయంగా పెరుగుతూ ఉంది. ఇటీవల కాలంలో 25.2 శాతం ఉన్న మానవవాదుల శాతం, 37.2కు పెరిగింది. మరో పదేళ్ళలో ఈ శాతం ఇంకా పెరిగే అవకాశాలున్నాయని పరిశీలకులు అంటున్నారు. అదే నిజమైతే, ఇంగ్లాండులో క్రైస్తవులు మైనార్టీలో పడిపోయే అవకాశం ఉంది. ఇలా చెప్పుకోవాలంటే మరో తాజా ఉదాహరణ ఉంది. క్రీస్తు జన్మ స్థలంలోనే క్రైస్తవం తగ్గుముఖం పడుతూ ఉంది.

రెండు వేల సంవత్సరాల క్రితం బెత్లెహామ్‌లో ఏసు క్రీస్తు జన్మించాడనీ, అక్కడి నుంచే ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవం వ్యాపించిందనీ ఒక అభిప్రాయం ఉంది. అది కూడా చాలా బలంగా ఉంది. అయితే ఆ బెత్లెహామ్ ప్రస్తుతం ఇజ్రాయెల్‌లో కాకుండా పాలస్తీనా ఆక్రమించిన ప్రాంతంలో ఉంది. అక్కడి ప్రధానమైన చర్చిల తాళాలు – రెండు ముస్లిం కుటుంబాల దగ్గర ఉంటాయి. ఉదయం వచ్చి తెరవడం, మళ్ళీ రాత్రికి వచ్చి మూయడం వారే చేస్తారు. ఆ మధ్యకాలంలో అక్కడి ఆరు క్రైస్తవ వర్గాలు వంతుల వారిగా తమ ఆధ్యాత్మిక సేవల్ని కొనసాగించుకుంటూ ఉంటాయి. ఇది ఇలా ఉంటే, అక్కడ మరో విచిత్రం కూడా జరుగుతూ ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు బెత్లెహామ్‌కు వచ్చి, ఏసు జన్మస్థలాన్ని దర్శించుకుని వెళ్ళొచ్చు. వారికి వీసాలు సులభంగా దొరుకుతాయి కూడా! కానీ, స్థానికంగా ఉన్న క్రైస్తవులకే అక్కడి ప్రధాన చర్చిలలోకి అనుమతి లేదు. అది పాలస్తీనా ఆక్రమిత ప్రాంతం కాబట్టి, అక్కడ ఆ విషయంలో రాజకీయ కారణాలు పనిచేస్తూ ఉండొచ్చు. ఏసు నడయాడిన ప్రాంతం ఇజ్రాయెల్– పాలస్తీనా వివాదాల్లో, యుద్ధంలో నలుగుతూ ఉంది. ఇది జగద్విదితం !

బెత్లెహామ్‌లోని ఏసుక్రీస్తు జన్మస్థలమని భావిస్తున్న నేటివిటీ చర్చ్, జెరూసలేంలో ఏసును శిలువ వేశారని భావిస్తున్న చోట ఉన్న హోలీ సెపల్చర్ చర్చి – ఈ రెండూ క్రైస్తవుల ప్రధాన చర్చ్‌లు. ఈ రెండు చర్చ్‌ల తాళాలే అక్కడి రెండు ముస్లిం కుటుంబాల ఆధీనంలో ఉన్నాయి. ఈ రెండు చర్చ్‌ల మధ్య ఉన్న 'స్టార్ స్ట్రీట్స్' (వీధు)లన్నీ వేల ఏళ్ళ క్రితం ఏర్పాటు చేసినవి. కాబట్టి, ఇప్పుడు అవి మరీ ఇరుకుగా, అసౌకర్యంగా అయిపోయాయి. అమితమైన భక్తి శ్రద్ధలున్న వారు తప్ప, మామూలు వారు ఆ వీధుల్లో తిరగాలంటే ఇబ్బంది పడతారు. ఒక రకంగా ఇష్టపడరు. ఇవీ.. అక్కడి పరిస్థితులు. అయితే ఇప్పుడక్కడ క్రైస్తవానికి తీవ్రమైన విఘాతం కలిగింది. ఇజ్రాయెల్ ఏర్పడినప్పుడు అక్కడ క్రైస్తవుల జనాభా ఎనభైశాతంగా నమోదయింది. ఇప్పుడు అది పన్నెండు శాతానికి పడిపోయింది. ఏసు జన్మించాడని భావిస్తున్న చోటే క్రైస్తవం అంతరించి పోవడం ప్రపంచం ప్రత్యక్షంగా చూస్తూ ఉంది. అందుకు కారణాలు చాలా ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి కొన్ని ఇలా ఉన్నాయని పరిశీలకులు చెపుతున్నారు.

1. ప్రపంచవ్యాప్తంగా మతాల పట్ల ప్రజల్లో ఏర్పడిన విముఖత.
2. మతం నేపథ్యంలో వచ్చే పండుగలంటే ఆసక్తి లేకపోవడం – ఒక వేళ జరుపుకుంటున్నా, ఏదో ఒక ఫార్మాలిటీగా, యధాలాపంగా జరుపుకోవడం.
3. అక్కడి యువత మెరుగైన అవకాశాలకోసం యూరోప్, మధ్య ప్రాచ్య దేశాలకు, కెనడా వంటి దేశాలకు వలస వెళ్ళడం జరుగుతూ ఉంది.
4. ఆక్రమణ, వలస, నిత్యం తనిఖీలతో స్థానికులు విసుగెత్తి పోతున్నారు.
5. పై కారణాల ప్రభావం అక్కడి జన జీవితం మీద ఒత్తిడి పెంచుతోంది. ఫలితంగా జనాభా తగ్గిపోతూ ఉంది.
6. క్రైస్తవుల సంఖ్య తగ్గిపోవడం వల్ల, అక్కడ క్రైస్తవం గడ్డురోజుల్ని ఎదుర్కొంటూ ఉంది.

క్రిస్టమస్ వచ్చిందంటే ప్రపంచవ్యాప్తంగా ప్రతి క్రైస్తవుడూ తన ఇంటిమీద ఒక నక్షత్రాన్ని (మోడల్) ప్రత్యేకంగా అలంకరించుకుంటాడు. రంగురంగులుగా అది వెలుగుతూ ఉండే విధంగా విద్యుత్ దీపాలు కూడా అలంకరించుకుంటాడు. కారణం ఏమంటే ఏసుక్రీస్తు జన్మించినపుడు ఆకాశంలో ఒక నక్షత్రం వెలిగింది అనే దానికి అది సంకేతం! అంతేకాదు, ఏసు తమ ఇంట్లోనే జన్మించాడని గర్వంగా ప్రకటించుకోవడానికి కూడా అది సంకేతం! ఆకాశంలో ఉండే నక్షత్రం తమకోసం ఏసుగా జన్మించాడని కూడా క్రైస్తవుల భావన! భావనలు సరే కానీ, ఏవైనా చారిత్రక ఆధారాలున్నాయా అంటే లేవు. రోమన్, ఈజిప్టు, గ్రీక్, మెసపటోమియా మొదలైన ప్రాచీన నాగరికత ల్లోని జానపద మత సాహిత్యంలో అద్భుత శక్తులను ప్రదర్శించే కల్పిత పాత్రల పుట్టినరోజు సామాన్యంగా డిసెంబర్ 25 అనే ఉంది. దాన్ని దృష్టిలో ఉంచుకుని, అనేక చర్చోపచర్చలు, తర్జనభర్జనల అనంతరం క్రీస్తు జీసస్ పుట్టిన రోజును కూడా డిసెంబర్ 25నే నిర్ణయించారు. అదే క్రిస్టమస్ అయ్యింది.

సాధారణ శకానికి ముందు పుట్టిన అరిస్టాటిల్, ప్లేటో వంటి వారి వివరాలు చరిత్రకు అందుతుండగా, దేవుడి కుమారుడు, పాపుల రక్షకుడు అని భావించే – ఏసుక్రీస్తు వివరాలు లభించకపోవడం విచిత్రంగా ఉంది. ఇక ఏసు చారిత్రక వ్యక్తి అని ప్రపంచానికి పరిచయం చేసిన వాడు జోసెఫస్ (Josephus) అని చెపుతున్నారు. కానీ, నిజంగానే ఆయన ఏసును చారిత్రక వ్యక్తి అని అన్నాడా? అనుమానమే! ఎందుకంటే అందుకు ఆధారాలే లేవు. Josephus మాత్రమేగాక, ఇంకా చాలామంది ఏసును చారిత్రక వ్యక్తి అని అన్నారని కొందరు బుకాయిస్తుంటారు. బుకాయింపు అని అన్నది ఎందుకంటే వారెవరూ తగిన ఆధారాలు చూపలేదు. పైగా వీరెవరూ ఏసుకు సమకాలీనులు కాదు, తర్వాత కాలంలో జీవించిన వారు. చాలామందికి తెలియని విషయమేమంటే – సాధారణశకం 354(సిఇ) దాకా 'క్రిస్టమస్ ' ఉనికిలో లేదు. అలాగే సాధారణ శకం 786 దాకా ప్రపంచ దేశాలలో ఎక్కడా క్రీస్తుపూర్వం/క్రీస్తుశకం అనే సంక్షిప్త రూపాలు వాడుకలో లేవు. (వీటిని మనం ఇప్పుడు BCE/CEగా వాడుతున్నాం) అమెరికాలోని కొన్ని క్రైస్తవ శాఖల్లో క్రిస్టమస్ జరుపుకోవడంపై సా.శ.1836కు ముందు నిషేధం ఉండేది. క్రిస్టమస్ జరుపుకోవడాన్ని తప్పుపట్టే క్రైస్తవ మత శాఖలు ఇప్పటికీ అక్కడక్కడా ఉన్నాయి. ఇలాంటి విషయాల గురించి ఎవరూ పెద్దగా మాట్లాడరు. క్రైస్తవులు కాని ఇతర మతస్థులు కూడా వేలం వెర్రిగా క్రిస్టమస్ జరుపుకుంటూ ఉంటారు. అయితే అది ఒక 'గెట్ టుగెదర్'గా సరదాగా గడపడం కోసం వినియోగిస్తారు.

ఇంతా చేస్తే క్రైస్తవంలో మహోన్నతమైన గొప్ప గొప్ప విషయాలు ఏమైనా ఉన్నాయా? అంటే ఇదిగో అవి ఇలా ఉన్నాయి. వారి పవిత్ర గ్రంథంలో దేవుడు చెప్పిన మాటలుః

1. నీ యజమానుని స్త్రీలను నీ కౌగిట చేర్చి, ఇశ్రాయేలు వారిని, యూదావారిని నీకు అప్పగించితిని... నీవు చూచుచుండగానే నేను నీ భార్యలను తీసి నీ చేరువ వానికి అప్పగించెదను. పగటియందు వాడు వారితో శయనించును. (2 సమూ. 8: 12)
2. వారి భార్యలను అన్యుల కప్పగింతును. వారు యహోవా వాక్యములను నిరాకరించిన వారు (ఇర్మియా 8:10) ఏమియూ మిగుల కుండా వారి ఇండ్లను, పొలములను, వారి భార్యలను ఇతరులకు అప్పగింపబడెదరు (ఇర్మియా 6:12)
3. బైబిలు బహుభార్యత్వమును, వేశ్యావృత్తిని, దాసీలతో శయనాన్ని అంగీకరిస్తూ ఉంది.
4. దావీదు హితీయుడైన ఊరియా భార్య బత్షేబను ఇంటికి పిలిచి ఆమెతో సంభోగిస్తాడు.
5. దావీదు కుమారుడైన అబ్షాలోము చెల్లెలు తామరన్నామెను దావీదు మరో కుమారుడైన అమ్నోను బలవంతంగా అనుభవించి వెళ్ళగొట్టేస్తాడు.
6. సోలోమను – ఫరో కుమార్తెనే గాక, మరొక 700 మందిని భార్యలుగా, 300 మందిని ఉప పత్నులుగా చేసుకుంటాడు. అతడు సమస్తమైన వారికంటే జ్ఞానవంతుడు అంటున్నది బైబిలు.
7. (ఎస్తేరు 2:21; 12:14) ష్వేరోషను రాజుకు రోజుకొక కన్య సంభోగానికి కావాలి. ఆమె మళ్ళా ఎప్పుడైనా రాజు పిలిస్తే తప్ప, అలా ఒంటరిగా ఉండిపోవాల్సిందే –

ఇలాంటివి చెప్పే వాడిని దేవుడు – అని అనే కన్నా 'బ్రోకర్' అని అనడం బావుంటుంది కదా?

వారి పవిత్ర మతగ్రంథాల్లోని ఇలాంటి విషయాల్ని జీర్ణించుకుని కొందరు క్రైస్తవ బ్రిటీషు రచయితలు – భారతదేశం – మొగలుల పాలనలో ఉన్నప్పుడు నిరాధారమైన విషయాల్ని గ్రంథస్థం చేశారు. మొగలు చక్రవర్తులకు ఒక్కొక్కరికి వెయ్యి, పదిహేను వందలమంది భార్యలుంటారని, వారికి స్వేచ్ఛ ఉండదని, వారు భవనాల్లోనే మగ్గిపోతుంటారని, వ్యక్తిత్వం ఉన్న మనుషులుగా కాకుండా, స్త్రీలని కేవలం భోగ వస్తువులుగా చూశారని రాశారు. మొగలు రాజులు మద్యానికి, జూదానికి, స్త్రీలోలత్వానికి బానిసలని రాశారు. నిజాయితీగా నిజాల్ని నమోదు చేసిన ఆనాటి చరిత్రకారులు, ఆధునిక చరిత్ర పరిశోధకులు తేల్చిన విషయాలు వేరే విధంగా ఉన్నాయి – మొగల్ మహిళలు ఎవరూ అనైతిక చర్యలకు పాలుపడలేదని, చాలామంది స్త్రీలు విద్యావంతులని, కొందరు రచయిత్రులు కూడా అయ్యారని తేల్చి చెప్పారు. అంతేకాదు, అనుభవజ్ఞులైన మహిళలు పరిపాలనా వ్యవహారాలలో చక్రవర్తులకు సలహాలిచ్చేవారని, కొందరు అంతర్జాతీయ స్థాయిలలో వ్యాపారాలు సాగించారనీ పూర్తి ఆధారాలతో రుజువు చేశారు. ఓర్వలేనితనంతోనూ, ఎదుటి వారిని తక్కువ చేసి చూపాలని ప్రయత్నించే వారి రాతల్ని, ప్రచారాల్ని మనం పట్టించుకోగూడదు. నిదానంగా నిజాల్ని తవ్వి బయటికి తీసుకోవాలి!

ఒక కోతి సూర్యుణ్ణి మింగిన థియరీలు మనకు ఉండొచ్చు – కన్యగా సూర్యుడితో గర్భం దాల్చిన కుంతి కథ మన వారసత్వ సంపద కావొచ్చు – కానీ, వర్జిన్ మేరీకి జీసస్ పుట్టడంలోనే మనకు తర్కం కావాలి! హాస్యంగా అనిపించినా ఇందులో నిజం ఉంది కదా? మతాలన్నీ ఒకే రకమైన కల్పనలతో పుట్టాయి.. పెరిగాయి. అందువల్ల, ఏ మతమూ ఎక్కువా కాదు, ఏదీ తక్కువా కాదు. 'వెధవాయిని నేను అని ఒకటంటే, నీకంటే ఎక్కువ వెధవాయిన్నేను' అని పోటీ పడుతున్నట్లుగా ఉంటాయి! మతాలన్నీ ఆధునికుడికి అర్థరహితమైనవి, పనికిరానివి. మతం ఆది మానవుడి భావన! సైన్స్ నేటి ఆధునిక మానవుడి ఆవిష్కరణ !!

**– సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త**

# భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు జెండా ఆర్.ఎన్



హైదరాబాద్ రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పునాదులు వేసిన నిర్మాతల్లో ఒకరుగా, నిజాం సంస్థానంలో రాచరిక వ్యవస్థపై తిరుగుబాటు చేసి భారత యూనియన్‌లో కలిసేటందుకు నైజామును గద్దె దించాలని.. సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన విప్లవ సేనాని రావి నారాయణరెడ్డి 118వ జయంతిని జరుపుకుంటూ వారు చేసిన త్యాగాలను స్మరించుకుందాం.

నాటి నిజాం నవాబు పాలనలోని హైదరాబాద్ రాష్ట్రంలో గాంధీజీ సిద్ధాంతాలకు ఆకర్షితులై.. వారి పిలుపుతో మొదటిసారిగా హరిజన సేవా సంఘాన్ని స్థాపించి దానికి రాష్ట్ర కార్యదర్శిగా 100కు పైగా హరిజన విద్యార్థులకు హాస్టల్ స్థాపించి అస్పృశ్యత నివారణకు, సహపంక్తి భోజనాలు నిర్వహించిన ప్రథముడు ఆర్ ఎన్ గారు. గాంధీజీ విదేశీ వస్తువుల బహిష్కరణ, స్వదేశీ ఖాదీ వస్త్రాలను ధరించాలని పిలుపుతో చర్కా ఉద్యమం, ఖాదీ బండారాలు నెలకొల్పిన ప్రథమ గాంధేవాది. 1930 జాతీయ సత్యాగ్రహంలో పాల్గొని' మాకొద్ది తెల్ల దొరతనమని' గొంతు కలిపిన దేశభక్తుడు.

1930లో ఏర్పాటైన ఆంధ్ర మహాసభ నిర్మాతల్లో ఒకరు. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నిర్మాతల్లో ప్రముఖుడు, ప్రథమ సత్యాగ్రహి. జైలు శిక్షలు అనుభవించిన ప్రథమ తెలంగాణ నాయకుడు. ఆంధ్ర మహాసభ అధ్యక్షుడిగా నిజాం నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా, పౌర హక్కుల కోసం గళం విప్పిన ప్రథమ రాజకీయవేత్త రావి నారాయణ రెడ్డి.

నిజాం రాచరిక పాలనలో వారికి తాబెదారులుగా ఉన్న భూస్వామ్య దొరల, జాగీర్దారి, దేశ్‌ముఖ్‌ల ఫ్యూడల్ విధానాన్ని వ్యతిరేకిస్తూ తిరుగుబాటు జెండా ఎత్తి.. దున్నేవానికి భూమి కావాలని నినాదం ఇచ్చిన ప్రథమ వ్యక్తి.. ముందుగా 500 ఎకరాల సొంత భూమిని పేదలకు పంచిన త్యాగశీలి. తెలంగాణలో వినోబాబావే చేపట్టిన 'భూదానోద్యమము'కి మార్గదర్శి.

నిజాం నిరంకుశ రాచరిక వ్యవస్థ పోవాలని సాయుధ సమరానికి పిలుపునిచ్చిన విప్లవకారుడు.

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రతిపక్ష ఉప నాయకుడిగా, నాయకుడిగా, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా ప్రతిభను చాటిన పార్లమెంటేరియన్, సంఘ సేవకుడు, కళాభిమాని, నిరాడంబరుడు, నిస్వార్ధ ప్రజా సేవకుడు, రాజకీయాలకు అతీతంగా అందరి అభిమానం, గౌరవం పొందిన ప్రజానాయకుడు.

జీవితమంతా దేశం కోసం అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం అంకితం చేసిన త్యాగశీలి. ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, భారత ప్రభుత్వము (మరణానంతరం) అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ పొందిన సమరయోధుడు రావి నారాయణరెడ్డి.

తెలంగాణ సాయుధ పోరాటాన్ని దేశ స్వతంత్ర పోరాటంలో భాగంగా గుర్తించాలని.. నైజాం వ్యతిరేక ఉద్యమంలో పోరాడి అమరులైన.. జైలు పాలై ఉరిశిక్షలు పొందిన కుటుంబాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గౌరవించాలని.. వారికి స్వాతంత్ర సమరయోధుల పింఛను అందించాలని కృషి చేసిన మహానుభావుడు..

తెలంగాణ సాయుధ పోరాట 40వ వార్షికోత్సవాల సందర్భంగా 1987లో తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల స్మారక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి.. దాని ద్వారా రాష్ట్రంలోని స్వాతంత్ర సమరయోధులను.. వారి కుటుంబాలను గౌరవించుకుంటూ.. సన్మానించుకొనటం జరుగుతుంది.

వారు 1991 సెప్టెంబర్ 7 మన నుండి దూరమైనప్పటికీ వారిని స్మరించుకుంటూ.. రావి నారాయణ రెడ్డి గారి పేరుతో తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్..ఆర్ ఎన్ ఆడిటోరియాన్ని నిర్మించి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నది. వారి 118వ జయంతి సందర్భంగా వారిని స్మరించుకుందాం.. వారు ఆశయాలు సాధనలో ముందుకు నడుచుదాం..

# 7 శాతం గ్రామీణ కుటుంబాలకే 100రోజుల పని

### ఉపాధి హామీ చట్టం అమలులో తాత్సారం

యుపిఎ తొలి ప్రభుత్వం 2005 సెప్టెంబర్‌లో ఆమోదించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (నోరేగా) ఉపాధి కోరిన పేదలకు సంవత్సరంలో కనీసం 100రోజులు పని కల్పించాలని ఆదేశించింది. అయితే దాని అమలుపై ఇటీవల జరిపిన మదింపులో 2024–25లో 7శాతం కుటుంబాలు మాత్రమే 100రోజల పనిని పూర్తి చేశాయి. అంతకుముందు సంవత్సరం కొద్దిగా మెరుగు – 7.6శాతం. చట్టం అమలు నత్తనడకను నిర్ధారించటానికి మరో ఉదాహరణ–కల్పించిన మానవ పనిదినాలు 2023–24లో 288.83కోట్లు కాగా 2024–25లో అవి 268.44కోట్లకు తగ్గాయి. ఇదే కాలంలో పనికోసం రిజిస్టర్ అయిన కుటుంబాలు 8.6 శాతం–అనగా 2023–24లోని 13.8 కోట్ల నుంచి 2024–25లో 14.98కోట్లకు పెరిగాయి. ఉపాధి కల్పనను ఇది మెరుగు పరచలేదు. సగటున ఒక్కొక్క కుటుంబానికి 50.18రోజులే పనులు కల్పించబడినాయి. 2023–24తో పోల్చి చూస్తే ఇది 4.3శాతం తక్కువ.

> మొత్తం కార్మికుల్లో 27.5శాతం, క్రియాశీలంగా ఉన్న కార్మికుల్లో 1.5శాతం 2025 ఏప్రిల్ 7 నాటికి ఆధార్ ఆధారిత చెల్లింపులకు అనర్హులుగా ఉన్నారు. వీరు మహారాష్ట్ర, గుజరాత్, జార్ఖండ్‌లో (వరుసగా 63.4; 58.1; 38.1 శాతం) ఎక్కువగా ఉన్నారు. ఈ అనర్హ కార్మికులను అధికారులు పనిలోకి తీసుకోవటం లేదు. ఆ విధంగా వారి పనిహక్కు నిరాకరించబడుతున్నది.

లిబ్‌టెక్ అనే సంస్థ కొద్దిరోజుల క్రితం విడుదల చేసిన నివేదికలో ఈ నిర్ధారణలు భాగం. ''భారతదేశంలో ప్రభుత్వ సేవల డెలివరీలో ఆసక్తి కలిగిన'' ఇంజినీర్లు, సామాజిక కార్యకర్తలు, సామాజిక శాస్త్రవేత్తలతో కూడినదీ సంస్థ. ఈ పరిశీలనలో పాల్గొన్నవారు 10సంవత్సరాలకు పైబడి అనేక రాష్ట్రాల్లో పనిచేశారు. అర్థవంతమైన విశ్లేషణ నిమిత్తం, 'జాతీయ ధోరణులకు నామమాత్రపు దోహదం చేస్తున్న' కొన్ని రాష్ట్రాలను మినహాయించినట్లు నివేదిక తెలిపింది.

కేంద్ర ప్రభుత్వం నోరేగా చట్టంలోని సెక్షన్ 27ను ఉపయోగించి మూడేళ్లకు పైబడి పశ్చిమబెంగాల్‌కు నిధులు విడుదల చేయటంలేదనే విషయం కూడా రికార్డు చేయబడింది. (పశ్చిమ బెంగాల్ ఆరంభం నుంచీ నోరేగాపై ఆధారపడిన ప్రధాన రాష్ట్రం. కాబట్టి ఈ అధ్యయనానికి లెక్కలు తీసుకునేటపుడు కొన్ని ధోరణుల్లో కొన్ని వ్యత్యాసాలు ఉండవచ్చు). పనుల నిర్వహణలో అక్రమాలు, లోపాలు నిధుల నిలుపుదలకు కారణంగా కేంద్రప్రభుత్వం చెప్పింది. అవి కేంద్రం పంపిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించాల్సిన అంశాలు) ఉపాధి చూపబడిన కుటుంబాలు 2.9శాతం (5.35కోట్ల నుంచి 5.51కోట్లు) తగ్గాయి. ఉపాధి తగ్గుదల ఒడిసాలో (34.8శాతం), తమిళనాడులో (21.1 శాతం), రాజస్థాన్‌లో (15.9 శాతం) గణనీయం. ఒడిసాలో బిజెపి తొలిసారి అధికారంలోకి వచ్చింది. రాజస్థాన్ ప్రస్తుతం బిజెపి పరిపాలనలో ఉంది. మహారాష్ట్రలో ఉపాధి గణనీయంగా – 39.7 శాతం పెరిగింది. కాంగ్రెస్‌పాలిత హిమాచలప్రదేశ్ (14.8శాతం), జెడియు నితీశ్ కుమార్ నాయకత్వంలోని బిహార్‌లో (13.3 శాతం) ఉపాధి కల్పన పెరిగింది.

గత ఆర్థిక సంవత్సరంలో నికరంగా 1.16 కోట్ల జాబ్‌కార్డులు జారీ చేశారు. 1.31 కోట్ల కార్మికులు జత చేరారు. అయితే 2022 –24 సంవత్సరాల్లో 7.8కోట్ల కార్డులు తొలగించిన లక్షణం రివర్స్ చేయబడింది. తొలగించిన జాబ్‌కార్డులు పునరుద్ధరించేందుకు ప్రామాణిక సూత్రాలు నిర్దేశించినందున 2024–25 ద్వితీయార్థ భాగంలో ఈ కార్మికులు తిరిగి చేరినట్లు లిబ్‌టెక్ క్షేత్రస్థాయి అధ్యయనం కనుగొన్నది. కార్డులు పునరుద్ధరించినా ఉపాధి కల్పన పెరగలేదు. విధానాల అమలులో రాష్ట్రస్థాయి లోపాలు కూడా ఇందుకు కారణమవుతున్నాయి.

మొత్తం కార్మికుల్లో 27.5శాతం, క్రియాశీలంగా ఉన్న కార్మికుల్లో 1.5శాతం 2025 ఏప్రిల్ 7 నాటికి ఆధార్ ఆధారిత చెల్లింపులకు అనర్హులుగా ఉన్నారు. వీరు మహారాష్ట్ర, గుజరాత్, జార్ఖండ్‌లో (వరుసగా 63.4; 58.1; 38.1 శాతం) ఎక్కువగా ఉన్నారు. ఈ అనర్హ కార్మికులను అధికారులు పనిలోకి తీసుకోవటం లేదు. ఆ విధంగా వారి పనిహక్కు నిరాకరించబడుతున్నది.

కోరిన వారందరికీ ఉపాధి, స్పందనాశీలమైన పాలనాయంత్రాంగం, జవాబుదారీతనం అనే నోరేగా చట్టం లక్ష్యాలకు పునరంకితం కావాలి. అయితే కేంద్రంలో 2014లో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ చట్టానికి చెడ్డరోజులు మొదలైనాయి. 60 ఏళ్ల తర్వాత కూడా ''ప్రజలు ఇంకా నేలలో గుంతలు తవ్వుతున్నారు'' అని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈ చట్టంపై దాడి చేశారు. 2015 ఫిబ్రవరిలో పార్లమెంటు బడ్జెట్ సమావేశంలో ప్రధానమంత్రి తన ఆగ్రహం, ద్వేషం వ్యక్తం చేశారు. ''కాంగ్రెస్ పాలన వైఫల్యాలకి పెద్ద గుర్తుగా ఉన్నందున'' ఈ పథకాన్ని కొనసాగించటమే రాజకీయ విజ్ఞత అన్నారు. అయితే పరిస్థితులు ఈ పథకాన్ని కేం ద్రం కొనసాగించేటట్లు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి చేశాయి. ముఖ్యంగా కోవిడ్ సంవత్సరాల్లో 2020–2022 మధ్య దేశవ్యాప్త గ్రామీణ దుస్థితి నుంచి పేదలను ఆదుకోవటానికి ఎంఎన్‌ఆర్‌ఇజిఎ ఒక్కటే సాధనంగా ఉపయోగపడింది. (ప్రధాని నరేంద్రమోదీ 2019 ఎన్నికలకు ముందు పేదలకు ఉచిత రేషన్ కింద బియ్యం, గోధుమల పంపిణీ ప్రారంభించి పొడిగించుకుంటూ వస్తున్నారు. 25 కోట్లమందిని పేదరికం నుంచి బయటకు తెచ్చామంటూనే 80 కోట్లమందికి ఉచిత రేషన్ ఇస్తున్నామని చెబుతున్నారు. ఇది ఎవరి వైఫల్యానికి నిదర్శనం.)

**– రవీంద్రనాథ్ సిన్హా**

# మేఘా వేమూరి బహిష్కరణ అప్రజాస్వామికం

అమెరికాలోని ప్రతిష్టాత్మక మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి)లో అభ్యసించిన భారత సంతతి విద్యార్థిని మేఘా వేమూరి గత నెల 29 నాడు 'గ్రాడ్యుయేషన్ డే' సందర్భంగా ప్రసంగిస్తూ ప్రధానంగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధ చర్యలను 'నరమేధం'గా పేర్కొనడం, తద్వారా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించారు. ఈ రకంగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న మారణకాండను విమర్శిస్తూ పాలస్తీనాకు అండగా నిలిచిన మేఘా వేమూరిని అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) గ్రాడ్యుయేషన్ వేడుకల నుండి బహిష్కరించినట్లు ఆ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ మెలిసా నోబెల్స్ ప్రకటించి ఆమెతో పాటు ఆమె తల్లిదండ్రులను సైతం క్యాంపస్ నుండి బయటకు పంపించడం అప్రజాస్వామికం. నిజానికి అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా వెలుగొందుతున్న అమెరికాలో ఈ తరహా ఘటన చోటుచేసుకోవడం 'అప్రజాస్వామ్యానికి నిదర్శనంగా నిలిచింది' అని చెప్పవచ్చు. నిజానికి 'ప్రజాస్వామిక దేశం అని గొప్పగా చెప్పుకునే అమెరికా దేశం చరిత్ర మొత్తం అప్రజాస్వామికమయం' అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.

గాజాలో ఒకపక్క ఇజ్రాయెల్ భీకర యుద్ధాన్ని కొనసాగిస్తున్న తరుణంలోను, అదే సమయంలో మరోపక్క విశ్వవిద్యాలయాల సంబంధాల గురించి అమెరికాలోని కళాశాల క్యాంపస్‌లలో నిరసనలు పెల్లుబుక్కుతున్న తరుణంలోను మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) వేదిక నుండి భారతీయ – అమెరికన్ విద్యార్థిని మేఘా వేమూరి ఇజ్రాయెల్ – పాలస్తీనా సంఘర్షణపై బలమైన రాజకీయ విమర్శనాత్మకమైన వ్యాఖ్యలు చేయడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించడమే కాకుండా విస్తృత చర్చకు దారితీస్తున్నది. ఈ తరుణంలో మేఘా వేమూరి చూపిన ధైర్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రజానీకం ప్రశంసిస్తూనే ఉన్నారు.

మేఘా వేమూరి తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు. అయితే ఆమె జార్జియా (అమెరికా)లోని ఆల్ఫారెట్టాలో పుట్టి పెరిగారు. ఆమె 2021లో ఆల్ఫారెట్ట హైస్కూల్ నుండి పట్టభద్రురాలయ్యారు. అదే సంవత్సరం ఆమె మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి)లో చేరి కంప్యూటర్ సైన్స్, న్యూరోసైన్స్, భాషాశాస్త్రంలో ట్రిపుల్ మేజర్‌తో తన అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీని పూర్తి చేశారు. గ్రాడ్యుయేటింగ్ క్లాస్ అధ్యక్షురాలిగాను ఆమె కొనసాగుతున్నారు. మెక్ గోవర్న్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బ్రెయిన్ రీసెర్చ్‌లో రీసెర్చ్ అసిస్టెంట్‌గాను ఆమె వ్యవహరించారు. మేఘా వేమూరి 2021లో నేషనల్ మెరిట్ స్కాలర్ అవార్డు పొందారు. తన విద్యా విజయాలకు మించి విప్లవాత్మక ఆలోచనలకు వేదికను అందించాలనే లక్ష్యంతో ఉన్న ఆమె మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) విద్యార్థి బృందం అయిన రిటర్న్ రెవల్యూషన్‌లోను సభ్యురాలుగా ఉన్నారు.



ఇటీవలి కాలంలో పాలస్తీనా అనుకూల, ఇజ్రాయిల్ వ్యతిరేక నిరసనలు తీవ్రతరం అవుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే మేఘా వేమూరి 'స్వేచ్ఛా పాలస్తీనా' కోసం గళమెత్తారు. పాలస్తీనా సంఘీభావానికి ప్రతీకగా మేఘా వేమూరి ఎరుపు కెఫెయే ( హిజాబ్ వంటిది) ధరించి గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొన్నారు. ఆమె ప్రసంగ వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది. ఈ రకంగా ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా మేఘా వేమూరి చేసిన విమర్శలను కొందరు వ్యతిరేకించారు. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) గ్రాడ్యుయేషన్ వేడుకను రాజకీయ మైదానంగా ఆమె ఉపయోగించారని మరికొందరు అభ్యంతరాలు వ్యక్తికరించారు.

మేఘా వేమూరి తన ప్రసంగంలో పాలస్తీనియన్లకు బలంగా సంఘీభావాన్ని ప్రకటించారు. 'పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ దాడికి అమెరికా మాత్రమే కారణం కాదు. మన యూనివర్సిటీ కూడా సహాయం చేస్తూ ప్రోత్సహిస్తూనే ఉంది. కాని ఇది సరైన విధానం ఏమాత్రం కాదు' అని మేఘా వేమూరి తీవ్రంగా విమర్శించారు. ఇజ్రాయెల్‌తో తమ వర్సిటీ చేసుకున్న ఒప్పందాలను ఆమె అంతే తీవ్రంగా వ్యతిరేకించారు. ఇజ్రాయెల్ పాలస్తీనాను భూమి నుండి పూర్తిగా తుడిచి పెట్టడానికి ప్రయత్నిస్తున్నది. ఆ ప్రయత్నాలలో మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) భాగం కావటం సిగ్గుచేటు. అలాగే ఇజ్రాయెల్ సైనిక సంస్థలతో రీసెర్చ్ సంబంధాలను కొనసాగిస్తుంది. ఇది గాజాలో జరుగుతున్న హింసకు సహాయం చేస్తుందని ఆమె ఘాటుగా విమర్శించారు. మసాచుసెట్స్ వర్సిటీ విద్యార్థులు అటువంటి హింసా కాండను ఎటువంటి పరిస్థితుల్లోనూ సహించే ప్రసక్తే లేదు. జాతి విధ్వంసాన్ని అసలే హర్షించరు. అలాంటి జాతి విధ్వంసక ఇజ్రాయెల్ సైన్యంతో సంబంధాలను తెంచుకోవాలి' అని ఆమె స్పష్టంగా పేర్కొనడం గమనార్హం.

గాజాలో శాశ్వత కాల్పుల విరమణకు మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) విద్యార్థులు పిలుపు ఇవ్వడం శుభపరిణామం. ఈ క్రమంలోనే విద్యార్థులు శాంతి కోసం ముందుకు సాగడం గమనార్హం. 'మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) యాజమాన్యం ప్రో– పాలస్తీనా ఉద్యమకారులను బెదిరింపులు, అణచివేతల ద్వారా అడ్డుకుంటూనే ఉంది. అయిననూ వారు వెనకడుగు వేయడం లేదు. ఇజ్రాయెల్ దాడిలో పాలస్తీనా ఒక రకంగా నాశనం అయిపోయింది. అక్కడి ప్రజలు బాంబు దాడులతో, ఆహార కొరతతో చనిపోతూ ఉన్నారు. మేము గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి జీవితాలను మరింతగా ముందుకు కొనసాగిస్తున్నాము. మా జీవితాలను శాస్త్రవేత్తలుగా, ఇంజనీర్లు గాను విద్యావేత్తలు గాను, నాయకులు గాను తీర్చిదిద్దుకుంటున్నాం. కాని గాజాలో ఇప్పుడు ఒక్క విశ్వవిద్యాలయం కూడా మిగలలేదు. అందువలన పూర్వ విద్యార్థులుగా మేము ఇజ్రాయెల్‌తో సంబంధాలను తెంచుకోవాలి అని వర్సిటీని డిమాండ్ చేస్తూనే ఉంటాము' అని మేఘా వేమూరి పేర్కొన్నారు.

విశ్వ విద్యాలయ అధికారుల నుండి బెదిరింపులు అణచివేతలను ఎదుర్కొంటున్నప్పటికీ 'విద్యార్థులు పాలస్తీనాకు మద్దతుగా నిలబడడం నూతన సమాజ నిర్మాణానికి బాటలు వేయనుంది' అని స్పష్టంగా చెప్పవచ్చు. అమెరికాలోని చాలా మంది విద్యార్థుల హృదయాలలో భయాందోళనలు గూడు కట్టుకుని ఉండేవి. మీరు ఇంతకు ముందు భయం అనే అడ్డంకిని ఎదుర్కొన్నారు. సరైన దానికోసం నిలబడటానికి మీరు దానిని ఇంధనంగా మార్చారు. ఒక జాతి విధ్వంసాన్ని ప్రజలు ఏమాత్రం సహించలేరు. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) స్వేచ్ఛా పాలస్తీనాను కోరుకుంటుందని మీరు ప్రపంచానికి చూపించారు' అని మేఘా వేమూరి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించడం నిజంగా అద్భుతం. అంతిమంగా మేఘా వేమూరి అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా 'స్వేచ్ఛా పాలస్తీనా కోసం చేసిన ప్రసంగం ప్రపంచ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది' అని సగర్వంగా చెప్పవచ్చు.


**– జె.జె.సి.పి.బాబూరావు,**
రీసెర్చ్ స్కాలర్, సెల్ : 9493319690



# జాతీయం

NATIONAL & GENERAL NEWS


## 4 వేలు దాటిన కరోనా కేసులు:37 మంది మృతి



**న్యూఢిల్లీ :** భారత్‌లో కరోనా వైరస్ విజృంభిస్తోంది. తాజాగా కొవిడ్ కేసుల సంఖ్య 4 వేలు దాటింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకూ కొత్తగా 64 మందికి పాజిటివ్‌గా తేలింది. 24 గంటల్లో ఐదుగురు మరణించారు. జూన్ 3 ఉదయం 8 గంటల సమయానికి దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 4,026కి పెరిగింది. వీటిలో కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 1,416 కేసులు వెలుగు చూడగా.. మహారాష్ట్రలో 494, గుజరాత్‌లో 397, ఢిల్లీలో 393, పశ్చిమబెంగాల్‌లో 372, కర్ణాటకలో 311 కేసులు వెలుగు చూశాయి. గత 24 గంటల్లో మహారాష్ట్రలో ఇద్దరు, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకూ కొవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య 37కి పెరిగింది.

# ట్రంప్ 'కాల్'కు ప్రధాని మోదీ లొంగిపోయారు


### కాంగ్రెస్ సమావేశంలో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ధ్వజం



**భోపాల్ :** భారత్‌పాక్ మిలిటరీ సంఘర్షణ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపు మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ లొంగిపోయారని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆ రోపించారు. మంగళ వారం భోపాల్‌లో కాంగ్రె స్ నాయకులు, కార్యకర్తలు హాజరైన 'సంగ్‌ధాన్ శ్రీజన్ అభియాన్' సమావేశాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. రాహుల్‌గాంధీ ఉపన్యసిస్తూ 1971 యుద్ధంలో అమెరికా తన 7వనౌకాదళాన్ని పంపినప్పటికీ ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఏమాత్రం వెనక్కి తగ్గలేదని గుర్తుచేశారు. 'డోనాల్డ్ ట్రంప్ నుంచి ఒక కాల్ రాగానే నరేంద్ర మోదీజీ వెంటనే లొంగిపోయారు. చరిత్రే అందుకు సాక్ష్యం. ఇదే బిజెపిఆర్‌ఎస్‌ఎస్ నిజస్వరూపం. వారు ఎల్లప్పుడూ వొంగి నమస్కరించేటోళ్లే 'అని రాహుల్ గాంధీ విమర్శించారు. అమెరికా బెదిరింపులను లెక్కచేయకుండా 1971లో భారత్ పాకిస్థాన్‌ను విభజించిందని రాహుల్ తెలిపారు. 'కాంగ్రెస్‌కు చెందిన బబ్బర్‌షేర్, ఆడసింహాలు అగ్రరాజ్యాలతో పోరాడతాయే తప్ప ఎప్పుడూ వొంగి నమస్కరించరు' అని ఆయన చెప్పారు. 1971 యుద్ధంలో ఒక్క ఫోన్ కాల్ కూడారాలేదన్నారు. 7వ నౌకాదళం, ఆయుధాలు, విమాన వాహక నౌక వచ్చినప్పటికీ ఇందిరాగాంధీ లొంగిపోలేదని, తాను ఏమీ చేయదల్చుకున్నానో అదే చేస్తానని చెప్పారని రాహుల్ వివరించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ గురించి మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యం నాటినుంచీ వారికి సరెండర్ లెటర్స్ రాయడం ఒక అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. 'ఇదే తేడా. ఇదే వారి లక్షణం. వారంతా ఇలాగే ఉంటారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండీ వారికి లొంగుబాటు లేఖలు రాసే అలవాటు ఉంది. కాంగ్రెస్ ఎప్పుడూ లొంగిపోదు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, (వల్లభాయ్) పటేల్ ఎప్పుడూ లొంగిపోలేదు. వారందరూ అగ్రరాజ్యాలకు వ్యతిరేకంగా పోరాడారు' అని రాహుల్ వివరించారు. సిద్ధాంతపరమైన యుద్ధం జరుగుతోంది. కాంగ్రెస్, భారత రాజ్యాంగం ఒకవైపు ఉంటే, మరోవైపు రాజ్యాంగాన్ని విశ్వసించని బిజెపిఆర్‌ఎస్‌ఎస్ ఉన్నాయి. నాశనం చేయాలని కోరుకుంటున్నాయి అని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా సామాజిక న్యాయం కోసం పోరాడుతోందని, కులగణను లోక్‌సభ ఆమోదించేలా కృషి చేస్తున్నదని చెప్పారు. మోదీజీ కేవలం నాలుగు కులాలు మాత్రమే ఉన్నాయని చెబుతారు. ఎన్నికల సమయం వచ్చేసరికి వారంతా ఓబిసిలుగా మారిపోతుంటారు అని రాహుల్ వ్యంగాస్త్రాలు సంధించారు. 'బాబులు రూపొందించిన' బిహార్ మోడల్ కులగణన కాకుండా తెలంగాణ మోడల్ కులగణను అమలు చేయాల్సిన అవసరం ఉందని రాహుల్ చెప్పారు. దేశంలోని యువతను ఫణంగా పెట్టి బిజెపి ప్రభుత్వం అదానీ, అంబానీలకు అధికారం ఇస్తున్నదని రాహుల్‌గాంధీ ఆరోపించారు.

# లడాఖ్ ప్రజలకు కొత్త రిజర్వేషన్లు


### ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ :** కేంద్ర పాలిత ప్రాంతం లడఖ్‌లో ప్రజల స్థానికత, రిజర్వేషన్లు, భాష పరిరక్షణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయమై ఒక ప్రకటన చేసింది. లడఖ్‌లో స్థానికులకు 85శాతం ఉద్యోగాలను రిజర్వ్ చేసింది. అంతేకాకుండా లడఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్స్‌లో మొత్తం సీట్లలో మూ డింట ఒకవంతు సీట్లను మహిళలకే కేటాయించింది. ఇంగ్లిషు, హిందీ, ఉర్దూ, భోటి, పుర్గి భాషలను లడఖ్‌లో అధికారిక భాషలుగా ప్రకటించింది. భాష, సంస్కృతి, భూమి, హక్కుల పరిరక్షణ కోసం స్థానికులు నిరసనలు లేవనెత్తుతున్న నేపథ్యంలో స్థానికుల ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ను 2019లో కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన తర్వాత జమ్ముకశ్మీర్‌ను రెండు భాగాలుగా ఏర్పాటుచేసిన విషయం విదితమే. జమ్ముకశ్మీర్, లడఖ్ ప్రాంతాలు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఏర్పాటు అయ్యాయి. ఈ నేపథ్యంలో అక్కడి ప్రజలు తమ భాష, సంస్కృతి, భూమి, హక్కుల పరిరక్షణ కోసం నిరసనలు వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో మంగళవారం నుంచి ఉద్యోగాలలో రిజర్వేషన్ల పాలసీలు, అటానమస్ కౌన్సిళ్లు, నివాస నిబంధనలు, భాషల పాలసీలలో నూతన మార్పులు అమలులోకి వస్తున్నాయి. దీనికి సంబంధించి ప్రభుత్వం బహుళ నోటిఫికేషన్లు జారీచేసింది. కొత్త రూల్స్ ప్రకారం...లడఖ్‌లోని కేంద్ర పాలిత ప్రాంతంలో 15సంవత్సరాల పాటు నివాసిస్తూ ఉన్నవారు, ఏడు సంవత్సరాలపాటు విద్యను అభ్యసించి, ఇక్కడి కేంద్ర పాలిత ప్రాంతమైన లడఖ్‌లో నివాసం ఉంటూ క్లాస్ 10 లేదా 12 పరీక్షకు హాజరైనవారు కంటోన్మెంట్ బోర్డు తప్ప కేంద్రపాలిత ప్రాంతం, లోకల్ లేదా ఇతర అథారిటీ కింద ఏ ఉద్యోగంలోనైనా నియామకం చేసే ప్రయోజనాన్ని కలిగిఉంటారు. ఈ కేంద్రపాలిత ప్రాంతాలలో 10సంవత్సరాలకు పైబడి సేవలు అందించిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, ప్రభుత్వ రంగ సంస్థలు లేదా కేంద్ర ప్రభుత్వానికి చెందిన స్వయం ప్రతిపత్తి సంస్థ అధికారులు, ప్రభుత్వరంగ బ్యాంకులు, చట్టబద్ధమైన సంస్థలకు చెందిన అధికారులు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు చెందిన అధికారులు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన గుర్తింపుపొందిన పరిశోధనా సంస్థలకు చెందిన అధికారులు ఎవరైతే ఉంటారో వారంతా ఇక్కడ నివాసం ఉండటానికి అర్హులుగా నిబంధనలు రూపొందించారు. ఎకనామికల్లీ వీకర్ సెక్షన్లు (ఇడబ్ల్యుఎస్)కు చెందిన వారు 10శాతం రిజర్వేషన్లు పొందడం కొనసాగనున్నది. లడఖ్‌లోని అనేక సంస్థలు దశాబ్దాలుగా ఈ ప్రాంతానికి ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతాన్ని డిమాండ్ చేయగా 2019, ఆగష్టు 5న నెరవేరింది. అయినప్పటికీ శాసనసభకు తమ ప్రతినిధులను ఎన్నుకునే విషయంలో లడఖ్‌లోని అనేక మంది ప్రజలు సంతోషంగా లేరు. 2024, ఆగష్టులో కేంద్ర ప్రభుత్వం లడఖ్‌లోని కేంద్ర పాలిత ప్రాంతం కింద 5జిల్లాలను సృష్టించింది. జన్స్‌కర్, డ్రాస్, షమ్, నుబ్రా, చాంగ్‌థాంగ్‌లను 5జిల్లాలుగా ఏర్పాటు చేసింది. కేంద్రపాలిత ప్రాంతంగా లడఖ్ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నియంత్రణలోని ప్రత్యక్ష పాలనాయంత్రాంగం కిందకు వచ్చింది. 2024, అక్టోబర్‌లో క్లైమేట్ యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్ తమ డిమాండ్లపై గట్టిగా గళమెత్తుతూ దేశ రాజధాని ఢిల్లీలో నిరవధిక నిరాహారదీక్షకు కూర్చున్నారు. 2024, డిసెంబర్ 3న లడఖ్ నుంచి హాజరైన పౌర సమాజంనాయకులతో చర్చలు జరిపారు. మళ్లీ ఈ ఏడాది (2025) జనవరి 15, మే 27న కూడా కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపిన నేపథ్యంలో ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

# ప్రీమియం ప్రజలది... లబ్ధి అదానీకి...

### ఎల్ఐసి అదానీ గ్రూప్‌లో ఎల్ఐసి రూ.5,000 కోట్ల పెట్టుబడి పై రాహుల్‌గాంధీ విమర్శ






**న్యూఢిల్లీ :** ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసి అదానీ గ్రూప్‌లో రూ.5,000 కోట్ల పెట్టుబడి పెట్టడంపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ నిధులను ప్రైవేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేందుకు ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. 'డబ్బు, పాలసీ, ప్రీమియం మీదే; భద్రత, సౌలభ్యం, అదానీకి ప్రయోజనం' అని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. భారతదేశంలో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ యుటిలిటీ అయిన అదానీ పోర్ట్, స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ (ఎపిసెజ్) గత వారం తన అతిపెద్ద దేశీయ బాండ్ ఇష్యూలో రూ.5,000 కోట్లు సేకరించినట్లు తెలిపింది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) నుండి 15 సంవత్సరాల నాన్‌కన్వర్టబుల్ డిబెంచర్ (ఎన్‌సిడి) ద్వారా ఎపిసెజ్ ఈ నిధిని సేకరించిందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్‌సిడిలను పోటీతత్వ సంవత్సరానికి 7.75 శాతం కూపన్ రేటుతో సేకరించారు. సాధారణ ప్రజల బీమా ప్రీమియంల ద్వారా సేకరించిన ఎల్ఐసి ప్రజా నిధులను అదానీ గ్రూప్‌లో పెట్టుబడి పెట్టిందని రాహుల్ ఆరోపిస్తున్నారు. ఎల్ఐసి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న దేశీయ ఆర్థిక సంస్థ. ఇది భారత స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతుంది.

## వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేస్తే ఊరుకోం

### కమల్‌హాసన్ హైకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ :** ప్రముఖ నటుడు, రాజకీయ నాయకు డు కమల్ హాసన్‌పై కర్ణాటక హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజల మనోభావాలను దెబ్బతీసేందుకు వాక్ స్వాతంత్ర్యం హక్కును దుర్వినియోగం చేయొద్దని ఆయనను హెచ్చరించింది. తీవ్ర వివాదానికి కేంద్ర బిందువుగా మారిన 'కన్నడ భాష తమిళం నుంచే పుట్టింది' అనే వ్యాఖ్యను ఉపసంహరించుకోవాలని కమల్‌కు హైకోర్టు మంగళవా రం సూచించింది. కన్నడ భాషపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు థగ్‌లైఫ్ సినిమాను ప్రదర్శించకూడదన్న కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కమల్ హాసన్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు నటుడు కమల్ హాసన్ తీరు పై అసహనం వ్యక్తం చేసింది. 'మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోలేరు. కానీ అందుకు క్షమాపణలు చెప్పొచ్చు. పగలగొట్టి వం దేసిన గుడ్లను మీరు పగలగొట్టని పూర్వ స్థితికి తీసుకెళ్లలేరు' అని కమల్‌కు హైకోర్టు హితవు పలికింది. గతంలో ఎప్పుడో ఏదో జరిగిపోయి ఉంటే, దాన్ని రివర్స్ చేయలేమనే అర్థాన్ని ఇచ్చే ఒక ఆంగ్ల నానుడిని ప్రయోగిస్తూ న్యాయస్థానం ఈ కామెం ట్స్ చేసింది. 'మీరు సాధారణ వ్యక్తేం కాదు. మీకు వాక్ స్వాతంత్ర్యం ఉంది. కానీ దానితో ఇతరులను బాధపెట్టకూడదు. ఇతరులను బాధపెట్టడం కోసం మీకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను ఇవ్వలేదు. ఇప్పటికైతే ఈ విషయాన్ని మీకే వదిలేస్తున్నాం. మీరు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమాపణలు చెప్పండి' అని కమల్‌కు హైకోర్టు నిర్దేశించింది.

**'థగ్ లైఫ్' సినిమాను ప్రస్తావించిన హైకోర్టు**

గురువారం (జూన్ 5న) విడుదలకానున్న కమల్ హాసన్ సినిమా 'థగ్ లైఫ్'ను ఈ సందర్భంగా న్యాయస్థానం పరోక్షంగా ప్రస్తావించింది. 'కన్నడ భాషను ఉద్దేశించి మీరు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోండి. కర్ణాటకలోనూ కోట్లు సంపాదించుకోవచ్చు. మీకు కన్నడ ప్రజలు అక్కర్లేదని భావిస్తే ఆదాయాన్ని వదులుకోండి' అని కమల్‌ను హైకోర్టు కోరింది.


# ఐఎస్ఐ గూఢచారి అరెస్టు

### ఆర్మీ సమాచారం పాక్ చేరవేస్తున్నట్లు గుర్తింపు

**చండీగఢ్ :** పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ.. భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్న పాక్ గూఢచారిని పంజాబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. తర్న్ తరణ్ జిల్లాకు చెందిన గగన్‌దీప్ సింగ్ అనే వ్యక్తికి పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆర్మీ దళాల మోహరింపులు, వ్యూహాత్మక ప్రదేశాల వివరాలతో సహా సున్నితమైన సమాచారాన్ని అతడు ఐఎస్ఐకి చేరవేసినట్లుగా గుర్తించామని పంజాబ్ డిజిపి గౌరవ్ యాదవ్ తెలిపారు. గగన్‌దీప్ సింగ్ గత ఐదేళ్లుగా ఖలిస్తానీ ఉగ్రవాది గోపాల్ సింగ్ చావ్లాతో సంప్రదింపులు జరుపుతున్నాడని.. అతడి ద్వారా పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్ (పిఐఒలు)తో పరిచయాలు చేసుకున్నాడని ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఆశ్రయం పొందుతున్న ఖలిస్తానీ ఉగ్రవాది గోపాల్ చావ్లా, ఐఎస్ఐ సహకారంతో భారత్‌లో గూఢచర్య రాకెట్‌ను నడుపుతున్నాడని, ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆర్మీ ప్రణాళికలు తెలుసుకోవడానికి వీరిని ఉపయోగించుకున్నాడని పోలీసులు తెలిపారు. లష్కరే తయ్యిబా చీఫ్ హఫీజ్ సయీద్‌తోనూ అతడికి సంబంధాలు ఉన్నాయన్నారు. గగన్‌దీప్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని పరిశీలించగా.. దేశానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలు, సైన్యానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాక్‌కు లీక్ చేసిన ఆధారాలు లభించాయన్నారు. అంతేకాకుండా అతడికి 20మందికి పైగా ఐఎస్ఐ ఏజెంట్లతో పరిచయాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ చర్యల వల్ల జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత దేశంలో ఉంటూ..పాక్‌కు గూఢచర్యం చేస్తున్న దేశద్రోహులను గుర్తించడానికి అధికారులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పాక్‌కు గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలపై ఇప్పటివరకు యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా సహా పలువురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు ఉగ్ర సంబంధాలు

### ముగ్గురిని ఉద్యోగం నుంచి తొలగించిన జమ్ముకశ్మీర్ ప్రభుత్వం




**జమ్ము :** లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించిన ముగ్గురు ముగ్గురు ఉద్యోగులపై జమ్ముకశ్మీర్ ప్రభుత్వం వేటు వేసింది. వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఓ పోలీస్ కానిస్టేబుల్ మాలిక్ ఇష్ఫాక్ నసీర్, స్కూల్ టీచర్ అజాజ్ అహ్మద్, ప్రభుత్వ వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్ వసీం అహ్మద్‌ఖాన్ ఉన్నారు. జాతీయ భద్రతా ప్రయోజనాలరీత్యా వీరిని తొలగిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. లెఫ్టినెంట్ గవర్నర్ కార్యవర్గం ఇప్పటివరకు 75 మంది గవర్నమెంట్ ఉద్యోగులకు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించి.. వారిని తొలగించింది. జమ్ముకశ్మీర్‌లో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఉగ్రవాదులకు సహకరించే వారి కోసం వేటను కొనసాగిస్తోంది. దీంతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల్లో సానుభూతిపరులను కూడా గుర్తిస్తోంది. తాజాగా తొలగించిన ముగ్గురు ఉద్యోగులు ఉగ్రమూకకు సరకులు అందజేయడం, ఆయుధాల స్మగ్లింగ్, భద్రతా దళాలకు వ్యతిరేకంగా ముష్కరుల కార్యకలాపాలకు సాయం చేయడం వంటివి చేసినట్లు తేలింది. మాలిక్ ఇష్ఫాక్ 2007లో కానిస్టేబుల్‌గా బాధ్యతలు స్వీకరించాడు. అతడి సోదరుడు మాలిక్ ఆసిఫ్ పాక్‌లో శిక్షణ పొందిన లష్కరే ఉగ్రవాది. 2018లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో అతడిని మట్టుబెట్టారు. సోదరుడి మరణం తర్వాత కూడా ఇష్ఫాక్ ఉగ్ర కార్యకలాపాలను కొనసాగించాడు. ఉగ్రవాదులకు ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలను ఎక్కడ జారవిడవాలో పొజిషన్లను గుర్తించేవాడు. ఆ లొకేషన్ జిపిఎస్ కోఆర్డినేట్స్‌ను పాక్‌లోని హ్యాండ్లర్లకు పంపేవాడు. ఇక అక్కడికి చేరిన ఆయుధాలను గుర్తించి.. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులకు చేరవేసేవాడు. 2021లో తొలిసారి ఆయుధాలు, పేలుడు పదార్థాల చేరవేత కేసులో ఇతడికి లష్కరేతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇక అజాజ్ అహ్మద్ 2011లో విద్యాశాఖలో టీచర్‌గా ఉద్యోగంలో చేరాడు. అతడు హిజ్బుల్ ముజాహిద్దీన్ సంస్థకు ఆయుధాలు, ప్రచార సామగ్రిని స్మగ్లింగ్ చేసేవాడు. 2023లో పోలీసులు నిర్వహించిన సాధారణ తనిఖీల్లో అతడు, అతడి మిత్రుడు దొరికిపోయారు. అతడికి పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని హిజ్బుల్ ఆపరేటివ్ అబిద్ రంజాన్ షేక్ నుంచి ఆయుధాలు వచ్చినట్లు గుర్తించారు. గత కొన్నేళ్లుగా అతడు ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొంటున్నాడు. హిజ్బుల్‌కు కశ్మీర్‌లోని పూంచ్‌లో నమ్మకమైన కార్యకర్తగా ఎదిగాడు. ఇక ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వసీమ్ అహ్మద్ ఖాన్ లష్కరే, హిజ్బుల్ సంస్థల కోసం పనిచేస్తున్నాడు. జమ్ముకశ్మీర్‌లో సంచలనం సృష్టించిన జర్నలిస్ట్ సుజాత్ బుఖారీ, ఆయన అంగరక్షకుడి హత్య కుట్రలో ఇతడి హస్తం ఉంది. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను ఘటనా స్థలం నుంచి తప్పించేందుకు ఇతడే సాయం చేసినట్లు గుర్తించారు. 2018లో ఆగస్టులో శ్రీనగర్‌లోని బట్ మాలూ వద్ద ఉగ్రదాడిపై విచారణ సమయంలో ఇతడిని తొలిసారి అరెస్ట్ చేశారు.

### ఖీర్ భవానీ మేళా వద్దకు భక్తులు రావడమే...

# పహల్గామ్ 'నేరస్తులకు తగిన సమాధానం'

### నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షులు ఫరూఖ్ అబ్దుల్లా



**తుల్ముల్లా (జమ్ముకశ్మీర్) :** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత లోయలోని మేళా ఖీర్ భవాని వద్దకు కశ్మీరీ పండిట్లు తిరిగివచ్చి ఉండటం ఆ నేరస్తులకు 'తగిన సమాధానం' అని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) అధ్యక్షులు ఫరూఖ్ అబ్దుల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఇది (మేళా వద్ద భక్తుల హాజరు) ఒక పెద్ద విషయం. ఇది అంతా మాత (ఆలయదేవత) చేస్తున్నది. ఆమే వారిని వారి ఇళ్లకు రావాలని ఇక్కడకు పిలిచింది' అని ఫరూఖ్ అబ్దుల్లా గందెర్బల్ జిల్లాలో ఇక్కడ నిర్వహించే ఏడాది మేళాలో మంగళవారం ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా అన్నారు. విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ సమాధానం చెప్పారు. అబ్దుల్లా మాట్లాడుతూ ఉగ్రదాడి తర్వాత నాలుగు రోజులపాటు జరిగిన సైన్యం సంఘర్షణపై ప్రజలు భయాన్ని వదులుకోవాలని, భక్తులు ఎవరైనా ఎలాంటి జంకు బొంకు లేకుండా జమ్ముకశ్మీర్‌కు రావాలని, ఇప్పటికే ఆలయాన్ని సందర్శించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారని చెప్పారు.'జమ్ముకశ్మీర్‌లో ఏదైనా కొట్లాట జరుగుతుందేమోనని ప్రజలు భయపడుతున్నారు. ఈ కారణంగా వారు మాతా వైష్ణోదేవీ ఆలయాన్ని సందర్శించేందుకు రావడం లేదు. భయాన్ని వీడాలని నేను ప్రజలకు చెప్పదలచుకున్నాను. వచ్చి మాతను దర్శించుకోవాలి' అని ఆయన విజ్ఞప్తి చేశారు. జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి కూడా అయిన ఫరూఖ్ అబ్దుల్లా మాట్లాడుతూ జులై 3న ప్రారంభం కానున్న ఈ వార్షిక అమర్‌నాథ్ యాత్రకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.'భోలేనాథుడిని దర్శించుకునేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తారని నేను ఆకాంక్షిస్తున్నాను' అని ఫరూఖ్ అబ్దుల్లా చెప్పారు.

### వయోజన అక్షరాస్యత సవాళ్లపై...

## తమిళనాడు, త్రిపుర,ఢిల్లీ 'టాప్'

### ఎఫ్ఎల్ఎన్ఏటి ఫలితాలు వెల్లడి

**న్యూఢిల్లీ :** వయోజన అక్షరాస్యత, విద్యకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కోవడంలో అత్యుత్తమ ప్రదర్శకులుగా ఢిల్లీ, త్రిపుర, తమిళనాడు అగ్రస్థానంలో నిలిచాయి. కాగా అదే సమయంలో ఉత్తరాఖండ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ప్రశంసనీయ ఫలితాలను రాబట్టడంలో వెనకంజలో ఉన్నారు. ఫౌండేషనల్ లిటరసీ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్ (ఎఫ్ఎల్ఎన్ఏటి) ఈ ఫలితాలను వెల్లడించాయి. ఎఫ్ఎల్ఏఎన్‌టి అనేది ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా ధృవీకరణకు సంబంధించి జాతీయస్థాయి అంచనాపై దృష్టి సారించిన సంస్థ. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నిరక్షరాస్యులైన జనాభాకు శిక్షణ ఇచ్చి, ఆ తర్వాత పరీక్ష నిర్వహించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దబడిన వారుగా నిర్ధారిస్తుంది. ఈ అంచనా మూడు అంశాలకు సంబంధించినదిగా ఉంటుంది. రీడింగ్, రైటింగ్, న్యూమరసీకి సంబంధించి అంచనా వేయబడుతుంది. ఒక్కొక్క అంశంలో 50మార్కులు చొప్పున మొత్తం 150మార్కులకు పరీక్ష ఉంటుంది. ఈ టెస్ట్ ప్రాథమిక అక్షరాస్యత, నమోదిత అక్షరాస్యత లేని అభ్యాసకుల సంఖ్యను అంచనావేయడానికి అభివృద్ధి చేయబడింది. ఎఫ్ఎల్ఎన్‌టి ప్రక్రియ 2024 మార్చి 2025మధ్య దశలవారీగా ప్రారంభించబడింది. 2025లో 1.77కోట్లకు పైగా అభ్యాసకులు పరీక్షించబడ్డారు.వీరిలో 34.31లక్షల మంది మాత్రమే అధికారికంగా పరీక్షించబడ్డారు. ఇది దాదాపు 19.4శాతం జాతీయ ధృవీరణ సగటును ప్రతిబింబిస్తుంది. ఉల్లాస్ (యుఎల్ఎల్ఏఎస్) అనే నవ్ భారత్ సాక్షరస్యతా కార్యక్రమం కింద భారతదేశంలోని రాష్ట్రాలలో వయోజన అక్షరాస్యతలోని గణనీయమైన వైవిధ్యాలను వెల్లడిస్తుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) సంకలనం చేసి ప్రకటించిన డేటా, వయోజన విద్య, అక్షరాస్యత సవాళ్లలో రాష్ట్రాలు ఎలా విభిన్నంగా ఉన్నాయనే అంతర్‌దృష్టిని అందిస్తుంది. 100శా తం సక్సెస్ రేటుతో తమిళనాడు రాష్ట్రం రికార్డు సృష్టించింది. ఎఫ్ఎల్ఎన్ఏటి కోసం 5,09, 694మంది అభ్యాసకులు హాజరయ్యారు. త్రిపుర రాష్ట్రం 98.1శాతం సక్సెస్ రేటుతో రెండవస్థానంలో నిలిచింది. 14,17 9మంది అ భ్యాసకులకుగాను 13,909మందికి సర్టిఫికేషన్ జరిగింది. ఢిల్లీ 99.3శాతం సక్సెస్ రేటుతో 7,959మంది అభ్యాసకులకుగాను 7,901మందికి సర్టిఫికేషన్ జరిగింది. దీనికి విరుద్ధంగా ఉత్తరాఖండ్, గుజరాత్, హైదరాబాద్ వంటి రాష్ట్రాలు తక్కువ సర్టిఫికేషన్ రేట్లను నమోదు చేశాయి.


### పార్లమెంట్, అసెంబ్లీ చట్టం చేస్తే

## కోర్టు ధిక్కరణగా పరిగణించలేం

**న్యూఢిల్లీ :** పార్లమెంట్, శాసనసభలు చేసే ఏ చట్టాన్ని కోర్టు ధిక్కరణగా పరిగణించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2012లో దాఖలైన ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ నందిని సుందర్ పిటిషన్‌ను విచారిస్తూ ఈ మేరకు తీర్పునిచ్చింది. జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ కూడిన ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'ప్రతి రాష్ట్ర శాసనసభకు ఒక చట్టాన్ని ఆమోదించే పూర్తి అధికారులు ఉంటాయి. ఆ చట్టం రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని, న్యాయస్థానం చెప్పేంతవరకూ అది చట్టంగానే ఉంటుంది. ఒకవేళ ఎవరైనా ఇది రాజ్యాంగ విరుద్ధమని, కొట్టివేయాలని భావిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. చట్టం చెల్లుబాటును, వివాదాలను పరిష్కరించే అధికారం రాజ్యాంగం ద్వారా న్యాయవ్యవస్థకు వచ్చింది' అని కోర్టు అభిప్రాయపడింది. సల్వా జుడుం, స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్ (ఎస్‌పిఒ) వంటి సాయుధ పౌర సమూహాలను మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వినియోగించడంపై అప్పట్లో తీవ్రమైన ఆందోళనలు రేకెత్తాయి. ఛత్తీస్‌గఢ్ సర్కారు పెద్ద ఎత్తున మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని, సల్వా జుడుం రద్దు చేయాలని, నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, నక్సలైట్లు చేసిన నేరాలపై దర్యాప్తు చేయాలని నందిని సుందర్‌తో పాటు పలువురు 2007లో సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసారు. జూలై 5, 2011న, సుప్రీంకోర్టు ఎస్‌పిఒలను ఉపయోగించకుండా ఆదేశాలను ఇచ్చింది. అదే ఏడాది ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 2011లో ఛత్తీస్‌గఢ్ సహాయక సాయుధ పోలీసు దళ చట్టాన్ని సవరించింది.

# మిజోరాంలో వర్ష బీభత్సం..

### 552 చోట్ల విరిగిపడ్డ కొండచరియలు.. దెబ్బతిన్న 152 ఇళ్లు



**ఐజ్వాల్ :** నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈశాన్య రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సిక్కిం, అసోం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, మిజోరాం, నాగాలాండ్, మేఘాలయలో కుంభవృష్టి కురుస్తోంది. ఈ కుంభవృష్టి కారణంగా ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఈ వర్ష బీభత్సానికి ఈశాన్య రాష్ట్రాల్లో దాదాపు 34 మంది ప్రాణాలు కోల్పోయారు. గత 10 రోజుల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో మిజోరాంలో ఐదుగురు మరణించినట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ అధికారులు మంగళవారం తెలిపారు. చంపాయి జిల్లాలో ముగ్గురు, ఐజ్వాల్, సెర్చిప్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదల కారణంగా ఇళ్లు, గోడలు కూలిపోవడం వల్ల ఈ మరణాలు సంభవించినట్లు తెలిపారు. ఇక రాష్ట్రంలోని 552 చోట్ల కొండచరియలు విరిగిపడినట్లు విపత్తు నిర్వహణ అధికారులు వెల్లడించారు. 152 ఇళ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. కొండచరియలు విరిగిపడటంతో పగుళ్ల కారణంగా 198 కుటుంబాలు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయినట్లు చెప్పారు. మొత్తం 11 జిల్లాల్లో మయన్మార్‌తో సరిహద్దును పంచుకునే తూర్పు మిజోరాంలోని చంపాయి జిల్లాపై తీవ్ర ప్రభావం పడినట్లు పేర్కొన్నారు. ఇక్కడ 209 చోట్ల కొండచరియలు విరిగిపడినట్లు వివరించారు. తొమ్మిది ఇళ్లు దెబ్బతినగా.. 14 కుటుంబాలను ఖాళీ చేయించినట్లు చెప్పారు. ఇక సెర్చిప్ జిల్లాలో 75 చోట్ల కొండచరియలు విరిగిపడగా.. 27 ఇళ్లు దెబ్బతిన్నాయని, కొండచరియలు విరిగిపడటం, పగుళ్లు, వరదల కారణంగా 132 కుటుంబాలు తమ ఇళ్లను వదిలి వెళ్లిపోయినట్లు అధికారులు చెప్పారు. ఐజ్వాల్ జిల్లాలో 18 చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. 13 ఇళ్లు కూలిపోయాయి. ఖాజ్వాల్ జిల్లాలో 75 చోట్ల కొండచరియలు విరిగిపడగా, లుంగ్లీ జిల్లాలో 60, దక్షిణ మిజోరాంలోని సియాహా జిల్లాలో 53 చోట్ల కొండచరియలు విరిగిపడినట్లు అధికారులు వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో సైతువల్ జిల్లా మినహా రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు అధికారులు సెలవులు ప్రకటించారు. ఇక దక్షిణ జిల్లాలకు నిత్యావసర వస్తువులను తీసుకెళ్లే వందకు పైగా ట్రక్కులు సెర్చిప్‌లో చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. గత మూడు రోజుల్లో ఐజ్వాల్ జిల్లాలో 253.7 మి.మీ వర్షపాతం నమోదైందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. ఖాజ్వాల్ జిల్లాలో 248.33 మి.మీ వర్షపాతం, సియాహా జిల్లాలో 241.5 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ తన నివేదికలో వెల్లడించింది. రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఐఎండీ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

## పెన్షన్లకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించాలి

రెవెన్యూ జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** పెన్షన్లకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించాలని రెవెన్యూ జిల్లా అదనపు కలెక్టర్ వీరా రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద రైతు ఆత్మహత్య కుటుంబాలు, వితంతు పెన్షన్ ప్రతిపాదనలు తదితర అంశాలపై సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ జిల్లా అదనపు కలెక్టర్‌లు, డిఆర్డిఓ, రెవెన్యూ భాగాల సంబంధించిన అధికారులతో జూమ్ సమావేశం ద్వారా సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు, వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించి ఆర్థిక సహాయం పొందే విధంగా దరఖాస్తుల స్వీకరించి ప్రతిపాదన రూపొందించాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వం నుండి పెన్షన్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. స్టేట్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తు లను కూడా పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా రెవెన్యూ సదస్సులు

జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్

**ప్రజాపక్షం/చండూరు:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులను ఎలాంటి ఇబ్బందులకు లోనుకాకండా పకడ్బందీ గా నిర్వహించాలని నల్లగొండ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మంగళవారం చండూరు మండలంలోని కుమ్మందానిగూడెం , తుమ్మలపల్లి రెవిన్యూ గ్రామాలలో మొదటిరోజు రెవిన్యూ సదస్సును నిర్వహించారు. తుమ్మలపల్లి గ్రామ రెవిన్యూ సదస్సును జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ , ఆర్డీఓ రమణారెడ్డి సందర్శించారు. అక్కడికి వచ్చిన రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను దరఖాస్తు ఫారం ద్వార అధికారులకు అందజేయాలని చూచించారు. చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చేయడానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. భూముల వివరాలపై రెవిన్యూ అధికారులు పూర్తి అవగాహన కలగిఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి , డిప్యూటీ తహసీల్ధార్ నిర్మల , ఆర్ఐలు శేఖర్ , మురళి పాల్గొన్నారు.



## భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** గ్రామస్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి కీలకంగా మారుతోందని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. మంగళవారం గద్వాల్ మండలం అనంతపురం గ్రామంలోని గ్రామపంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులలో పాల్గొని భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ, రిజిస్ట్రార్లు, దరఖాస్తుదారులకు ఇస్తున్న రశీదు, ఏ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో వ్యక్తిగతంగా మాట్లాడారు. వారి భూ సంబంధిత సమస్యలు అడిగి తెలుసుకుని, పరిష్కార మార్గాలపై సూచనలు ఇచ్చారు. అధికారులకు తగిన మార్గదర్శకాలు తెలియజేసి, సమస్యలు వేగంగా పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. భూ భారతి కార్యక్రమం ద్వారా గ్రామాలకు రెవెన్యూ అధికారులు వెళ్లి భూమి సంబంధిత సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో జూన్ 3 నుండి 20 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. గ్రామాల్లో జరిగే భూ భారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## తడి,పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలి




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** తడిపొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో బాగంగా రెండవ రోజు మంగళవారం సూర్యాపేట పట్టణంలోని కొమటికుంట ఎస్‌సి కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించుటకు100 రోజుల ప్రణాళికనుసిద్ధం చేసినట్లు, ఈ ప్రణాళికలో వీధులలో సంచరించు కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని, చిన్న పిల్లలకు కుక్కలకు దూరంగా ఉంచాలని అన్నారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలని, వార్డులలో నీటి సరఫరాకు సంబంధించి క్లోరినేషన్ టెస్టులు చేయాలని, వార్డులలో నిరుపేద మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘం చేయుటకు ప్రతిపాదించినట్లు తెలిపారు. వార్డులలో వ్యాపారాలు చేయు వాటిని గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ సత్యారావు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎఇ తిరుమలయ్య, వేనేపల్లి యాదిగిరి, టిఎంసి శ్వేత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివ ప్రసాదు, వార్డు అధికారి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పరిపూర్ణ భాగస్వామ్యంతోనే నాణ్యమైన విద్య -సంస్కరణల అమలు సాధ్యం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** విద్యార్థులు పరిపూర్ణ భాగస్వామ్యంతోనే నాణ్యమైన విద్యా, సంస్కరణలు అమలు చేయడం సాధ్యపడుతుందని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. మంగళవారం వేసవికాలం సెలవులు ముగిసి విద్యాసంవత్సరం ప్రారంభమైన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు జూన్1తో ముగిసిన సందర్భంగా విద్యాసంవత్సరం మొదలు కావడంతో రెండు, నాల్గు సెమిస్టర్ విద్యార్థులు ఎంజియు సంస్కరణల సాఫల్యానికి భాగస్వాములు కావాలని సూచించారు. నాణ్య మైన విద్య వారి భాగస్వామ్యంతో మాత్రమే సాధ్యమని అందుకు 75శాతం హాజరు, అధ్యయనం పరిశోధన చర్చలు చాలా ముఖ్యమని అన్నారు. ఎంజియు పరిధిలోని నాలుగు కళాశాలలో తరగతులు , వసతి గృహాలు సైతం ప్రారంభమైన దృష్ట్యా విద్యార్థులు వేసవి స్వల్ప నిడివి ముగిసినందున తమ లక్ష్య సాధనకై కృషి చేయాలని ఆయన సూచించారు.

## రెవెన్యూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/తిరుమలగిరి:** రెవెన్యూ గ్రామసభలను భూ సమస్యలున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం మండలంలోని జలాల్‌పురం గ్రామంలో జరిగిన రెవిన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. రెవిన్యూ సదస్సులు పక్క ప్రణాళికతో నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామాలకు రెవిన్యూ అధికారులు వచ్చి రైతులనుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు రసీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయిలో అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ రెవిన్యూ సదస్సులు 20వతేదీ వరకు జరుగుతాయని అన్నారు. పైలట్ ప్రాజెక్టులో బాగంగా గరిడేపల్లి మండలంలో ఇప్పటికే గ్రామసభలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతిరోజు ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈకార్యక్రమంలో తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ చామంతి, డిఆర్‌డిఎ పిడి వివి అప్పారావు, ఆర్డీవో వేణుమాదవ్, డిపివో యాదయ్య, తహసిల్దార్ హరిప్రసాద్, ఆర్ఐ జాజిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ అనిత పాల్గొన్నారు.

### మానవీయ కోణంలో భూ సమస్యల పరిష్కరించాలి

**ప్రజాపక్షం/మునగాల:** రెవిన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. మంగళవారం మునగాల మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామం, చిలుకూరు మండలంలోని కొండాపురం గ్రామాల్లో జరిగిన రెవిన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రెవిన్యూ అధికారులు మానవీయ కోణంలో భూ సమస్యల పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో పారదర్శకత పాటిస్తాం

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** పారదర్శకంగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు అందజేయడం జరిగిందని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఏకే ప్యాలెస్‌లో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ హనుమంతరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలసి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇళ్ళు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఒక పండుగ వాతావరణంలో పారదర్శకంగా పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. రేకులు, పై కప్పు లేని నిరు పేదలకు ప్రభుత్వం అండగా ఉంటూ 5 లక్షల సహాయం లబ్ధిదారులకు పభుత్వం అందిస్తుందన్నారు. ముందుగా బేస్మెంట్ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం లక్ష రూపాయలు వారి ఖాతాలో జమ చేస్తుందన్నారు. లబ్ధిదారులకు ఏ ఇబ్బంది లేకుండా ఇసుక కొరత లేకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ పడుతుందన్నారు. ప్రతి పేద వారికి ఇండ్లు ఇవ్వాలనే ఆశతో ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. ధనిక రాష్ట్రంలో పేద ప్రజల ఇబ్బందులు చూసి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినందుకు మనందరం ప్రభుత్వం కు ధన్యవాదములు తెలియజేయాల్సిన అవసరం ఉన్నది. భూమి ఉండి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే ప్రతి పేద వారు అతి తొందరగా బేస్మెంట్ పూర్తి చేసుకొని పభుత్వం అందిస్తున్న 5 లక్షల సహాయం పొందాలన్నారు. బేస్మెంట్ పూర్తి చేసుకున్న వెంటనే ప్రభుత్వం మీ ఖాతాల్లో లక్ష రూపాయలు జమ చేయడం జరుగుతుందన్నారు. తదుపరి బేస్మెంట్ వాల్స్, పై కప్పుకు ప్రభుత్వం ద్వారా పేదలకు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారులు అతి తొందరగా ముందుగా బేస్మెంట్ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తి , భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, జడ్పీ సీఈఓ శోభారాణి,ఎస్సీ కార్పొరేషన్ శ్యామ్ సుందర్, హౌసింగ్ పి. డి విజయ్ సింగ్, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యమైన విత్తనాలు వాడి అధిక దిగుబడులను సాధించాలి

మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతులు నాణ్యమైన విత్తనాలను వాడి అధిక దిగుబడులను సాధించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం స్తానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న రైతు వేదికలో నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని మిని కిట్ రూపంలో ఉన్న 48 వరి విత్తనాల ప్యాకెట్లను, 24 పెసర ప్యాకెట్లను రైతులకు అందించి మాట్లాడారు. సాగర్ ఎడమకాల్వ పరిధిలో మిర్యాలగూడ నియోజకవర్గం ఉండడం వల్ల వరిసాగు పైనే రైతులు ఆధారపడి ఉన్నారని తెలిపారు. రైతులు అధిక దిగుబడి రావాలంటే నీటితోపాటు నాణ్యమైన విత్తనం అవసరం ఉందన్నారు. జూన్ 12న ఏరువాక కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ప్రతి ఒక్క రైతు నాగలి పట్టి విజయవంతం చేయాలన్నారు. ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, గుండు నరేందర్, షేక్ జిందా, శంకర్‌రెడ్డి, పొలగాని శ్రీనివాస్, ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, రైతులు ధర్మాన్నయ్య, సూర్యనాయక్, చల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 308 కిలోల నకిలీ విత్తనాలు పట్టివేత

ముగ్గురు అరెస్టు


జిల్లా ఎస్‌పి కె.నర్సింహ్మా వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** 308 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. నకిలీ పత్తి విత్తనాలను తయారు చేస్తున్న వ్యక్తితో పాటు వాటిని అమ్ముతున్న మరో ఇద్దరిని అరెస్టు చేశారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి కె.నర్సింహా దినికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. తిరుమలగిరి మండల పరిధిలో మంగళవారం నమ్మదగిన సమాచారం మేరకు ఎ1 నిందితుడు సింగారపు యాదగిరి స్వామి కౌలు భూమిలో తనిఖీ చేసి అరెస్టు చేశారు. అతడి నుండి రూ.4.62 లక్షల 308 కిలోల నకిలీ పత్తి విత్తనాలను వాటిని తయారు చేసే సామాగ్రిని స్వాదీనం చేసుకున్నారు. ఇతనితో పాటు ఈ నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్న తిరుమలగిరి మండలంలోని నందాపురం గ్రామానికి చెందిన లోడంగి నవీన్, యాదాద్రి భువనగిరి జిల్లాలోని అడ్డగూడురు మండలం చిర్రగుడూరుకు చెందిన చిత్తలూరి సోమనారాయణను అరెస్టు చేశారు. నకిలీ పత్తి విత్తనాలు తయారు చేసిన వీరు అధిక దిగుబడి వస్తాయని, తాము తక్కువ ధరకే ఇస్తామని నమ్మబలుకుతూ ప్యాకెట్ 1500 రూపాయలకు అమ్ముతున్నారు. నకిలీ పత్తి విత్తనాలు తయారు చేయడానికి ఉపయోగిస్తున్న 3ఫేజ్ ఆఫ్ ఇంచ్ హెచ్‌పి మోటార్, దానికి కలపడానికి డ్రమ్ములు, సల్ఫ్యూరిక్‌తో యాసిడ్ క్యాన్లు, పత్తి గింజలు రంగు రావడానికి షైన్‌స్టార్ డబ్బాలు కూడా సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి నర్సింహా మాట్లాడుతూ అన్నదాతలను మోసగించి నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదన్నారు. వారిపై పిడియాక్ట్‌లు నమోదు చేస్తామని చెప్పారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే సమాచారం అందించాలని ప్రజలను కోరారు. వారి పేర్లను గొప్యంగా ఉంచుతామని అన్నారు. 1986 చట్ట ప్రకారం వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు పట్టుకున్న కేసులో ప్రతిభ కనబర్చిన సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, ఎస్ఐ హరికృష్ణ, ఎఎస్ఐ వెంకన్న, హెడ్‌కానిస్టేబుల్ విద్యాసాగర్‌రావు, రాజేంద్రర్‌రెడ్డి, శ్రీనివాస్, కరుణాకర్, కానిస్టేబులు ఆనంద్, మల్లేష్, సతీష్, శివకృష్ణ, ప్రభాకర్, మహిళ హోంగార్డు మంజులను అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి రవీందర్‌రెడ్డి, డిఎస్‌పి ప్రసన్నకుమార్, తిరుమలగిరి ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు అడ్డంకులు కలిగించొద్దు

అఖిలపక్ష నాయకుల ఏకాభిప్రాయం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నేరేడుచర్ల ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయనున్న భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్, సంఘసంస్కర్తలైన జ్యోతిరావుపూలే, సావిత్రి బాయిపూలే విగ్రహాల ఏర్పాటుకు సంబంధిత అధికారులు ఎవరు అడ్డంకులు కలిగించవోద్దని పట్టణంలోని అఖిలపక్ష నాయకులు అభిప్రాయపడ్డారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన కూడలి వీరబ్రహ్మేంద్రస్వామి గుడి పక్కన తాత్కలికంగా అంబేద్కర్, జ్యోతిరావుపూలే దంపతుల ప్లెక్సీలను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ రోడ్డు వెడల్పులో భాగంగా రాగిచెట్టు కింద ఉన్న అంబేద్కర్ విగ్రహన్ని తొలగించడం జరిగిందని, అప్పటి పాలకులు అంబేద్కర్ విగ్రహన్ని ప్రధాన కూడలిలో నిర్మిస్తామని మాట ఇచ్చి, తప్పినందున అఖిల పక్షం ఆధ్వర్యంలో అంబేద్కర్, జ్యోతిరావుపూలే విగ్రహ నిర్మాణ కోసం శంకుస్థాపన చేశామన్నారు. విద్యుత్‌శాఖ వారు అడ్డువస్తునందున మున్సిపాలిటి, తహసిల్దార్, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని విగ్రహ ఏర్పాట్లకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు, బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రాపోలు నవీన్, బిజేపి పట్టణ అధ్యక్షులు కొణతం నాగిరెడ్డి, పలు పార్టీల నాయకులు కొదమగుండ్ల నగేష్, వాసపల్లయ్య, ఇంజమూరి వెంకటయ్య, చిలకల రాజుశ్రీను, యడవల్లి చంద్రయ్య, డాల్ఫిన్, శ్రీనివాస్, తక్కెళ్ల నాగార్జున, శంకర్‌రెడ్డి, నీలా రామ్మూర్తి పాల్గొన్నారు.

## భూములపై పూర్తిహక్కులు కల్పించేందుకే భూభారతి చట్టం

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** రైతులకు వారి భూములపై పూర్తిహక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంగళవారం నిర్వహించిన తుర్కపల్లి మండలం గోపాల్ పూర్ గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో ఈ నెల 20వ తేదీ వరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. తుర్కపల్లి మండల తాసిల్దార్ దేశ్య నాయక్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.




## విత్తనరంగంలో స్వయం సమృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ ప్రొఫసర్ ఏ .జానయ్య



**ప్రజాపక్షం/నల్లగొండ (తిప్పర్తి ):** రానున్న రెండు, మూడేళ్ళలో విత్తన రంగంలో స్వయం సమృద్ధి సాధించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఆశయమని ప్రొఫసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఏ .జానయ్య తెలిపారు. నాణ్యమైన విత్తనం రైతు నేస్తం పేరుమీద మంగళవారం ప్రొఫసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్ కు ఆయన తిప్పర్తి రైతు వేదికలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాన్ని ఉత్పత్తి చేసినట్లయితే తిరిగి దానిని ఇతర రైతులకు ఇవ్వడం ద్వారా రానున్న రెండు, మూడు ఏళ్లలో రాష్ట్రంలో విత్తన రంగంలో స్వయం సమృద్ధి సాధించిన వారమవుతామని అన్నారు. ఈ సంవత్సరం తొలకరి ముందే ప్రారంభమైనందున కొన్ని గ్రామాలలో నకిలీ విత్తన కంపెనీలు విత్తనాల పేరిట రైతులను మోసం చేసేందుకు సిద్ధమయ్యాయని, నకిలీల బెడద లేకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన రిజిస్టర్డ్ విత్తనాలనే వాడాలని ఆయన కోరారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ మాట్లాడుతూ నకిలీ విత్తనాల వల్ల రైతులు మోసపోకుండా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా విత్తనాలను రూపొందించి వాటిని రైతులకు పంపిణీ చేయడం ద్వారా తిరిగి రైతులు అదే విత్తనాలను ఉపయోగించి నాణ్యమైన పంటలు పండించుకునేందుకు చేపట్టిన విత్తన పంపిణీ కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లాలో ఉన్న 564 రెవెన్యూ గ్రామాలలో గ్రామానికి ముగ్గురు లేదా నలుగురు చొప్పున రైతులకు ఇన్పుట్ సీడ్ ను ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో 12 లక్షల ఎకరాలలో వ్యవసాయ సాగుకు ఆవకాశం ఉందని, అనేకమంది రైతులు వివిధ విత్తనాల కొనుగోలు సందర్భంగా నకిలీ విత్తనాల బారిన పడి మోసపోతున్నారని, అలా కాకుండా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా ఫౌండేషన్ సీడ్ పంపిణీ చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్, మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి ,డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి ,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ ,తిప్పర్తి మండల వ్యవసాయ అధికారి సన్నీ రాజ్, తదితరులు హాజరయ్యారు.అనంతరం జిల్లా కలెక్టర్ పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ నిర్మాణంలో ఉన్న ఎమ్మార్సీ భవనం, భవిత కేంద్రం నిర్మాణ పనులను తనిఖీ చేశారు. భవిత కేంద్రంలో ర్యాంపు, రైలింగ్, టాయిలెట్లు వంటి ముఖ్యమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, హెడ్మాస్టర్లను ఆదేశించారు.

## గీత వృత్తిని నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి ఆరోపణ




**ప్రజాపక్షం/వేములపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం మద్యపానం విచ్చలవిడిగా ప్రోత్సహిస్తూ గీత వృత్తిని నిర్వీర్యం చేస్తూ గీతా కార్మికుల పొట్టలు కొడుతుందని గీతా పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి ఆరోపించారు.మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయం లో జరిగిన గీత పనివారాల సంఘం నల్లగొండ జిల్లా కార్యవర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గీత కార్మికులకు ఎక్సిగేషన్ చెల్లింపులో గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని దీనివల్ల గీత కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 2022 సంవత్సరం నుండి సుమారు రూ. 12. 50కోట్లు పెండింగ్ లో ఉన్న ఎక్స్‌గ్రేషియే వెంటనే విడుదల చేసి గీత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో హరితర కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో తాటి, ఈత,ఖర్జూర చెట్లను నాటించి వాటిని సంరక్షించి గీత వృత్తిదారులకు వృత్తి కాపాడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో విచ్చలవిడిగా కిరాణం షాపులతో పాటు గల్లి,గల్లిలో నడుపుతున్న బెల్ట్ షాపులను అరికట్టాలన్నారు. గీత వృత్తిదారులకు వృత్తి వృత్తిని ప్రోత్సహించేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో ఏర్పాటు చేసిన నీరా ప్రాజెక్టుని పునరుద్ధరణ చేసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు,మాజీ ఎం పి బొమ్మగాని ధర్మభిక్షం పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఐడెంటి కార్డులు లైసెన్సులను ఇబ్బంది పెట్టకుండా సూపర్డెంట్ వెంటనే ఇవ్వాలని అన్నారు జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ చనిపోయిన గీతా కార్మికుల పింఛను వారి భార్యలకు వితంతు పింఛనుగా మార్చి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సురిగి చలపతి , నాయకులు వనం వెంకన్న, నకరికంటి స్వామి, లెనిన్, అక్కలయ్య పాల్గొన్నారు.

## శాంతికి మారుపేరు సూర్యాపేట

బక్రీద్‌ను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలి: డిఎస్



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** బక్రీద్ పండుగను సోదరభావంతో కులమ తాలకు అతీతంగా జరుపుకోవాలని డిఎస్‌పి ప్రసన్న కుమార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కిరాణం మర్చంట్ ఫంక్షన్‌హాల్‌లో పీస్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కుల, మతాలకు అతీతంగా సుహృద్భావ వాతావరణంలో పండుగలు జరుపుకునే సంప్రదాయం ఎంతో సంతోషంగా ఉన్నదని అన్నారు. ఈ నెల 7న బక్రీద్ పండుగ దానిని భక్తిశ్రద్దలతో జరుపుకోవాలని సూచించారు. సాంప్రదాయాల నుంచే చట్టాలు వచ్చాయని అన్నారు. సోషల్ మీడియాను వేదిక చేసుకుని కుల మతాల మధ్యలో విభేదాలు సృష్టించే వీడియోలు, ఫోటోస్ పెడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం నేరమని అన్నారు. ప్రపంచ మొత్తానికి సూర్యాపేట రోల్ మోడల్‌గా ఉండాలన్నారు. సిఐ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, తహసిల్దార్ కృష్ణయ్య, వెహికల్ ఇన్స్‌పెక్టర్ జయప్రకాశ్‌రెడ్డి, ఎస్ఐలు ఏడుకొండలు, సైదులు, ఆంజనే యు లు, ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యత



**ప్రజాపక్షం/వీణవంకః** వీణవంక మండల కేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం వీణవంక పిహెచ్‌సి ఆద్వర్యంలో వైద్య శిబిరాన్ని అడిషనల్ డిఎంహెచ్‌వో డా.సుధారాజేంద్ర సందర్శించారు. ఉచిత వైద్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డా.వరుణ మాట్లాడుతూ వీణవంక ఉపకేంద్రంలో ఇంటిగ్రేటెడ్ హెల్త్‌క్యాంపు నిర్వహించడం జరిగిందని, హెచ్ ఐవి సిఫిలిస్ పరీక్ష, హెచ్‌బిఎస్‌టి వైరల్ స్క్రీనింగ్, టిబి శాంపిల్స్ కలెక్షన్ పరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.చందు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్, కంట్రోలర్ డా.సురేందర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలున్నారు.

## ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



**ప్రజాపక్షం/గంగాధరః** అనుమతి లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు గంగాధర ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఎలగందుల నుంచి పెద్ద ఆచంపల్లి మీదుగా గర్షకుర్తి గ్రామానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎలగందుల గ్రామానికి చెందిన బోనాల పరుశురాం సంబంధించిన ట్రాక్టర్‌తో పాటు అదే గ్రామానికి చెందిన రాచకొండ రమేష్ సంబంధించిన ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమానులైన పరశురాం, రమేష్, డ్రైవర్ అనిల్ కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

## ఎప్పటికీ రాజీమార్గమే రాజమార్గం

### సీనియర్ సివిల్ జడ్జి వి.భవాని



**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రజలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని మంథని సీనియర్ సివిల్ జడ్జీ వి.భవాని పేర్కొన్నారు,మంగళవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్య అతిథిగా మాట్లాడారు.నిరుపేదలకు అండగా లోక్ అధాలత్ పనిచేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.బార్ అసోషియేషన్ ఉపాధ్యక్షులు కే. రఘోత్తం రెడ్డి మాట్లాడుతూ పౌరుల హక్కులు,భాద్యతలతో పాటు వివిధ చట్టాల పట్ల అవగాహన కల్పించారు.న్యాయవాది శశిభూషణ్ కాచె విత్తన చట్టం, నిషేధించబడ్డ ఎరువులు,పురుగుల మందుల చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్.ఐ గోపతి నరేష్ మహిళల చట్టాల పట్ల అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరి రావు,లోక్ అధాలత్ సభ్యులు కనుకుంట్ల స్వామితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన రమాదేవి



**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో సుల్తానాబాద్ మండలం లోని గట్టెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సత్తా చాటింది. ఆదివారం హైదరాబాద్ జింఖానా గ్రౌండ్లో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ షాట్ పుట్ 12 సంవత్సరాల బాలికల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో సిల్వర్‌మెడల్ సాధించిన జి.రమాదేవిని సుల్తానాబాద్ ఎంఈఓ రాజయ్య, ఏ ఏ పీసీ చైర్మన్ కళ్యాణి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు అన్నపూర్ణ అభినందించారు. పిడి ప్రణయ్, పెద్దపల్లి అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ గట్టయ్య, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

### ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మంగళవారం ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్,మాజీ మంత్రి జీవన్ రెడ్డి తో కలిపి ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన రాజ్యాంగాన్ని రూపొందించే స్థాయికి ఎదిగిన బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ ,వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి,జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర రావు.రమేష్ రెడ్డి,మాజీ సర్పంచ్ లు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ,అంబేద్కర్ ఉత్సవ కమిటీ సంఘాల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి పిహెచ్‌సిలో తనిఖీలు



**ప్రజాపక్షం/కొత్తపల్లిః** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.వెంకటరమణ, పివోఎంసిహెచ్ డాక్టర్ సనజవేరియాతో కలిసి కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కొత్తపల్లిలో జరుగుతున్న ఆశ డే కార్యక్రమానికి హాజరై అక్కడ సివై, టిబి టెస్ట్‌లను లాంచనంగా ప్రారంభించారు. విధి విధానాలను వివరించారు. సబ్‌సెంటర్ వారీగా అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు. పిహెచ్‌సిలో హాజరు పట్టికను, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశుభ్రతను, లేబర్ రూం, ఆపరేషన్ థియేటర్‌లను పరిశీలించారు. పిహెచ్‌సి సాధారణ డెలివరీలను ప్రోత్సహించాలని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు సూచించారు. వర్షాకాలం సంధర్భంగా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్దతులను ప్రోత్సహిస్తూ అంతర ఇంజక్షన్ పట్ల కొత్తగా పెళ్లయిన జంటలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఆసిఫ్ నగర్‌ను సందర్శించారు. వైద్యాధికారులు డా.వనజ. డా.శ్రావిక, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనగామను ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేయాలి : రమేశ్‌కుమార్

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం నగర పాలక సంస్థ పరిధి లోని 9వ డివిజన్ జనగామ ను ప్రత్యేక డివిజన్ గా ఏర్పాటు చేయాలని, ఇందులో ఇతర డివిజన్ లకు చెందిన ఓట్లను, ప్రాంతాలను కలుపకుండా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ ఒక ప్రకటన లో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 1998 లో రామగుండం నోటిఫైడ్ ఏరియా నుంచి మున్సిపల్ గా మార్చిన తర్వాత జనగామ ను మొదటి సారి మున్సిపల్ ఎన్నికల సమయంలో 8వ వార్డు గా మార్చి అందులో బాపుజీనగర్ ను కలిపారని ఆయన అన్నారు, రెండో సారి ఎన్నికల సమయంలో 10 వ డివిజన్ గా మార్చి గంగానగర్ ను కలిపారని, మూడో సారి జరిగిన ఎన్నికల సమయంలో 9 వ డివిజన్ గా మార్చి గంగానగర్, జి.ఎం.కాలనీ లను కొంత భాగం కలిపారని ఆయన అన్నారు. దీని వల్ల గ్రామ ప్రజలు అనుకున్నంత అభివృద్ధి జరుగలేదని అనుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికీ ప్రజలు గ్రామ అభివృద్ధి సరిగా లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం, ఎన్నికల సంఘం రామగుండం నగర పాలక సంస్థ లో డివిజన్ ల సంఖ్య 50 నుంచి 60 కి పెంచే అవకాశం ఉన్నందున జనగామ ను ప్రత్యేక డివిజన్ గా మార్చి అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు.

### భూ సమస్యల పరిష్కారంలో

# రెవెన్యూ సదస్సులు కీలకం

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కొత్తపల్లిః** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని, భూ సమస్యలు ఉన్న ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మంగళవారం కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ ప్రాథమిక పాఠశాలలో, కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన భూభారతి గ్రామ రెవెన్యూ అవగాహన సదస్సుల్లో కలెక్టర్ పాల్గొన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం గా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మండలం సైదాపూర్‌లో, అన్ని మండల కేంద్రాలలో రెవెన్యూ అవగాహన సదస్సులు విజయవంతంగా నిర్వహించామని, ప్రజల నుంచి భూసమస్యల అర్జీలు స్వీకరించామని తెలిపారు. ఆయా సదస్సుల్లో వచ్చిన ధరఖాస్తులను రెవెన్యూ అధికారులు పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఇదే విధంగా జూన్ 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని, భూ సమస్యలనున్న ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులకు హాజరై ధరఖాస్తు సమర్పించాలని సూచించారు. ఆసిఫ్‌నగర్, దుర్శేడ్ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించారు. అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, అధికారులకు కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చా రు. రెవెన్యూ అధికారులు ప్ర జలు ధరఖాస్తులను స్వీకరించి వెంటనే రసీదులు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. సకాలంలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ సదస్సులో హెల్ప్‌డెస్క్ రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించి రైతుల భూ సమస్యల ధరఖాస్తులను పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, తహసీల్దార్లు ఎన్.రాజేష్, ఆర్.వెంకటలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

### బక్రీద్ పండుగకు అన్ని ఏర్పాట్లు



బక్రీద్ పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తో కలిసి కలెక్టర్ పమేలా సత్పతి ముస్లిం మత పెద్దలకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈద్గాల వద్ద అన్ని వసతులు కల్పించాలని, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. నమాజ్ వేళల్లో విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రశాంత వాతావరణలో పండుగ నిర్వహించుకోవాలన్నారు. సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ బక్రీద్ పండుగ సంధర్భంగా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. పండుగను సామరస్యంగా జరుపుకోవాలని సూచించారు.అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, డిఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పవన్‌కుమార్, ముస్లిం మైనార్టీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్య పెంచాలి



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జూన్ 6 తేదీ నుండి 19వరకు జరగబోయే బడిబాట ను విజయవంతం చేయాలని పి.ఆర్.టి.యు.టి.ఎస్ ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు.జిల్లా కేంద్రంలోని పొన్నాలగార్డెన్‌లో మంగళవారం పిఆర్‌టియుటిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయినపల్లి ఆనందరావు, యాల్ల అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్.ఎస్.సి ప్రతిభ అవార్డుల ప్రధాన ఉత్సవంలో ముఖ్యఅతిథిగా శ్రీపాల్ రెడ్డి పాల్గొన్నారు. శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచాలన్నారు. మండల టాపర్స్‌గా నిలిచిన ఇరవైమంది విద్యార్థులనుసన్మానించారు.153 మంది ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి, జగిత్యాల జిల్లా విద్యాధికారి రాము, విఎంఆర్ ఫౌండేషన్ చైర్మన మహేందర్ రెడ్డి,రాష్ట్ర అసోసియేట్‌అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి,మండలవిద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు

## పశువుల అక్రమ రవాణా నివారణపై ప్రత్యేక దృష్టి

### పోలీస్ స్టేషన్ల తనిఖీలు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సోమవారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పశువుల అక్రమ రవాణా నివారణకు శాంతి నగర్, మొగ్దుంపూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఆయన తనిఖీ చేశారు. చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని సిపి ఆరా తీశారు. వారు చేస్తున్న తనిఖీల తీరును పరిశీలించి తనిఖీలకు సంబంధించిన వాహన వివరాల నమోదు, రికార్డులను పరిశీలించారు. ఈ సంధర్భంగా చెక్ పోస్టు విధుల్లో ఉన్న సిబ్బందికి వాహన తనిఖీల గురించి బ్రీఫింగ్ ఇచ్చారు. రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత రక్షణ పాటిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. బారికేడింగ్‌ను సరైన క్రమపద్ధతిలో అమర్చుకోవాలని తెలిపారు. అదే విధంగా రేడియం రిఫ్లెక్టింగ్ జాకెట్లు ధరించాలని, టార్చ్‌లైట్, ఎల్ఈడీ బ్యాటన్ వంటి పరికరాలను రాత్రి సమయాల్లో తప్పనిసరిగా వాడాలని ఆదేశించారు. ప్రతి భారీ ,అతిభారీ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. చెక్ పోస్టుల తనిఖీల అనంతరం పట్టణంలోని కరీంనగర్ ఒకటవ, రెండవ, మూడవ పోలీస్ స్టేషన్లను సైతం కమిషనర్ గౌస్ ఆలయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్ధరాత్రి పోలీస్ స్టేషన్లలో హాజరులో ఉన్న సిబ్బందిని ఆరా తీశారు. డయల్ 100 ద్వారా అందిన ఫిర్యాదులు, వాటి నమోదు తీరు, సిబ్బంది స్పందించిన తీరుపట్ల ఆరా తీశారు. వివిధ నేరాల్లో పట్టుబడి పోలీస్ స్టేషన్ల ఆవరణలో ఉన్న వాహనాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయాల్లో పోలీస్ స్టేషన్లలో విధుల్లో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

## 'భూ భారతి'తో సమస్యలు పరిష్కారం

### సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** భూ భారతి చట్టం వల్ల ప్రజల భూ సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర మనుచౌదరి అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో భూ భారతీ రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను స్వీకరించారు.కలెక్టర్ మనుచౌదరి మట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించటమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసమే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రజల దరఖాస్తులను స్వీకరించిన వెంటనే రశీదులు అందచేయాలన్నారు. తహశీల్దార్ హరికిరణ్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలల్లో మరమ్మతులకు, గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలి

ప్రభుత్వ పాఠశాలల్లో మైనర్ రిపేర్లు,అదనపు గదుల నిర్మాణం కొరకు ప్రతిపాధనలు పంపించాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో విద్యాశాఖ, ఈడబ్లుఐడిసి, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ ఆమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమంద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నిర్మాణ పనులపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయని, బిల్లులు చెల్లించటం జరిగిందన్నారు. పెండింగ్ బిల్లుల వివరాలుఅందించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంకా కొత్తగా గుర్తించని రిపేర్లు, అవసరమైన పాఠశాలల్లో అదనపు గదులు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి అందచేయాలన్నారు. ఈకార్యక్రమంలో డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి, ఈడబ్లుఐడిసి ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ, ఎఈలు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. ప్రకృతిని రక్షిద్దాం

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని చాంబర్ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి మనమంతా కృషి చేయాలని, సింగల్ యూసెజ్ ప్లాస్టిక్ వాడకం పూర్తి స్థాయిలో నిషేధించాలని కలెక్టర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత ప్రతి ఒక్కరికి వివరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ స్టీల్ టిఫిన్ బాక్స్, స్టీల్ బాటిల్, క్లాత్ బ్యాగ్ వినియోగించాలని, ప్లాస్టిక్ వస్తువుల వాడకం పూర్తిస్థాయిలో తగ్గించాలన్నారు. జిల్లాలో మురుగునీటి శుద్ధి 100% జరిగేలా అమృత్ పథకం కింద పలుచోట్ల సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ లను నిర్మిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వ్యర్థాలను నదుల్లోకి చెరువులోకి వదలకుండా నదులను శుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. మనందరి సమష్టి కృషి ఫలితం గానే మెరుగైన పర్యావరణం మన భవిష్యత్తు తరాలకు అందించడానికి సాధ్యం అవుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ బిక్షపతి, అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ వీరేష్, అసిస్టెంట్ సైంటిస్ట్ కనుక జ్యోతి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం

### సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/ఇల్లంతకుంట:** ఇందిరమ్మ ఇండ్లను లబ్దిదారుల వేగంగా నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లబ్దిదారులకు సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఇల్లంతకుంట మండలం లోని శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి ఫంక్షన్ హాల్ లో రెండో విడత క్రింద 760 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులను మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తో కలిసి పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఇల్లంతకుంట మండలంలో మొదటి విడతలో 45 ఇండ్లు, రెండో విడత కింద 760 ఇండ్లను పూర్తి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి నేడు ఉత్తర్వులు పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. ప్రభుత్వం అందించే సహాయం గురించి పైరవి వంటివి చేయాల్సిన అవసరం లేదని, ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వడానికి వీలు లేదని అన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామని, ఇసుక అందుబాటులో పెడతామని తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన మాట ప్రకారం సోంత స్థలం ఉన్న నిరు పేదలను గుర్తించి ఇల్లంతకుంట మండలంలో 805 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు.పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి డిసిఓ రామకృష్ణ, ఎంపీడీవో శశికళ, తహశీల్దార్ ఫారూక్, ఎఎంసి వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

## విద్యను వ్యాపారం చేస్తే ఊరుకోం


### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి




**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** విద్యాసంవత్సరంప్రారంభమవుతున్న నేపథ్యంలో కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకి అధికారులు ముం దస్తుగా అడ్డుకట్టవేయాలని, కార్పొరేట్ విద్య సంస్థలు విద్యను వ్యాపారం చేస్తే చూస్తు ఊరుకోమని ఎఐఎస్ఎఫ్ తెలంగాణరాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాకముం దేవిద్యావ్యాపారానికి తెరలేపాయన్నారు. ముం దస్తు అడ్మిషన్లు చేయటమే కాకుండ పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు ముందుగానే అమ్ముతున్నారన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఒక పాఠశాలకు అనుమతి తీసుకొని అదే పేరిట నాలుగైదు బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకొని పాఠశాలలు నడిపిస్తున్నాయని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డోనేషన్లు, ఫీజులు,వసూలు చేస్తు, ఫీజుల నియంత్రణ చట్టాన్ని తుంగలోతొక్కి ఇష్ట రీతిలో ఫీజులను పెంచి తల్లిదండ్రుల నుండి లక్షలాది రూపాయలను దండుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిత్వ శాఖఖాళీగా ఉండటంవల్ల విద్య వ్యవస్థ కుంటుపడిపోయే అవకాశం ఉన్నందున ప్రత్యేకంగా విద్యాశాఖ మంత్రిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జెర్రిపోతుల జనార్దన్,వర్కింగ్ ప్రసిడెంట్ రామగళ్ల నరేష్, వేల్పుల ప్రసన్నకుమార్, జక్కుల అనిరుద్, సిద్దుల సుమన్ పాల్గొన్నారు.

## వారధి ఇన్‌చార్జి ఆంజనేయులుపై చర్యలేవి?

### మంత్రి శ్రీధర్‌బాబుకు ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగేందర్ వినతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** వారధి ఇన్‌చార్జి ఆంజనేయులను తొలగించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగేందర్ ఆద్వర్యంలో ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలోని వారధి ద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు మెరిట్ ప్రాతిపదికన కాకుండా డబ్బులు దండుకుని రిక్రూట్‌మెంట్ చేశారని ఆరోపించారు. అందులో జరిగినఅవకతవకలపైవిచారణజరిపించాలని డిమాం డ్ చేశారు.యుగేందర్ మాట్లాడుతూ వారధి ద్వా రా మెడికల్ కాలేజీలో మెరిట్ ప్రకారం కాకుండా రిక్రూట్‌మెంట్ చేసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలపై విచారణ జరిపించాలని పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఏ ప్రాతిపదికన వారది ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారో జిల్లాలోని నిరుద్యోగులకు బహిరంగంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు. వారధి ఇంచార్జి రిటైర్డ్ అధికారి ఆంజనేయులును తొలగించకుండా ఎందుకు ఉన్నతాధికారులు వెనకేసుకు వస్తున్నారో స్పష్టం చేయాలన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉద్యోగుల దందా నడుస్తున్నా సంబంధిత జిల్లా అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు వారధి కార్యాలయాన్ని గత పదిసంవత్సరాల కిందట ఏర్పాటు చేయగా అది ప్రస్తుతం అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. మెడికల్ కళాశాల నిర్వహణకై గతేడాది అక్టోబర్, నవంబర్‌లో మరో ఉద్యోగాలకై నోటిఫికేషన్ జారీ చేసి ఆరు నెలలు గడుస్తున్నా ఎందుకు రిక్రూట్‌మెంట్ చేయడం లేదని ప్రశ్నించారు.

## 27 కేసుల్లో పట్టుకున్న రూ.10.11 కోట్ల గంజాయి, డ్రగ్స్ కాల్చివేత

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్లలో 27 కేసుల్లో పట్టుబడిన గంజాయి, ఆల్ప్రాజోలం, డైజో ఫామ్ లాంటి మత్తు పదార్థాలను మంగళవారం దహనం చేశారు. మెదక్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్ డిస్పోజల్ అధికారిగా ఇచ్చిన ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్లలో పట్టుబడిన మత్తు పదార్థాలను మెడికేర్ వెస్టేజ్ మేనేజ్ మెంట్ ఇస్నాపూర్ ప్రాంతంలో కాల్చి వేశారు. పటాన్ చెరువు స్టేషన్‌లో 10 కేసులు , సంగారెడ్డి స్టేషన్‌లో 7 కేసులు , నారాయణ్ ఖేడ్‌లో 3 కేసులు, అందోల్‌లో నాలుగు కేసుల్లో పట్టుబడిన డ్రగ్స్ గంజాయిని సంగారెడ్డి ఎక్సైజ్ సూపరిండెంట్ నవీన్ చందర్ ఆధ్వర్యంలో దహనం చేశారు. 209162, కేజీల గంజాయి, 7 గ్రాముల డైజో ఫామ్, 0,496 కేజీల ఆల్ప్రాజోలం, 0,468 కేజీల పప్పి స్ట్రా 3 ఎంఎంసి 90.23 కేజీలను దహనం చేశారు. దహనం చేసిన డ్రగ్స్ విలువ సుమారు రూ. 10.11 కోట్లుగా ఉంటుందని ఎక్సైజ్ సూపరిండెంట్ నవీన్ చందర్ తెలిపారు.

## 30వరకు నిర్మల్ జిల్లాలో పోలీస్ యాక్ట్

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లాలోని శాంతిభద్రతల దృష్ట్యా పశాంతతను పెంపొందించేందుకు జూన్ 1నుండి 30 జూన్ వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదన్నారు. నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు,తుపాకులు పేలుడు పదార్థములు, నేరానికి పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదన్నారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితేసే పబ్లిక్ మీటింగ్‌లను, జనసమూహం ప్రోగు అవుట వంటివి నిషేదమన్నారు. రాళ్ళను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేదమన్నారు, లౌడ్ స్పీకర్‌లు, డీజేలు వంటివి నిషేదించామన్నారు. పోలీస్ యాక్ట్ ఉన్న సమయంలో ఎవరైన, రాజకీయ పార్టీల సభ్యులైన నియమాలు ఉల్లంఘించిన 30 పోలీస్‌ఆక్ట్ 1861 కింద శిక్షార్హులు అవుతారని ఎస్‌పి జానకి హెచ్చరించారు.

## పేదల పక్షాన ఎర్రజెండా పోరాటం

సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిర్మల్ /బోథ్ :** పేదల పక్షాన ఎర్రజెండా పోరాడుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బోథ్ నియోజకవర్గంలో సిపిఐ మండల మహాసభను ఎఐటియుసి భవన్‌లో మంగళవారం ర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారానికి సిపిఐ పోరాడుతూనే ఉంటుందన్నారు. రైతులకు గిట్టుబాట ధర అందించాలని. బీడీ కార్మికులకు నెలవారి పెన్షన్లు, ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని, అర్హత కలిగిన పేదలకు రేషన్ కార్డులు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో కుంటాల రాము, గోవర్ధన్, గోదావరి, బోజన్న, నరేష్, కార్తీక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**భోథ్ మండల్ సిపిఐ నూతన కమిటీ...** సిపిఐ మండల కార్యదర్శిగా ఎల్. నరేష్, పట్టణ కార్యదర్శిగా పి.కార్తీక్, మండల సంయుక్త కార్యదర్శిగా ఎస్కే మున్నిఫ్, రైతు సంఘం కార్యదర్శిగా భోజన్న, ఐఎల్ఓ కార్యదర్శి ఎస్.దాస్, సభ్యురాలుగా కవిత, ఆడెపు కమల, జి.లక్ష్మి , రాజేశ్వర్ ఎన్నికయ్యారు.

## నిరుపేదలందరికీ ఇళ్లు మంజూరు

రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/బోధన్ :** అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం వర్ని మండల కేంద్రంలో వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్ మండలాల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి వర్ని మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్‌బాబా, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు

## టైగర్‌జోన్ రద్దు చేసేవరకూ పోరాటం

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ జోన్‌ను రద్దు చేసే వరకు విశ్రమించేది లేదని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్పష్టం చేశారు. పోడుభూముల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలు చేపట్టిన నిరాహార దీక్షకు మంగళవారం ఎమ్మెల్యే మద్దతు తెలిపారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ టైగర్ జోన్ ద్వారా ఆదివాసీలను వారి నివాస ప్రాంతాల నుంచి తరిమివేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీల జోలికి వస్తే ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, జల్ జంగిల్ జమీన్ కోసం కొమరం భీం చేసిన పోరాట స్ఫూర్తితో ఆదివాసీలంతా కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పోడు వ్యవసాయం చేస్తున్న రైతులపై అటవీశాఖ అధికారులు అక్రమ కేసులు పెట్టి దౌర్జన్యాలు చేస్తున్నారని, ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అటవీశాఖ అధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కూడా అడ్డుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా ఆదివాసీలు సమస్యలు పరిష్కరించాలని నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. నిరసన కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు అర్జు మాస్టర్, బుర్సా పోచయ్య, మడావి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీమంత్రి హరీష్‌రావు జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ హత్నూర :** హత్నూర మండలం కసాల దౌల్తాబాద్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మాజీ మంత్రి హరీష్‌రావు జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేకు కట్ చేసి హరీష్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దిపేట శాసన సభ్యుడు, మాజీ మంత్రి హరీస్‌రావు నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆయన గత ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టరన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తీసుకువచ్చి ఏడారిగా ఉన్న మన భూములు పంటలు పండే విధంగా చేశారన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఇప్పుడు ప్రజలను విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్నది మా ప్రభుత్వమే కాబట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ కార్మిక విభాగం సంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు బాదే శివశంకర్‌రావు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రరెడ్డి, మాజీ ఎంపిపి వావిలాల నరసింహులు యాదవ్ బిఆర్ఎస్ మండల యూత్ ప్రసిడెంట్ తుమ్మలపల్లి, కిషోర్ వీరేశం గౌడ్, సాజిత్ అలీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పకడ్బందీగా 'బడిబాట'

అసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** బడి బాట కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం విద్యాశాఖాధికారి యాదయ్యతో కలిసి బడి బాట కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 19 వరకు జరిగే ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా, ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించాలని సూచించారు. 5 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరిని పాఠశాలకు చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గడపగడపకూ కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీల్లోని పిల్లలను, పరిశ్రమలు, ఇటుక బట్టీలు, హోటళ్లలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించే చర్యలు తీసుకోవాలన్నారు. బాలికలు తప్పనిసరిగా పాఠశాలలో ఉండేలా చూడాలని, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి వారికి పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత అప్పగించాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, కులపెద్దలు, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో సమన్వయం చేయాలని ఆదేశించారు. అనంతరం, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మాస్టర్ మైండ్స్ నిర్వహిస్తున్న ఆన్‌లైన్ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీ నారాయణ, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు సజీవన్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నదీమ్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

**వైద్య కళాశాలలో శుద్ధ జల ప్లాంట్ ప్రారంభం..** ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు శుద్ధ జలప్లాంట్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తెలిపారు. అంకుశాపూర్ గ్రామంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మి లతో కలిసి ప్లాంట్ ప్రారంభించారు. అనంతరం వైద్య విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ కళాశాలలో సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలని, వాటిని పరిష్కరించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ సీతారాం, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భూసమస్యల పరిష్కారానికి భూభారతి

నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టంతో ప్రజల భూ సమస్యలు త్వరగా పరిష్కారం పొందుతున్నాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం లక్ష్మణచందా మండలం అక్కపూర్‌లో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుండి 20వ తేదీ వరకు రెండో విడత రెవెన్యూ సదస్సులు జరుగుతాయని వెల్లడించారు. సదస్సుల్లో పాల్గొన్న ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులు ప్రజల దరఖాస్తులను స్వీకరించి, వెంటనే రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం అక్కపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించి, రైతుల భూసమస్యల దరఖాస్తులపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలో తరగతి గదులు, ఇంకుడు గుంత, లైటింగ్ వంటి వసతులను కలెక్టర్ పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, తహసీల్దార్లు సరిత, సంతోష్, ఎంపిడిఓ గజానన్, గిర్ధావర్ సంతోష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



## రెవెన్యూ సదస్సులు సద్వినియోగం

నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



**ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి :** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. డిచ్‌పల్లి మండలం, ధర్పల్లి మండలం గోవింద్‌పల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొని రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భూభారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూసమస్యలు పరిష్కరించి రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే మెండోరా మండలంలో పైలెట్ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులు జరిపి క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్నిరెవెన్యూ గ్రామాల్లో 20 వరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చుతగ్గులు, వారసత్వ భూములు, భూస్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూసమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టాపాస్‌బుక్‌లు లేకపోవటం, ప్రభుత్వ భూములను నవీకరించటం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్‌బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూసమస్యలకు సదస్సులలో దరఖాస్తులు స్వీకరిస్తామని, అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్ధేశిత గడువులోపు సమస్యలను పరిష్కరించటం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆగస్టు 14లోగా భూభారతి కింద వచ్చిన అన్నిఅర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్ జనరల్ డెస్క్‌ల వద్ద సదుపాయాల పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఓ రాజేంద్రకుమార్, తహసీల్దార్లు సతీష్‌రెడ్డి, శాంత, రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## 20 వరకూ రెవెన్యూ సదస్సులు

నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా




**ప్రజాపక్షం/నేరడిగొండ :** నూతన భూభారతి రెవెన్యూ చట్టంపై ఈనెల 20వరకు జిల్లావ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. రైతుల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించడం కోసం ఈ సదస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. మంగళవారం నేరడిగొండ మండలం ఆరెపల్లి, ఇచ్చోడ మండలం అడేగామ(కే)లో భూభారతి రెవెన్యూ సదస్సులలో అదనపు కలెక్టర్ శ్యామలదేవితో కలిసి కలెక్టర్ దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో భోరజ్ మండలంలో ఇప్పటికే రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. ఈసారి రెండు బృందాలుగా రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే స్థానిక తహసీల్దారులు పూర్తిస్థాయిలో సంబంధిత రెవెన్యూ గ్రామాలలో ప్రచారం నిర్వహించి ప్రజలకు సమాచారం అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం రెవెన్యూ గ్రామ సభలను పక్కాగా నిర్వహించాలని, దరఖాస్తుదారులకు ముందస్తు ఫారాలను ఇచ్చి వారి దరఖాస్తులను పరిశీలించి స్వీకరించాలని అధికారులకు సూచించారు, రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ సదస్సుల ద్వారా ప్రజలు రైతులు భూమికి సంబంధించిన సమస్యలు ఏమైన ఉంటే పరిష్కరించుకోవాలని, అధికారులు మీ గ్రామాలకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని, అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు మీ గ్రామాల్లోనే ఉంటారు కనుక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సులలో నేరడిగొండ, ఇచ్చోడ మండలాల తహసీల్దార్లు కలిమ్, సత్యనారాయణ, పంచాయతీ సెక్రటరి, సిబ్బంది, ప్రజలు, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకులు రుణ లక్ష్యాలు సాధించాలి






సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** బ్యాంకులు రుణ లక్ష్యాలు సాధించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాబ్యాంకర్లతో మహిళా సంఘాలకు వాణిజ్య, వ్యాపార, రాజీవ్, యువ వికాసం, ముద్ర లోన్లు మహిళా డ్రైవర్లకు డ్రోన్ ఆపరేటర్లకు, ఇటుకల తయారీదారులకు, ట్రైలరింగ్ మగ్గం వర్క్ పనులు చేసి వారికి రుణ సహాయంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం కింద లబ్దిదారులకు 90శాతం ప్రభుత్వమే భరిస్తుందని, బ్యాంకులకు ఎటువంటి ఆర్థికభారం లేదన్నారు. బ్యాంకర్లు మహిళసంఘాలకు రుణాలు అందించాలన్నారు. మహిళా సంఘాలకు డ్వాక్రా రుణాలతో పాటు పర్సనల్ రుణాలు కూడా మంజూరు చేయాలన్నారు. లబ్ధిదారులను ఎలాంటి అసౌకర్యాలకు గురి చేయకుండా రుణ సదుపాయం కల్పించాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రుణ లక్ష్యాలు సాధించి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎల్డీం నరసింహరావు, పిడి డిఆర్‌డిఓ జ్యోతి, ఇడి ఎస్‌సి కార్పొరేషన్ రామచారి, ఎస్‌టి గిరిజన సంక్షేమశాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి, బిసి సంక్షేమ శాఖఅధికారి జగదీష్, మోప్మా పిడి గీత, బ్యాంకర్లు, అధికారులు పాల్గొన్నారు.

### భూసమస్యలను రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలి

రైతులు ప్రతి చిన్న భూసమస్య పరిష్కారానికి భూభారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు. తెలిపారు. నూతన రెవెన్యూ చట్టం భూభారతి అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో టిజిఐఎస్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 20వ తేది వరకు జిల్లావ్యాప్తంగా అన్నిమండలాల్లో ప్రజల వద్దకే రెవెన్యూ నినాధంతో సదస్సులు నిర్వహిస్తామని, అన్ని రెవెన్యూ గ్రామాలకు తహసీల్దార్ కూడిన బృందం వెళ్లి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తుందన్నారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు సమస్యలు పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ రవీందర్‌రెడ్డి మండల ప్రత్యేక అధికారి ఖాసీంబేగ్, రెవెన్యూ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్

**ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి :** జిల్లాలో వంద రోజులపాటు నిర్వహించనున్న సమగ్ర ఇంటిగ్రేటెడ్ వైద్య శిబిరాలను మంగళవారం పాత మంచిర్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక రకాల వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కలిగించ డానికి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. పరీక్షలు నిర్వహిస్తూ వ్యాధులపై అవగాహన కల్పించి అవసరమైన వారికి మందులు అందించాలన్నారు. జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 102 సిబ్బంది వాహనాలు, ఆర్‌బిఎస్‌కె సిబ్బంది, ఐసిటిసి సేవలు, ఎక్స్‌రే కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి టెక్నీషియన్ల సేవలను సమన్వయంతో వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నరేష్, డాక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శివ ప్రతాప్, డాక్టర్ అమర్, డాక్టర్ రాము, డాక్టర్ రజిత, వెంకటేశ్వర్లు, అల్లాడి శ్రీనివాస్, రామ్మూర్తి, నీలిమ, ప్రశాంతి, సురేందర్, లక్ష్మణస్వామితో పాటు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## నాణ్యమైన విత్తనాల వినియోగంతో అధిక దిగుబడి

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్తంగా ఎంపిక చేసిన నాణ్యమైన వరి, కంది, పెసర మూల విత్తనాలను కృషి విజ్ఞాన శాస్త్రవేత్త శివకృష్ణతో కలిసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నాణ్యత కలిగిన విత్తనాల వినియోగంతో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మంజుల, విజయ్, దీప్తి, వ్యవసాయ విస్తరణ అధికారులు రాము, చిరంజీవి, రహమాన్, స్వాతి, దమ్మదాన్ తదితలు పాల్గొన్నారు.

# బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇన్‌చార్జి ఎస్‌పి రాజేష్‌చంద్ర సూచన



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** జిల్లాలో బక్రీద్ పండుగను శాంతియుతంగా, మత సామరస్యంతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఇన్‌చార్జి ఎస్‌పి రాజేష్‌చంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఈనెల 7న బక్రీద్ పండుగ సందర్భంగా పోలీస్, పశుసంవర్ధక, రెవిన్యూ, రవాణా, మున్సిపల్ కమిషనర్లు, ముస్లిం మతపెద్దలు, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఇన్‌చార్జి ఎస్‌పి రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. బక్రీద్ పండుగ ఏర్పాట్ల గురించి, ప్రార్థనా స్థలాల పరిశుభ్రత, గోవుల అక్రమ రవాణా నివారించడం, బందోబస్తు నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బక్రీద్ పండుగ నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గోవుల అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని పోలీసుశాఖకు సూచించారు. బక్రీద్ పండుగ ఏర్పాట్లకు మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు సహకారం అందించాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు ఏ వర్గానికి చెందిన వారైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అవసరమైతే వారిపై పిడి యాక్ట్ ప్రయోగించడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. ఇన్‌చార్జి ఎస్‌పి రాజేష్‌చంద్ర మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలపై ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే స్థానిక పోలీస్‌స్టేషన్లో సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి మహేందర్, ఆర్‌డిఓ రమాదేవి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య, డిఎస్‌పి ప్రసన్నకుమార్, జెడ్‌పి సిఇఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్యతో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫోకస్

# మహిళ

హోమ్ బేస్డ్ బిజినెస్..

# ఆహారం.. లాభసాటి వ్యాపారం

మహిళలు ఇంటివద్ద చేయగలిగే వ్యాపారాల్లో ఆహారానికి సంబంధించింది ప్రధానమైనది. మహిళలు ఆర్థికంగా స్వావలంబిగా మారడానికి ఎన్నో మార్గాలను అన్వేషిస్తున్నారు.







అదే సమయంలో తగినంత తీరిక లేకపోవడంతో, ఇంటి వద్ద ఖాళీ సమయంలో చేయదగిన వ్యాపారాల గురించి ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'ఫుడ్ బిజినెస్' మహిళలకు అత్యంత అనుకూలంగా ఉండడమే కాదు, వారికీ సృజనాత్మకత, ఆదాయం, తృప్తిని అందించే రంగంగా నిలుస్తోంది. ఆహార వ్యాపారం అనేది బ్రహ్మవిద్య ఏమీ కాదు. ఏదైనా ఆహార పదార్థాన్ని తయారు చేసి, వినియోగదారులకు విక్రయించడమే. ఇది వండిన, ప్యాకేజ్డ్ ప్రాసెస్డ్ లేదా రెడీటుఈట్ విధానాలలో ఉండవచ్చు. ఈ వ్యాపారం చిన్న స్థాయి నుండి పెద్ద స్థాయికి విస్తరించవచ్చు.

## పెట్టుబడి..

ఫుడ్ బిజినెస్‌కు పెట్టుబడి రూ.5000 నుంచి రూ.50000 మధ్య ఉంటుంది. అంటే, మీరు పెట్టే వ్యాపార స్థాయి, పరిధిని బట్టి పెట్టుబడి ఉంటుంది. తక్కువ పెట్టుబడితో లేదా మనకు అనుకూలమైన పెట్టుబడితో వ్యాపారం చేయగలగడం ఫుడ్ బిజినెస్ ప్రత్యేకత. ఇంటి నుంచి పని చేసే అవకాశం ఉంటుంది కాబట్టి, కుటుంబాన్ని అశ్రద్ధ చేయకుండా వ్యాపారాన్ని నడపవచ్చు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం లభిస్తుంది. ఇది మహిళలను అర్థస్వావలంబన దిశగా నడిపిస్తుంది. అంతేగాక, మహిళల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. స్వంత బ్రాండ్‌కి రూపం ఇచ్చే అవకాశం ఉంటుంది. కస్టమర్‌కు ఇంటి వంటలా ఆరోగ్యకరమైన ఆహారం అందించవచ్చు.

## ఇంటివద్ద చేయగలిగే ఆహార వ్యాపార రకాలు..

**హోమ్ బేకరీ:** కేక్స్, కుకీలు, బ్రెడ్లు, మఫిన్లు తయారు చేయడం. పుట్టినరోజులు, పెళ్లిళ్లు వంటి ఈవెంట్‌లకు ఆర్డర్లపై పని చేయవచ్చు.

**పికిల్ (ఊరగాయలు) తయారీ:** ఆవకాయ, మాగాయ, నిమ్మకాయ, మిక్స్‌డ పికిల్స్. శాస్త్రీయ విధానంలో, ప్రత్యేకించి ఆయుర్వేద తరహాలో తయారుచేసిన ఉరగాయలకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది.

**అప్పడాలు.. వడియాలు:** వివిధరకాల వడియాలు (సగ్గుబియ్యం, బియ్యం, శెనగ పప్పు) తయారీ. వాటిని చక్కటి ప్యాకింగ్‌లో విక్రయించవచ్చు.

**ఇన్‌స్టెంట్ మిక్స్‌లు:** ఉప్మా మిక్స్, పులిహోర మిక్స్, రవ్వ దోస మిక్స్. ఇన్‌స్టంట్ ఫుడ్ మిక్స్ అని వచ్చేలా పేరు పెడితే మార్కెటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది.

**చక్కెర తక్కువగా ఉన్న స్వీట్‌లు (డైటు స్వీట్లు):** డయాబెటిక్ ఫ్రెండ్లీ లడ్డు, బార్ ఫార్మ్ స్వీట్‌లు. ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తయారు చేస్తే ఆదరణ పొందుతుంది.

**టిఫిన్ సర్వీసులు:** ఆఫీసులకు, విద్యార్థులకు రోజువారీ లంచ్, డిన్నర్ బాక్స్‌లు.ఆరోగ్యకరమైన, ఇంటి వంటల్ని ఇష్టపడే వారికి ఇది పెద్ద రిలీఫ్.

**పాలకూర పొడర్లు, మసాలా పొడర్లు:** కరివేపాకు, మెంతి కూర, మునగ ఆకుల పొడర్లు. కారం పొడి, సాంబార్ పొడి, పులుహోర పొడి లాంటి రుచికరమైన మసాలా తయారీ.

వ్యాపారం ప్రారంభించడానికి ముఖ్యంగా వంట పట్ల ఆసక్తి, కొత్త రకాలు సృష్టించగల సామర్థ్యం ఉండాలి. హైజీన్, న్యూట్రిషన్ అంశాలపై అవగాహన అవసరం.

## సవాళ్లు


ఇంటి నుంచే ఫుడ్ బిజినెస్ చేయడం ఒక రకంగా సులభంగానే కనిపిస్తుంది. కానీ, ఇందులోనూ కొన్ని సవాళ్లు, సమస్యలు లేక పోలేదు. వ్యాపారం అన్న తర్వాత పోటీ తప్పకుండా ఉంటుంది. ఎంతటి పోటీ ఉన్నా, దానిని తట్టుకొని వ్యాపారాన్ని నిలబెట్టుకోవడం అనుకున్నంత సులభం కాదు. అందుకు నిరంతరం కష్టపడాలి. దృఢదీక్షతో ముందుకు సాగాలి. నాణ్యతను క్రమం తప్పకుండా ఒకేలా ఉంచడం కూడా ఒక సమస్యగానే చెప్పుకోవాలి. వంటవారు మారినప్పుడు లేదా ముడిసరుకుల ఎంపికలో పొరపాటు జరిగినప్పుడు, తయారు చేసిన ఆహార పదార్థాల నాణ్యతలో మార్పు ఉండవచ్చు. సాధ్యమైనంత వరకూ అలాంటి సమస్య తలెత్తకుండా జాగ్రత్త పడాలి. అన్నిటినీ మించి వినియోగదారుల నమ్మకాన్ని పొందాలి. ఇది అసాధ్యం కాకపోయినా, సులభం మాత్రం కాదు. ఆహారం పూర్తిగా శరీరానికి, ఆరోగ్యానికి సంబంధించింది కాబట్టి, జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటారు. అందుకే, వినియోగదారుల నమ్మకాన్ని పొందడానికి అన్ని విధాలా ప్రయత్నం చేయాలి. శాంపిల్స్ పంపడం, బంధువులు, స్నేహితులు, తెలిసిన వారిని పిలిచి కిట్టీ పార్టీని ఏర్పాటు చేసుకోవడం కొంత వరకూ ప్రచారానికి ఉపయోగపడతాయి. స్విగ్గీ, జొమాటో ద్వారా ఆర్డర్లు తీసుకోవచ్చు. అదే విధంగా అమేజాన్, ఎట్సీ, మీషో వంటి ఇ–కామర్స్ ద్వారా అమ్మకాలు సాగించవచ్చు. మీకు మాత్రమే ప్రత్యేకం అనే రీతిలో కొత్త వంటకాలను తయారు చేయడం అవసరం. అదే విధంగా ఒకసారి అమ్మిన తర్వాత, కస్టమర్ల నుంచి ఫీడ్‌బ్యాక్ తప్పక తీసుకోవాలి. ఏవైనా విమర్శలు వస్తే, వాటిని విశ్లేషించి, లోటుపాట్లు సరిచేసుకోవాలి. అంతేగానీ, కస్టమర్లపై ఆగ్రహం ప్రదర్శించకూడదు. ఆహార తయారీ మహిళల శక్తికి అద్దం పడే రంగం. ఇంటి నుంచి ప్రారంభించి, గ్రామ స్థాయిలోనూ, పట్టణ స్థాయిలోనూ ఈ వ్యాపారాన్ని విస్తరించవచ్చు. స్వయం ఉపాధిని ఏర్పరుచుకోవడమే కాకుండా, ఇతర మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించగలగడం ఈ రంగానికి విశిష్టత. చిన్న ఆరంభమే, పెద్ద విజయానికి ఆరంభం అన్నదానికి ఆహార వ్యాపారం చక్కటి ఉదాహరణ.

## అనుమతులు.. రిజిస్ట్రేషన్లు




ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) లైసెన్స్ తీసుకోవాలి. ప్రాథమికంగా ఫుడ్ హ్యాండ్లింగ్, హైజీన్ సర్టిఫికేట్ కూడా ఉంటే మంచిది. లైసెన్స్ తీసుకొని, తయారు చేసిన ఆహార పదార్థాలను ఆకర్షణీయమైన, శుభ్రంగా ఉండేలా చూడాలి. అందులో బ్రాండ్‌పేరు, లేబుల్, తయారీ తేదీ, ఎప్పటిలోగా వాడాలి వంటి వివరాలు తప్పనిసరి. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి మార్కెటింగ్ మాధ్యమాలు ద్వారా ప్రచారం చేసుకోవచ్చు. స్వయంగా సాంపిళ్లు పంపించడం, ఫుడ్ డెలివరీ యాప్‌లలో లిస్ట్ అవడం వంటి మార్గాలు కూడా ఉన్నాయి.

# హార్మోన్ల మార్పులు.. ఆరోగ్య సమస్యలు..



హార్మోన్ల మార్పులు మహిళల మానసిక, శారీరక ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావం చూపుతాయి. ఈ మార్పులు సహజంగా లేదా బాహ్య కారణాల వల్ల సంభవించవచ్చు. ఉదాహరణకు హార్మోన్ల మార్పుల సమయాలుబుతుస్రావ చక్రం: ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ స్థాయిలలో మార్పులు ఋతుస్రావం సమయంలో ఆలోచనల్లో నిలకడ లేకపోవడం, చిరాకు, లేదా ఆందోళనను కలిగిస్తాయి. కొందరు మహిళలు ప్రీమెన్‌స్ట్రువల్ సింద్రోమ్ (పిఎంఎస్) లేదా ప్రీమెన్‌స్ట్రువల్ డైస్ఫోరిక్ డిసార్డర్ (పిఎండిడి)తో బాధపడతారు, ఇవి మానసిక ఒత్తిడిని పెంచుతాయి.గర్భం: గర్భధారణ సమయంలో హార్మోన్ల స్థాయిలు (ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్, మరియు ఆక్సిటోసిన్) గణనీయంగా మారతాయి. ఇవి మానసిక స్థితి, ఆందోళన, లేదా భావోద్వేగ అస్థిరతను కలిగిస్తాయి. ప్రసవం తర్వాత హార్మోన్ల స్థాయిలు వేగంగా తగ్గడం వల్ల పోస్ట్‌పార్టం డిప్రెషన్ లేదా ఆందోళన సంభవించవచ్చు. ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ ఉత్పత్తి తగ్గడం వల్ల మెనోపాజ్ సమయంలో మహిళలు ప్రతి విషయానికీ అతిగానూ, అర్థంలేకుండానూ స్పందించే అవకాశం ఉంది. డిప్రెషన్, లేదా ఆందోళనను అనుభవించవచ్చు. థైరాయిడ్ వల్ల హార్మోన్ల అసమతుల్యత (హైపోథైరాయిడిజం లేదా హైపర్‌థైరాయిడిజం) కూడా మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. హార్మోన్ల అసమతుల్యత మూలంగా మహిళలు భావోద్వేగ అస్థిరత, చిరాకు, లేదా ఏడుపును అనుభవించవచ్చు. డిప్రెషన్, ఆందోళన సహజమవుతాయి. ఈస్ట్రోజెన్, సెరోటోనిన్ (మూడ్‌ను నియంత్రించే న్యూరోట్రాన్స్‌మిటర్) మధ్య సంబంధం ఉంది. ఈస్ట్రోజెన్ స్థాయిలలో మార్పులు డిప్రెషన్ లేదా ఆందోళనను పెంచవచ్చు. హార్మోన్ల మార్పులు నిద్రలేమి లేదా నిద్ర నాణ్యతను తగ్గిస్తాయి, ఇది మానసిక ఒత్తిడిని మరింత పెంచుతుంది. హార్మోన్ల అసమతుల్యత వల్ల మహిళలు అలసట, ఏకాగ్రత లోపం, లేదా శక్తి కొరతను అనుభవించవచ్చు. హార్మోన్ల అసమతుల్యతను గుర్తించడానికి రక్త పరీక్షలు చేయించుకోవడం, గైనకాలజిస్ట్ లేదా ఎండోక్రినాలజిస్ట్‌ను సంప్రదించడం అత్యవసరం. మెనోపాజ్ లేదా తీవ్రమైన హార్మోన్ల అసమతుల్యత సమయంలో హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (హెచ్ఆర్‌టి) సహాయపడవచ్చు, కానీ వైద్య సలహాతో మాత్రమే తీసుకోవాలి. ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ 'డి', మెగ్నీషియం వంటి పోషకాలు హార్మోన్ల సమతుల్యతను మెరుగుపరుస్తాయి. వ్యాయామం, ఒత్తిడి నిర్వహణ: యోగా, ధ్యానం, లేదా క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అనేది హార్మోన్ల స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. సమయానికి నిద్రపోవడం, కెఫీన్, ఆల్కహాల్‌ను తగ్గించడం హార్మోన్ల సమస్యలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఏదిఏమైనా హార్మోన్ల లోపం లేదా మార్పుల వల్ల మహిళల్లో తీవ్రమైన శారీరక, మానసిక సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి, అలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం, చికిత్స చేయించుకోవడం అవసరం.

# మూడో బిడ్డకూ ప్రసూతి ప్రయోజనాలు



మూడో బిడ్డకు కూడా ప్రసూతి ప్రయోజనాలు ఉంటాయని సుప్రీం కోర్టు స్పష్టం చేయడం మహిళలకు, ప్రత్యేకించి ఉద్యోగినులకు శుభవార్తగా చెప్పుకోవాలి. కె. ఉమాదేవి వర్సెస్ తమిళనాడు ప్రభుత్వం కేసు, 2022లో సుప్రీంకోర్టు ఒక మహిళకు తన మూడవ బిడ్డకు ప్రసూతి ప్రయోజనాలను మంజూరు చేసింది. దీనిని 2017 ప్రసూతి ప్రయోజన (సవరణ) చట్టం ప్రకారం రాజ్యాంగ హక్కుగా పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఆరోగ్యం, గౌరవం, గోప్యత, వివక్షత లేని హక్కు జీవించే హక్కులో అంతర్భాగమని అత్యున్నత న్యాయస్థానం ధృవీకరించింది. ఆరోగ్యం, సమానత్వం, గౌరవ హక్కులతో సహా పునరుత్పత్తి హక్కులు అంతర్జాతీయ మానవ హక్కుల చట్టంలో భాగమని తేల్చిచెప్పింది. సుచితా శ్రీవాస్తవ వర్సెస్ చండీగఢ్ అడ్మినిస్ట్రేషన్ కేసు, 2009 లో పునరుద్ఘాటించబడినట్లుగా, పునరుత్పత్తి ఎంపికల హక్కు ఆర్టికల్ 21 (జీవించే హక్కు మరియు వ్యక్తిగత స్వేచ్ఛ) కింద పరిరక్షించడం జరిగింది. 2017లో సవరించిన ప్రసూతి ప్రయోజన చట్టం, 1961, మహిళా ఉద్యోగులకు ప్రసవానికి ముందు... తరువాత వేతనంతో కూడిన ప్రసూతి సెలవు ఇవ్వాలని స్పష్టం చేస్తున్నది. అంతేగాక, సంబంధిత ప్రయోజనాలను అందించాలని కూడా చెప్తున్నది. కాగా, ఈ చట్టం 10 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న కర్మాగారాలు, గనులు, తోటలు, ప్రభుత్వ సంస్థలు, దుకాణాలు, ఇతర కార్యాలయాలకు వర్తిస్తుంది. ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ యాక్ట్, 1948 పరిధిలోకి వచ్చే మహిళలు కూడా ప్రసూతి ప్రయోజనాలకు అర్హులు. ఇద్దరు పిల్లల వరకు మహిళలకు 26 వారాల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఉంటాయి. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే 12 వారాల పాటు సెలవుకు అర్హులు. అంటే, ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న మహిళలకు ప్రసూతి సెలవులను చట్టం నిషేధించదు. ఇది పిల్లల సంఖ్య ఆధారంగా మాత్రమే వ్యవధిని పరిమితం చేస్తుంది. ఇదే విషయాన్ని సుప్రీం కోర్టు తన తీర్పులో వివరించింది.

# పేదల కష్టాల్లో ముందుడేది సిపిఐ

ఈ నెల 6న జరిగే సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపు : ఎస్.విలాస్



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలో మంగళవారం సిపిఐ నాయకులు నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ పార్టీ భారతదేశంలో 1925లో స్థాపించబడినదని, భారత పౌరులకు, రోటి, కాపడా, మఖాన్,దున్నేవాడిదే భూమిఅని,బ్యాంకుల జాతీయకరణ,రాజకరణాలరద్దు,ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం,అటవీ హక్కుల చట్టం,భావన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం, వంటి వాటిని తీసుక వచ్చిందన్నారు. అదేవిధంగా స్వాతంత్రాన్ని కంటే ముందు ఆర్థిక వర్గానికి 37 చట్టాలను సిపిఐ అలాగే ఎఐటియుసిలు సాధించడం జరిగిందని, హైదరాబాద్ రాష్ట్రం విముక్తికై తమ కార్యకర్తలను త్యాగం చేసింది ఎర్ర జెండానే అని, తెలంగాణ రాష్ట్రం భారత్ దేశంలో విలీనం సిపిఐ పోరాటాల వల్లే సాధ్యపడిందన్నారు.ర్మల్ జిల్లాలో మహాసభలు ఈ నెల 6వ తేదీన నిర్మల్ జిల్లాలో జరుగుతాయని,ఈ సభలకు ముఖ్య అతిథిలుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కళావేణి శంకర్‌లు హాజరవుతారని కనుక ఈ సభను విజయవంతం చేయాలని అన్నారు. అదే విధంగా ఖానాపూర్ మండల సిపిఐ సభలో 13 మంది కౌన్సిల్ సభ్యులతో,పాటు ఏడుగురు కార్యవర్గ సభ్యులతో ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల కార్యదర్శిగా కడుకుట్ల రవి,సహాయ కార్యదర్శిగా చిలుకూరి ఇస్తారి,మండల కోశాధికారిగా పిట్టల భీమేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉపాలి.జిల్లా కార్యవర్గ సభ్యులు భుక్య రమేష్, ఈ ఎన్నికకు సభ్యులుగా పాల్గొన్నారు.

# వందేళ్ల సిపిఐ ప్రస్థానం... ప్రజల పక్షాన రాజీలేని పోరాటం

సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలే ప్రాణంగా ప్రజలకు అండగా సిపిఐ జెండా నిలబడి పోరాడుతుందని సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం గొట్టుముక్కల గ్రామంలో జరిగిన సిపిఐ దేవరకొండ మండల 14వ మహాసభకు ముఖ్య అతిధిగా హాజరైన పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా, ప్రజా సమస్యలే అజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సిపిఐ అని శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని, దున్నేవాడికి భూమి కావాలని, శ్రమ దోపిడి వ్యతిరేకంగా బడుగు, బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ పోరాటినికి నాయకత్వం వహించిన పార్టీ సిపిఐ అని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని అదుపు చేయకుండా పేదవారి నడ్డి విరుస్తుందని, మళ్లీ సిలిండర్ ధరను పెంచడం అన్యాయం అని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి, ఎరువులు, విత్తనాలు సబ్సిడిపై రైతులకు ఇవ్వాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆయన కోరారు. నల్గొండ ఎంఎల్‌సి, సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ ప్రధాన సమస్య అయిన పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేసి నియోజకవర్గానికి సాగునీరు అందించాలని కోరారు. నకిలీ విత్తనాలు అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించుటకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యనాయక్, మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, మండల సహాయ కార్యదర్శి రామస్వామి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, మాజీ ఎంపిపి పల్లా సులోచన, రంగారెడ్డి, రామిరెడ్డి, యాదయ్య, వెంకట్ రాములు, అనిత, జ్యోతిబసు, నగేష్, వెంకటేశ్వర్‌రావు, గోపి, పుల్లయ్య, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



# బ్యాంకు సివిల్ స్కోర్‌కు సంబంధం లేకుండా రుణాలు ఇవ్వాలి

దోపిడీ పీడన ఉన్నంత వరకూ ఎర్రజెండా రెపరెపలు

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** బ్యాంకు సివిల్ స్కోర్‌కు సంబంధం లేకుండా రాజీవ్ యువవికాస్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరికి రుణాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. మంగళవారం సిపిఐ పోతంగల్ మండల మహాసభ హంగర్గ ఫారంలో ఎ.విఠల్‌గౌడ్ అధ్యక్షతన జరగగా ఈ మహాసభనుద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు మాట్లాడారు. దేశంలో దోపిడీ పీడన వ్యవస్థ ఉన్నంతకాలం వామపక్షాన్ని అంతం చేయడం ఎవరికి సాధ్యపడదన్నారు. మోదీ అనుసరిస్తున్న నరహంతక ఫాసిస్ట్ రాక్షస విధానాన్ని తీవ్రంగా ఖండించారు. నక్సలిజాన్ని, వామపక్షాన్ని అంతం చేయడానికి ముందు వారు ఏ ఆశయ సాధన కోసం ఏ సమసమాజ సాధన కోసం దశాబ్ధాల కాలం నుంచి పోరాటం చేస్తున్నారో ముందు ఆ సమస్యలు నిర్మూలించండని మోదీ ప్రభుత్వానికి హితవు పలికారు. కార్మికులు, కర్షకులు, పీడత తాడిత ప్రజానీకానికి కమ్యూనిస్ట్ పార్టీ అండగా పోరాటాలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను రాజీవ్ యువవికాస్‌కు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ బ్యాంకు సివిల్ స్కోర్‌కు సంబంధం లేకుండా అమలు చేయకపోతే ఇబ్బందులు ప్రభుత్వానికి ఎదురు కాక తప్పదని ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో అనవసరపు అడ్డగోలు కొరీలు పెట్టి దాటవేయటం మంచిదికాదనీ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ సందర్భంగా సిపిఐ పోతంగల్ మండల కార్యదర్శి కొట్టే ప్రసాద్, మండల కార్యవర్గ సభ్యులు కపిల్, ఎస్‌కె.సోయల్, లక్ష్మణ్, మనోహర్ ఎన్నుకున్నామన్నారు.

# రామకృష్ణాపూర్ సమగ్రాభివృద్ధి సిపిఐ లక్ష్యం

సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి మున్సిపాలిటీని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సిపిఐ పార్టీ విస్తృతమైన డిమాండ్ల పట్టికను రూపొందించడం జరిగిందని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రామకృష్ణాపూర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. జూన్ 1న రామకృష్ణాపూర్‌లో ఘనంగా నిర్వహించిన క్యాతనపల్లి 3వ పట్టణ మహాసభలో ఈ డిమాండ్లను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వారు ప్రకటించారు. రాజీవ్ చౌక్ నుండి కమ్యూనిటీ హాల్ వరకు ఉత్సాహభరితంగా సాగిన భారీ ప్రదర్శన అనంతరం జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవెన శంకర్, రాష్ట్ర సమితి సభ్యులు పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా పార్టీ శతవార్షిక ప్రస్థానం, సాధించిన విజయాలు, దేశ రాజకీయాలపై లోతైన ప్రసంగం చేశారన్నారు. అనంతరం 80 మంది ప్రతినిధులతో జరిగిన ప్రతినిధుల సభలో 45మంది పట్టణ కౌన్సిల్, 17మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా మిట్టపల్లి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపాలిటీ ప్రజల అవసరాలు తీర్చేలా ఆధునిక స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సిబ్బందిని వెంటనే నియమించాలని, పరిసరాల పరిశుభ్రత కోసం శాస్త్రీయంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం జరిగిందని తెలిపారు. నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు గతంలో కొనుగోలు చేసిన ప్రభుత్వ భూమిని ఒక్కొక్కరికి 200 గజాల చొప్పున కేటాయించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించాలని, ప్రతి వార్డులో సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలని, ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వెలుగులు నింపి రాత్రి వేళల్లో ప్రయాణాలను సురక్షితం చేయాలని కోరిందన్నారు. గ్రామీణ యువత క్రీడల్లో రాణించేందుకు ప్రతి వార్డులో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని, 76 జిఒ కింద ఆగిపోయిన పట్టాలను వెంటనే పంపిణీ చేయాలని, ఆసరా పెన్షన్లను బ్యాంకుల ద్వారా అందించాలని, జ్ఞానాన్ని విస్తృతం చేసేందుకు గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, రామకృష్ణాపూర్ నుండి మంచిర్యాలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రామకృష్ణాపూర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని పలురకాల సిపిఐ డిమాండ్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు. ఈ డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పార్టీ కృషి చేస్తుందని, ప్రజాప్రతినిధులు కూడా స్పందించి సహకరించాలని జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇప్పకాయల లింగయ్య, జిల్లా సమితి సభ్యులు వనం సత్యనారాయణ, మిట్టపల్లి పౌలు, నక్క వెంకటస్వామి, కాదండి సాంబయ్య, ఎగుడ మొండి, మాదాస్ శంకర్, మారపల్లి రవి, బోయబోతుల కొమురయ్య, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

# మడికొండ డంపింగ్ యార్డును ఎత్తివేయాలి

హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి కర్రె భిక్షపతి



**ప్రజాపక్షం/ కాజీపేట :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు ద్వారా వెలవడే పొగతో మడికొండ, రాంపూర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర కాలుష్యం వ్యాపిస్తోందని, దీని ద్వారా స్థానిక ప్రజలు అనారోగ్యంతో వివిధ రోగాల భారిన పడుతున్నారని, వెంటనే డంపింగ్ యార్డును ఎత్తివేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. మంగళవారం కాజీపేట మండలం మడికొండ, రాంపూర్ ప్రాంతంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ 2012 సంవత్సరంలో మడికొండ, రాంపూర్ శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు ద్వారా ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని, డంపింగ్ యార్డుకు ప్రతి రోజుకు 20 టన్నుల పైన తడి, పొడి చెత్త చెదారం చేర్చుతున్నారని, దీని వల్ల రాంపూర్, మడికొండ చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర కాలుష్యం వ్యాపిస్తోందని, దీని కారణంగా స్థానిక ప్రజలకు శ్వాసకోశ వ్యాధులు, జలుబు, దగ్గు, గుండె సంబంధించిన వ్యాధులు వస్తూ వివిధ రోగాల బారిన పడి, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అవేదన వ్యక్తం చేశారు.

ఈ డంపింగ్ యార్డును తొలగించాలని స్థానికులు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం విచారకరమని, ఇటుకలే కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక్కడ డంపింగ్ యార్డును ఎత్తివేయడమా లేదా యాంత్రీకరణ చేస్తామని హామీ ఇచ్చిన మున్సిపాలిటీ అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, ఈ డంపింగ్ యార్డును ఇక్కడ నుండి ఎత్తివేసి జనవాసాలకు దూరంగా ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అధికారులు ఈ సమస్యను పరిష్కరించకపోతే, సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలను ఐక్యం చేసి, పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేపట్టడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సందర్శన కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, జిల్లా నాయకులు మునిగాల బిక్షపతి, ఎదునూరి వెంకట్రాజం, కొట్టే వెంకటేష్, లకవత్ లక్ష్మి, కాజీపేట మండల సహాయ కార్యదర్శి వేల్పుల సారంగపాణి, నాయకులు ఇల్లందుల పద్మ, మాచర్ల స్వరూప, ఎర్రబెల్లి రమేష్, కాగితాల రాములు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు



**ప్రజాపక్షం/ నర్సంపేట :** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దిడ్డిపార్థసారధి అన్నారు. నర్సంపేట ఎంఈఓ కొర్రసారయ్యకు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, విద్యార్థులకు త్వరగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందజేయాలని, మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న బోధన బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుపోవాలని పూర్తిస్థాయి పాఠ్యపుస్తకాలు అందించాలని విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయకుండా ప్రభుత్వ విద్యాసంస్థలు కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా సమితి సభ్యులు బానోతు వీరు నాయక్, నాయకులు సాయిరాజ్, అరుణ్, రవీందర్ పాల్గొన్నారు.

## విత్తన ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలి



**ప్రజాపక్షం / నల్లబెల్లి :** నాణ్యమైన విత్తన ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించి ఖల్లి విత్తనాల బారిన పడకుండా చూసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్త ఎస్ .సంధ్యకిషోర్ రైతులకు సూచించారు . మంగళవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు విత్తన ఎంపికపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం అపరాల విభాగం ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సంధ్యకిషోర్ మాట్లాడుతూ రైతులు వరిలో సిద్ది రకం ,కందిలో డబ్ల్యుఆర్ జిఈ 121 తెలంగాణ కంది2 అనే రకాన్ని రైతులకు అందించినట్లు చెప్పారు . ముఖ్యంగా వరిలో తెలంగాణ సోనా రకాన్ని జులై మాసంలో మాత్రమే నాటు వేయాలని ,మధ్యకాలిక ,దీర్ఘకాలిక రకాలైన సిద్ది సాంబమసూరి వంటి రకాలను తొందరగా నార్లు పోసుకోవాలన్నారు . ఆరుతడి పంటలు పూర్తిగా భూమిలో తగు తేమ ఉన్నప్పుడే విత్తుకోవాలని జులై 15 తర్వాత ఆరుతడి పంటలు వేసుకోవాలన్నారు . ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రజిత ,ఏఈఓలు కెవిలే శ్రీకాంత్‌రెడ్డి ,వి.వినయ ,ఎం.విశ్వభాను ,ఆర్ .శివకుమార్ కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి ,ఉపేందర్‌రెడ్డి ,ఇస్తారి శేఖర్ ,తిరుపతి ,రైతులు తదితరులు పాల్గొన్నారు .

# 'మేడారం'కు ముందస్తు ప్రణాళికలు

రాష్ట్ర మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** వచ్చే సంవత్సరం 2026లో జరగనున్న మేడారం మహాజాతరను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి ధనసరి అనసూయ సీతక్క జిల్లా అధికారులను ఆదేశించారు. వర్షాకాలం రాబోతున్నందున ప్రకృతి వైపరీత్యాల నుండి ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ కోసం ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లాలో ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి సీతక్క రాబోవు మేడారం మహా జాతరను, భారీ వర్షాలు పునరుద్ధరించుకొని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్‌పి శబరీష్, ఐటిడిఏ పిఓ చిత్రమిశ్రా, డిఎఫ్‌ఒ రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్‌లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గతంలో జరిగిన మహా మేడారం జాతర సందర్భంగా పనిచేసిన జిల్లా అధికారులు నేటికి జిల్లా అధికారులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు, జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 33 కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని రానున్న రోజుల్లో జాతరలో శాశ్వత పనులను నాణ్యతతో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ముఖ్యంగా జాతర మారకుండా భక్తులకు ఇబ్బందులు కల్గకుండా పనులు చేయాలని తెలిపారు. పూర్తి స్థాయిలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయడంతో పాటు నిరంతరం మంచినీటిని సరఫరా చేయాలని, గద్దెల ప్రాంతంలో భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, భక్తులు సులభతరంగా దర్శనాలు ముగించుకునే విధంగా క్యూలైన్‌లు, వాటి పై షెడ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున గ్రామాలలోని కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నీరు ప్రవహించే కాలువలలోని గుర్రపు డెక్క మొక్కలను తొలగించాలని తెలిపారు. గత వర్షాకాలంలో జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకొని పలు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అన్నారు. జిల్లా కేంద్రం నుండి ఏటూరు నాగారం వరకు గత జాతీయ రహదారి ఇరువైపుల గల చెట్లను అటవీశాఖ, ఆర్‌అండ్‌బి సిబ్బంది పర్యవేక్షించాలని, అందులో బలహీనమైన చెట్లను గుర్తించి వాటిని తొలగించాలని సూచించారు. డిఎస్‌పి రవీందర్, ఆర్‌డిఓ వెంకటేష్, జిల్లా అధికారులు, మండల అధికారులు, మేడారం పూజారులు, తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి : రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జిల్లాలో భూ సమస్యల నుంచి శాశ్వత పరిష్కారించడానికి భూభారతి ఆర్ఓఆర్ చట్టం వచ్చిందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూ భారతి సహాయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం పరిశీలించారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో సిబ్బంది పని తీరును, ప్రజలకు అందుతున్న సేవలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ నెల 3 నుండి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు భూ సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను సమయానికి పరిశీలించి, సంబంధిత తహసీల్దార్ కు సిఫారసు చేసి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు నిష్పక్షపాతంగా పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్లు హరిహర, శ్రీనివాస్, ఇడిఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల సమస్యలపై ఎఐఎస్ఎఫ్ వినతి



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భా గంగా మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న టీ చర్ పోస్టులను భర్తీ చే యాలని. ఎఐఎస్ఎఫ్ సహాయకార్యదర్శి రవితేజ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలం ఎంఇఒ అందుబాటులో లేకపోవడంతో కంప్యూటర్ ఆపరేటర్ భార్గవికి వినతిపత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ హసన్‌పర్తి మండల అధ్యక్షుడు కుక్కల కుమార్ పాల్గొన్నారు

## ప్రభుత స్కూళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలి: ఎఐఎస్ఎఫ్ వినతి

**ప్రజాపక్షం/ధర్మసాగర్:** ధర్మసాగర్ మండలములో ఉన్న ప్రభుత స్కూళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి వినయ్ అన్నారు.హనుమకోండ జిల్లా ధర్మసాగర్ మండలకేంద్రములో ఉన్న యంఈఓ కార్యాలయాములో ఎవరు లేకపోవడంతో తలుపులకు వినతి పత్రం ఇచ్చారు.ఈసందర్మంగా వారు మాట్లాడుతూ. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ప్రభుత స్కూళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాని యంఈఓ కార్యలయనికి వేళ్లడం జరిగిందని కార్యలయంలో ఎవరు కూడ సిబ్బంది లేరని అన్నారు.యంఈఓ రాందన్‌కు పోను చేయాగా నేను లేను ఉన్నపుడు రావాలని లెలిపారని అన్నారు.మండల విద్యాకార్యలయనికి వర్కింగ్ సమయంలో తాళాలు వేసుకోని వేళ్లడం అత్యత దుర్మార్గం అని అన్నారు. చేరన్,కోటేష్,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వుట్కూరి ప్రణీత్ గౌడ్



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎల్కతుర్తి మం డల విద్యాధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వుట్కూరి ప్రణీత్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు18 నెలలు గడుస్తున్న ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయలేదని విమర్శించారు. జూన్ 12న ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కానునందున సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలో కొట్టుమిట్టాడుతున్నాయని, విద్యార్థులను వంచించడంలో టిఆర్ఎస్, కాంగ్రెస్ లకు పెద్ద తేడా లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండ చరణ్, పెండాల అరుణ్, చిర్ర సాయి, పెండాల రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా సిపిఐ జనగామ జిల్లా మహాసభలు

బహిరంగ సభకు భారీగా తరలొచ్చిన శ్రమజీవులు




**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కేంద్ర బిందువైన పోరాటాల గడ్డ జనగామ జిల్లాలో జరుగుతున్న సిపిఐ జిల్లా 4వ మహాసభలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. జిల్లాలోని నర్మెట మండలంలో ప్రారంభం కాగా మొదటి రోజు జరిగిన బహిరంగ సభ, ర్యాలీకి కష్టజీవులు భారీగా తరలి వచ్చారు. ఎర్ర చొక్కాలు వేసుకొని, ఎర్ర చీరలు కట్టుకొని, సంకలో సంచి చేతిలో జెండా అన్నట్లు చిన్న పిల్లలు మొదలు కొని 80 ఏండ్ల వృద్ధుల వరకు కదలి వచ్చారు. వారిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అప్యాయంగా పలకరించి ఉద్యమ భీజాలు నాటింది వీరే అంటు అందరికి పరిచయం చేశారు. మొదటి రోజు జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలనే లక్ష్యంతో సిపిఐ శ్రేణులు జన సమీకరణపై దృష్టి పెట్టాయి. వర్షాకాలం ప్రారంభమై విత్తనాలు విత్తుతున్న నేపథ్యంలోనూ కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు, రైతులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. జనగామ పట్టణం నుండి వివిధ రంగాల్లో పనిచేసే హమాలీ కార్మికులు సొంత ఖర్చులతో డిసిఎంలు ఏర్పాటు చేసుకొని కదలొచ్చారు. చిల్పూరు మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన కార్మికులు ప్రభుత్వ భూముల కబ్జాను నిలదీస్తూ పోరాటం చేస్తుండగా వారంతా ఊరూ ఊరుగా కదలొచ్చిన సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. మహిరంగ సభకు ముందు భారీగా తరలొచ్చిన జనంతో బస్టాండ్ నుండి ర్యాలీ నిర్వయించారు. ర్యాలీ ముందు బాగంలో కూనంనేని సాంబశివరావు, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సిహెచ్ రాజారెడ్డిలు ఉన్నారు. వారి వెనకాల నాయకత్వం, వారి వెనకాల జనం ఎర్రజెండాలో జేజేలు కొడుతు వినాయక పంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వయించారు. ర్యాలీ తరువాత సైతం పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఒక విధంగా చూస్తే భారీగా తరలి వచ్చిన సిపిఐ శ్రేణులతో పంక్షన్ హాల్ కిక్కిరిసిపోయింది. కూనంనేని సాంబశివరావు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వివరించడంతో పాటు దేశంలో దోపిడి దారులు, బిజెపి హిందుహిజం, కాంగ్రెస్‌తో పొత్తుకు కారణాలు, బిఆర్ఎస్‌ను ఎందుకు ఓడించాల్సి వచ్చిందనే విషయాన్ని ప్రజలకు అర్థం అయ్యే విధంగా వివరించారు. కూనంనేని మాట్లాడుతున్నంత సేపుప్రజలునిశబ్దంగాఉపన్యాసాన్ని విన్నారు. పెద్ద సంఖ్యలో జనం తరలి రావడంతో నర్మెట ఎరుపుమయమైంది.

## కన్నన్న సేవలు మరువలేనివి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మానుకోట ప్రాంతంలో పేదల ప్రజలకు అండగా చారిత్రాత్మక పోరాటాలు నిర్వహించిన కమ్యూనిస్టు నేత పార్థసారథిరెడ్డి(కన్నన్న) సేవలు మరువలేనివని సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథి రెడ్డి అన్నారు. కన్నన్న 11వ వర్ధంతి కన్నన్న కాలనీలో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నక్క నాగార్జున అధ్యక్షతన జరిగి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాటాడుతూ భూస్వాములకు ఎదురొడ్డి వేలాదిమందికి ఇంటి స్థలాలు పంచారని, దోపిడి రహిత సమాజం కోసం పోరాటం చేశారని, తెలంగాణ ఉద్యమంలో తన వంతు భూమిఖ పోషించారన్నారు. ఈ ప్రాంతంలో బూర్జువా పెత్తందారీ వ్యవస్థకు ఎదురొడ్డి పోరాడిన ఘన చరిత్ర కన్నదే అన్నారు. క్రీడాకారుడిగా అన్ని రంగాల్లో కన్నన్న విశేషంగా రాణించారని అజయ్‌సారథిరెడ్డి కొనియాడారు. నాడు ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎదురొడ్డి పోరాడిన వీర చరిత్ర కన్నదన్నారు. ఖన్నన్న స్పూర్తితో మానుకోట పేద ప్రజలకు సిపిఐ అండగా ఉంటుందని, పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ వర్ధంతి సభలో సిపిఐ నాయకులు పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, కట్లోజు పాండురంగాచారి, తండ సందీప్, చొప్పరి శేఖర్,వెలుగు శ్రావణ్, కేదాసు రమేష్, బానోత్ రాజేష్, నాగార్జున, మంద శంకర్, బానోతు లింగ్యానాయక్, ఆబోతు అశోక్, ఎండి మహమూద్, కూరాకుల పాల్, ముడుసు రాణి, గాదం శ్యాం, ప్రసాద యాదవ్, కీసరప్రవీణ్‌రెడ్డి, రమేష్, శ్రీనాథ్, సతీష్, జానీ, వేణు, నాగేంద్రబాబు, యాకయ్య, విచ్చనాయక్, శేఖర్,గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తన ఎంపికతో అధిక దిగుబడులు : మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్

**ప్రజాపక్షం/ఖానాపూర్:** రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్తంగా చేపడుతున్న నాణ్యమైన విత్తన ఉత్పత్తి పథకం కార్యక్రమ ప్రారంభోత్సవంలో భాగంగా మంగళవారం ఖానాపూర్‌లోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో హరిబాబు మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి 14 రెవెన్యూ గ్రామాలకు, ప్రతి రెవెన్యూ గ్రామానికి ముగ్గురు రైతులకు వరంగల్ 44 వరి రకం(సిద్ధి), 2 విత్తనత సంచులు ఇద్దరికి , వరంగల్ 121 కందిరకం(ఒక్కొక్క సంచి 3 కిలోల చొప్పున) ఒక్కరికి రైతులకు రాయితీలో అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు క్లస్టర్ల వ్యవసాయ విస్తరణ అధికారులు, పరుచూరి సుబ్బారావు, ఎడ్ల వాసుదేవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు

రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్, మార్కెటింగ్ శాఖ సంచాలకులు, సహకార శాఖ రిజిస్ట్రార్ సురేంద్రమోహన్




**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్, మార్కెటింగ్ శాఖ సంచాలకులు, సహకార శాఖ రిజిస్ట్రార్ కె. సురేంద్రమోహన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డిసిపి ప్రభాకర్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై సమీక్షించి సమర్థ నిర్వహణకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రవాణా శాఖ కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఏ ఒక్కరు వైకల్యం బారిన పడకుండా, ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా, రహదారి ప్రమాదాలు సంభవించకుండా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఒకే ప్రాంతంలో ఐదు ప్రమాదాలు జరిగితే ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్లుగా గుర్తించి ఆయా ప్రాంతాలలో ప్రమాదాలు నివారించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రమాణాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ప్రతిరోజు 70 ప్రమాదాలు, 20 మరణాలు సంభవిస్తున్నాయని, దేశంలో మన రాష్ట్రం ఐదో స్థానంలో ఉందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టడం జరిగిందని తెలిపారు. రోడ్డు భద్రతపై పాఠశాలలు కళాశాలలు యూనివర్సిటీలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రతి నెల సమీక్షలు నిర్వహిస్తూ ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 70 ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, అందులో 60 జాతీయ రహదారి, 10 ఇతర రోడ్డులుగా గుర్తించి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ ను కలెక్టర్ డాక్టర్ సత్య శారద శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారులు పురుషోత్తం, శోభన్ బాబు, జిల్లా ఆర్అండ్‌బి అధికారి రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఎన్‌హెచ్‌ఎఐ టీం లీడర్ సంపత్ సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులుపాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారానికి భూభారతి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** గత ప్రభుత్వంలో ధరణితో రైతులను దగా చేశారని, రైతు సమస్యల పరిష్కారానికి భూభారతి ఆర్ఓఆర్ చట్టం తెచ్చామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో డిప్యూటీ తహసిల్దార్ మహ్మద్ రజాక్ అధ్యక్షతన నిర్వహించిన భూభారతి రెవెన్యూ అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా జాయింట్ కలెక్టర్ అశోక్ కుమార్, భూపాలపల్లి ఆర్డీవో రవి తో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో ఉన్న ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం గుర్తించి ధరణి స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకు వచ్చేందుకు మేధావులు, రైతు సంఘాలు, అందరితో చర్చించి గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం తీసుకు వచ్చిందన్నారు. ఏదేని సందర్భంలో తహసీల్దార్ ద్వారా పొరపాటు జరిగితే ఆర్డీఓ, ఆర్డీఓ నుండి కలెక్టర్, కలెక్టర్ నుండి భూ ట్రిబ్యునల్ కు వెళ్ళడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, ఉమ్మడి రేగొండ మండల కాంగ్రెస్ నేతలు, అధికారులు, రైతులు ఉన్నారు.

## వర్షాకాలంలో అంతర్గత రోడ్ల నిర్మాణాలు పూర్తి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో సమస్యాత్మకమైన రోడ్లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి ఉంచామని, వర్షాకాలంలో ప్రదాన అంతర్గత రోడ్ల పనులను త్వరగతిన చేపడుతున్నట్లు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం 53వ డివిజన్ విజయ గణపతి కాలనీ, మహాత్మా నగర్,హన్మంత రావు నగర్ లలో రూ.85 లక్షలతో, 54వ డివిజన్ సగర కాలనీలో రూ.33 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన 16 నెలలుగా నగరంలో ఉన్న ప్రధాన అంతర్గత రోడ్లను పూర్తి చేసుకున్నామని అన్నారు.ఎన్నికలలో ఈ డివిజన్ లలో తిరిగిన తరుణంలో ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని తెలిపారు.రెండు డివిజన్ లలో రూ. 1.05 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు,సంబధిత అధికారులు నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం హన్మంతరావు నగర్ లో ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమం చేసి,దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చోరీ నియంత్రణలపై దృష్టి పెట్టండి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీల నియంత్రణపై ప్రతి పోలీస్ అధికారి నజర్ పెట్టాలని వరంగల్ కమిషనర్ అధికారులకు పిలుపు నిచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గోన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా ఆస్తి నేరాలపై సమీక్షా జరిపారు. ఇందులో ప్రధానంగా పెండింగ్ చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్, సొమ్ము రికవరీ, పెండింగ్ లో వున్న చోరీ కేసులు, నిందితుల అరెస్ట్ పై సీపీ సమీక్ష జరపడంతో పాటు, సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో వున్న ఇతర కేసులపై సమీక్ష జరిపడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోని, కేసుల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకై సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రజలను భాగస్వాములను చేయడంతో సిసి కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగహన కల్పించాలని. నేరాలకు సంబంధించి అధికారులు దర్యాప్తు సమయం లో టెక్నాలజీ తో పాటు శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేపట్టాలని, చోరీలపై పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యంగా వాహనాల చోరీలకు సంబంధించి వాహనాలను ఇంటిలో పార్కింగ్ చేసుకోనే విధంగా ప్రజలకు సూచించాలని సీపీ తెలియజేసారు. రాబోవు బక్రీద్ పండుగను దృష్టి లో పెట్టుకొని మూగజీవాల రవాణా పై ప్రత్యేక దృష్టి పెట్టడం పాటు, పండుగ వేళ దర్గాల వద్ద పతిష్టమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయాలని.వరంగల్ కు వున్న కీర్తి ప్రతిష్టలకు తగ్గట్లుగా పోలీసింగ్ వుండాలి. ప్రతి పోలీస్ బేసిక్ పోలీసింగ్ పై దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిపిలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, జనగాం ఏఎస్పీ చెతన్య, అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గోన్నారు.

## కన్నీరు పెట్టుకున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

**ప్రజాపక్షం/ తొర్రూరు :** పెద్దవంగర మండలంలో రైతు వేదికలో అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. మంగళవారం పెద్దవంగర మండలంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పాల్గొని ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అర్హులైన వారికి అందజేసే సమయంలో భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో ఊరుకో అక్కా అంటూ యువ ఎమ్మెల్యేను అక్కడ ఉన్న మహిళలు ఓదార్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వంలో తన చేతుల మీదుగా నిరుపేదలకు ఇండ్ల పట్టాలు అందజేయడంలో యశస్వినిరెడ్డి భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా అర్హులైన వారికి నాలుగు దశల్లో ఐదు లక్షల సాయం అందిస్తుందన్నారు. సుమారు 400 నుంచి 600 చదరపు అడుగుల్లో ఇల్లు నిర్మించుకోవాల్సి ఉంటుందన్నారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తయిన తరువాత లక్ష, గోడలు నిర్మిస్తే లక్ష, స్లాబ్ నిర్మించిన తరువాత రూ.రెండు లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తరువాత మరో లక్ష చొప్పున నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని చెప్పారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## తొలిరోజు రైతుసదస్సు కార్యక్రమానికి భారీ స్పందన



**ప్రజాపక్షం/కొణిజర్ల :** రైతుసదస్సు కార్యక్రమం తొలిరోజు మండల పరిదిలోని తనికెళ్ల, అమ్మపాలెం గ్రామాల్లో నిర్వహించారు. తనికెళ్లలో రైతుసదస్సు కార్యక్రమానికి భారీ స్పందన వచ్చింది. రైతులు పలురకాల సమస్యలపై పెద్ద ఎత్తున హాజరయ్యారు. తనికెళ్ల నుంచి వివిధ సమస్యలపై 290 ధరఖాస్తులు రాగా అమ్మపాలెం గ్రామంలో 96 ధరఖాస్తులు వచ్చాయి. రైతుసదస్సు కార్యక్రమం అయిపోయిన తర్వాత ధరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఇన్‌చార్జ్ తహశీల్దార్ రాము తెలిపారు. ఈకార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఐ హవేలీ ఏరియా కార్యదర్శిగా గాంధీ
### సహాయ కార్యదర్శులుగా ఆర్‌కె, జాకీర్





**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖానాపుర హవేలీ ఏరియా కార్యదర్శిగా ఏనుగు గాంధీ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా నానబాల రామకృష్ణ (ఆర్‌కె), జాకీర్ ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన మహాసభలో ఈ ఎన్నిక జరిగింది. ఏనుగు గాంధీ అఖిల భారత యువజన సమాఖ్య మధిర డివిజన్ నాయకులుగా, ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పని చేశారు. గత దశాబ్ద కాలంగా జిల్లా కౌన్సిల్ సభ్యులుగా, హవేలీ ఏరియా కార్యదర్శిగా పని చేస్తున్నారు. సహాయ కార్యదర్శిగా ఎన్నికైన నానబాల రామకృష్ణ ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పనిచేస్తుండగా జాకీర్ ఆటో వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి జిల్లా నాయకులుగా ఉన్నారు. 22 మందితో ఖానాపురం హవేలీ ఏరియా కౌన్సిల్‌ను తొమ్మిది మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా గాంధీ మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి విస్తృతంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. హామీల అమలు కోసం సిపిఐ నేతృత్వంలో పోరాడతామన్నారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ఉన్న ఖానాపురం హవేలీ ఏరియాలో పలు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## రెవెన్యూ సదస్సులు సద్వినియోగం
### 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ సైదుబాబు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భూ భారతి చట్టానికి సంబంధించి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ సైదుబాబు తెలిపారు. మంగళవారం ఖమ్మం అర్బన్ పరిధిలోని ధంసలాపురం రెవెన్యూకు సంబంధించి 15వ డివిజన్ అల్లిపురం రైతు వేదిక నందు భూ భారతి చట్టం సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ధరణి వల్ల పలు భూ సమస్యలు పరిష్కారం కాలేక పలువురు రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని నూతనంగా తీసుకు వచ్చిందన్నారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖమ్మం అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించారు.ఈ సదస్సులో పలువురు రైతులకు సంబంధించిన భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి రశీదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కార్యాలయం ముందు ఆందోళన



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మా గ్రామంలో బెల్ట్ వద్దంటూ సత్తుపల్లి నియోజకవర్గంలోని, వేం సూరు మండలం, శంభుని గూడెం గ్రామస్థులు సత్తుపల్లి పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కా ర్యాలయం ముందు సోమవారం ఆందోళన నిర్వహించి, ఎక్సైజ్ ఎస్.ఐ శేఖర్ కు వినతిపత్రం అం దజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంభునిగూడెం గ్రామంలో చిల్లర దుకాణాలు, కూల్ డ్రింక్ షాప్ ల పేరుతో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నారని, బెల్ట్ షాపులలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు రాత్రి, పగలు తేడా లే కుండా దొరుకుతుండటంతో యువత పెడదారి ప ట్టడమే కాకుండా కుటుంబాలను చిన్నా,భిన్నం అవుతున్నాయన్నారు. తక్షణమే శంభునిగూడెంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి, తొలగించాలని కోరారు. సిపిఎం వేంసూరు మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్ రావు, సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్, సత్తుపల్లి పట్టణ సిపిఎం కార్యదర్శి ,తదితరులు పాల్గొన్నారు.


## సిపిఐ సీనియర్ సభ్యులు దేవా మృతి

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలం కాస్నాతండాకు చెందిన సిపిఐ సీనియర్ సభ్యులు భూక్యా దేవా మంగళవారం తెల్లవారు జామున మృతిచెందారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐలో ఆయన సీనియర్ సభ్యులుగా ఉన్నారు. మండల నాయకుడిగా వివిధ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కాస్నాతండా గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులుగా పనిచేశారు. దేవా మృతిపట్ల పలువురు సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు , సిపిఐ మండల కార్యదర్శి , నాయకులు తదితరులు నివాళులర్పించారు.

## ప్రమాదవశాత్తు కార్మికుడు మృతి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ప్రమాదవశాత్తు గాయపడి కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా మార్కెట్ ఆవరణలో ఉన్నటువంటి పాత వాటర్ ట్యాంక్‌ను కూల్చే పని చేపట్టారు. ఆ పనులకు వచ్చిన కార్మికుడు తమ్మిశెట్టి చిరంజీవి (32) వాటర్ ట్యాంక్ కూల్చే క్రమంలో రాళ్లు మీదపడి గాయపడ్డాడు. వెంటనే అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిరంజీవి మృతితో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

## ఇందిరమ్మ ఇళ్లు పనులు వేగిరం



**ప్రజాపక్షం/ఇల్లెందు:** పురపాలక పరిధిలో ఇందిరమ్మ లబ్ధిదారులకు పట్టాలు అందించిన అధికారులు, కమిటీ సభ్యులు గృహాలు త్వరితగతిన నిర్మాణం చే పట్టే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. స్థానిక పురపాలక కార్యాలయంలో మంగళవారం ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మొదటివిడతలో పట్టాలు అందుకున్న లబ్ధిదారులుచే సాధ్యమైనంత త్వరగా గృహాలు నిర్మింపజేయాలని సూచించా రు. సమావేశంలో గృహపిడి , మున్సిపల్ కమిషనర్‌తదితరులు పా ల్గొన్నారు.

# మహోన్నత ఆశయంతో ఇందిరా డైరీ ఏర్పాటు
### డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క



**ప్రజాపక్షం/మధిర:**ఇందిరా డైరీ గొప్ప ఆశయంతో చేపట్టిన మహోన్నత కార్యక్రమమని, అధికారులు మనస్ఫూర్తిగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం మధిర క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డిఆర్‌డిఒ పిడి సన్యాసయ్య, వెలుగు, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందిరా డైరీ పథకంలో ప్రతి లబ్ధిదారునికి రెండు గేదెలు అందచేయాలని, సభ్యులు ఎటువంటి కాంట్రిబ్యూషన్ చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. కాంట్రిబ్యూషన్‌కు సంబంధించిన సభ్యులకు అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఇందిరా డైరీ సభ్యులకు భూమి ఉండాలన్న నిబంధన ఏదీ లేదని, అసలు గేదెలు లేని వారికి ఈ పథకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రానున్న ఐదు నెలల్లోపు నియోజకవర్గ వ్యాప్తంగా పూర్తి స్థాయిలో ఇందిరా డైరీ పథకం ప్రారంభం కావాలని, పనులు వేగవంతం చేసేందుకు గేదెల కొనుగోలుకు పెద్ద సంఖ్యలో అధికారుల బృందాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ముజిమ్మిల్ ఖాన్‌ను ఆదేశించారు. గేదెల కొనుగోలు బృంద ంలో తప్పనిసరిగా ఒక విజిలెన్స్ అధికారి ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. పెద్ద సంఖ్యలో గడ్డి అవసరం ఉన్న నేపథ్యంలో నిరుద్యోగులకు గడ్డి సరఫరాకు అవసరమైన అన్ని సహాయ చర్యలు చేపట్టి వారికి ఉపాధితో పాటు పెద్ద సంఖ్యలో వస్తున్న గేదెలకు గడ్డిని సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ సమావేశంలో వివిధ హోదాల్లోని అధికారులు పాల్గొన్నారు.

## 'బడిబాట' స్వచ్ఛంద ప్రచార బైక్ యాత్ర



**ప్రజాపక్షం/కల్లూరు:**కల్లూరు మండలం చెన్నూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దంతాల సుధాకర్ చేపట్టిన బడిబాట ప్రచార బైక్ యాత్రను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా విద్యాశాఖ అధికారి సామినేని సత్యనారాయణ లు ప్రారంభించారు. స్వచ్ఛందంగా గత నాలుగు సంవత్సరాల నుంచి బడిబాట బైక్ యాత్రను చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడమే కాక తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వం అందించే సౌకర్యాలను తెలియజేసి ఊరూరా కరపత్రాలు పంపిణీ ప్రచారం, ఆట పాటలతోబాటలతో కూడిన ఒత్తిడి లేని గుణాత్మక విద్య కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే లభిస్తుందని ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయుడిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి నివేదిత, పిఆర్టియు అధ్యక్షులు పాకాల రమేష్, ఉపాధ్యాయులు అప్పారావు, చక్రవర్తి లు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం
### అదనపు కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు డెంగీ, ఇతర వ్యాధులపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ తెలిపారు. కలెక్టరేట్‌లోని ప్రగతి కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం వైద్య, విద్యాశాఖ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, రూరల్ వాటర్ సప్లయ్ మొదలగు లైన్ డిపార్ట్‌మెంట్లతో అత్యవసర సమీక్షా సమావేశాన్ని అదనపు కలెక్టర్ శ్రీజ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వానాకాలంలో ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా సరైన యాక్షన్ ప్లాన్‌తో సిద్ధంగా ఉండాలని అధికారులకు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో ఇప్పటి నుంచే అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో డెంగీ వ్యాధి నుండి ప్రజలను కాపాడేందుకు 30వేల ల్యాబోరేటరీ కిట్లను అదనంగా తెప్పిస్తున్నామని, ప్రతి పిహెచ్‌సికి 300కిట్లను సరఫరా చేస్తామని ఆమె తెలిపారు. డెంగీ పట్ల ప్రజల్లో భయాందోళన దూరం చేయాలని, పాఠశాలలు, వసతి గృహాలను ఆరోగ్య సిబ్బంది తరచూ సందర్శించాలని తెలిపారు. దోమల లార్వాను నివారించాలని ఎక్కువగా ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. స్లమ్ ఏరియాల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌ఒ కళావతిబాయి, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జిల్లా ఆసుపత్రి సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్, ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, జిల్లా టిబి నియంత్రణ అధికారి వరికూటి సుబ్బారావు, ప్రోగ్రాం అధికారులు వెంకటరమణ, రామారావు, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ సైదులు, డాక్టర్ సీతారాం, డెమో సుబ్రహ్మణ్యం, మెడికల్ ఆఫీసర్లు, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతి ఒక్కరూ కృషి
### అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** మత సామరస్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు మంగళవారం నగరంలోని సీక్వెల్ ఫంక్షన్ హాల్‌లో పీస్ కమిటీ సభ్యులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఖమ్మం జిల్లాలో ప్రతి ఒక్కరు సోదరభావంతో మెలగాలన్నారు. చట్టాన్ని అందరూ గౌరవిస్తూ సాంప్రదాయాలను పాటించాలన్నారు. ముస్లిం సోదరులు జరుపుకునే బక్రీద్ పర్వదినం కోసం పోలీస్ అధికారులు అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు.ముస్లిం సోదరులు పాల్గొనే సామూహిక కార్యక్రమాల సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమ రవాణాను నివారించడానికి ఏడు ప్రత్యేక చెక్ పోస్టులను, హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పాడి ఆవులను, లేగ దూడలను క్రయ విక్రయాలు జరపరాదని, ప్రధానంగా నిబంధనలకు విరుద్ధంగా పశువుల అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా సాధారణ ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత సామరస్యానికి భంగం కలిగించేవిధంగా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా వివిధ మతపెద్దలు తమ అభిప్రాయాలను వెల్లడించి పోలీసులు తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్త చర్యలకు తమ వంతు సహకారాన్ని అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎసిపి రమణమూర్తి, సిఐలు తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి నూతన రెవెన్యూ చట్టం అవగాహన సదస్సులో ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/దమ్మపేట:**తెలంగాణ రాష్ట్రంలో గతంలో అమలులో ఉన్న ధరణి వ్యవస్థ వల్ల అనేకరకాల అన్యాయాలు, భూ సమస్యలు ప్రజలు ఎదుర్కొన్నారు. భూముల రిజిస్ట్రేషన్లు హక్కుల నిర్ధారణ రికార్డుల నిర్వహణ వంటి కీలక అంశాల్లో స్పష్టత లేకపోవడంతో రైతులు భూస్వాములు ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత భూభారతి అనే కొత్త పారదర్శకమైన ప్రజల మేలు కాంక్షించే చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం పైలట్ ప్రాజెక్టులుగా కొన్ని మండలాల్లో విజయవంతంగా అమలై ప్రజల మద్దతు పొందింది. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 3వ తేది నుంచి 20వ తేది వరకు ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయాలలో భూభారతి అవగాహన సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సదస్సులలో ప్రజలకు కొత్త చట్టం ప్రయోజనాలు విధివిధానాలు వివరించబడతాయి. మంగళవారం దమ్మపేట మండలం రాచూరుపల్లి, నాచారం గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అవగాహన సదస్సులలో ముఖ్య అతిధిగా పాల్గొని నూతన భూభారతి రెవెన్యూ చట్టం యొక్క విధివిధానాలను ప్రజలకు వివరించారు. తహశీల్దార్ భగవాన్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ వాణి, ఆర్ఐలు వీరస్వామి, భిక్షమయ్య, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షులు మద్దిశెట్టి సత్యప్రసాద్, పిఏసిఎస్ చైర్మన్ ఎల్లిన రాఘువరావు, జిల్లా దిశాకమిటీ సభ్యురాలు సొంగా ఏసుమణి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తేనేటి విందులో మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/వైరా:**తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో రేచర్ల సత్యం తేనేటి విందులో పాల్గొన్నారు. ఇటీవల రేచర్ల సత్యం నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి రాలేకపోయిన మంత్రి పొంగులేటి ఆయన నివాసానికి వెళ్లి పట్టు వస్త్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపాల్ మాజీ చైర్మన్ జైపాల్, మిట్టపల్లి నాగి, దార్న రాజశేఖర్, మోహన్‌రెడ్డి, రేచర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం తీసుకు వచ్చిందని రఘునాథపాలెం తహసీల్దార్ ఎస్. శ్వేత తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టానికి సంబంధించి ప్రభుత్వం మంగళవారం నుంచి గ్రామ సభల నిర్వహణకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రఘునాథపాలెం మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం, కోయచలక గ్రామాల్లో భూ భారతి చట్టంపై గ్రామసభలు నిర్వహించారు. వి.వెంకటాయపాలెం గ్రామంలో తహసీల్దార్ శ్వేత ఆధ్వర్యంలో, కోయచలక గ్రామంలో నయాబ్ తహసీల్దార్ మురళీధర్‌రావు ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వి. వెంకటాయపాలెం గ్రామసభలో తహసీల్దార్ శ్వేత మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చిందన్నారు. సర్వే నెంబర్ల తప్పు, భూమి హెచ్చుతగ్గులు, రికార్డులో తప్పుల నమోదు, ఇతరత్రా సమస్యలను ఈ చట్టంలో పరిష్కరించుకునేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. గ్రామసభల్లో భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించి ఇచ్చిన వారికి రశీదులు ఇస్తున్నామన్నారు. గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకుని భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు అందించాలని ఆమె తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు మాట్లాడుతూ గ్రామసభల్లో దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టిందన్నారు. వి. వెంకటాయపాలెంలో 129, కోయచలకలో 65 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆర్ఐలు ప్రవీణ్, సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. గ్రామసభలో పలువురు గజాల్లో స్థలాలు విక్రయించి మరల పాసుపుస్తకాల కోస ం, పలువురు గతంలో పొలం విక్రయించి రిజిస్ట్రేషన్ కాకుండా అ గ్రిమెంట్ పైనే ఆగిపోయిన పలు భూములకు సంబంధించి దరఖాస్తు చేసిన ట్లు తెలిపారు. దీనిపై అధికారులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి
### సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** రోడ్డు ప్రమాదంలో నాలుగేండ్ల చిన్నారి కోసూరి బృంద మృతి చెందిన సంఘటన ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురంక్రాస్‌రోడ్ వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..వరంగల్‌క్రాస్‌రోడ్‌కు చెందిన కోసూరి అప్పారావు తన మిత్రుడి ఆటోల ఏదులాపురం నుంచి వరంగల్‌క్రాస్‌రోడ్ తన కూతురిని తీసుకుని వస్తున్నాడు. ఈ నేపథ్యంలో వెనుక నుంచి వస్తున్న లారీ ఆటోని బలంగా ఢీకొట్టడంతో చిన్నారి అక్కడిక్కడే మృతి చెంది. కాగా మరణ వార్త తెలుసుకున్న సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీలో ఉన్న చిన్నారి మృతదేహాన్ని సందర్శించి భావోద్వేగానికి గురయ్యారు. అలాగే తీవ్ర దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులను ఓదార్చారు. చిన్నారి మృతితో వారు నివాసం ఉంటున్న ప్రాంతం శోకసంద్రంలో మునిగిపోయింది. ముక్కు పచ్చలారని చిన్నారి మృతిపై పలువురు సైతం కంటతడి పెట్టుకున్నారు.

# శరవేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి రఘునాథపాలెం మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మల్లెపల్లి గ్రామ పంచాయతీలో నిర్మాణాలు శర వేగంగా సాగుతున్నాయి. గత ప్రభుత్వంలో పేదలు సొంత గూటి కోసం ఎదురు చూశారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం చేపడతామని చెప్పిన ప్రభుత్వం అరకొరగా నిర్మించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు స్థలం ఉండి ఇల్లు లేని వారికి ఐదు లక్షల రూపాయలు అందించి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని తెలిపింది. అందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపికైన మల్లేపల్లి గ్రామ పంచాయతీలో మొత్తం 13 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా వారిలో ముగ్గురు ఇ ంటి నిర్మాణానికి సుముఖత వ్యక్తం చేయలేదు. మిగిలిన 10 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టారు. అం దులో ఇద్దరు లబ్ధిదారులకు సంబంధించిన ఇంటి నిర్మా ణం స్లాబు వరకు వచ్చింది. మరి కొంత మంది బేస్‌మెంట్ పూర్తి చేసి లెంటల్ నిర్మాణం చేపట్టారు. ప్ర భుత్వం దశల వారీగా నిధులను లబ్ధిదారులకు అందజేస్తుంది. ఇ ద్దరు లబ్ధిదారులు నాగమణి, ఉపేందర్ లకు రెండు ల క్షల మేర నగదును వారి ఖాతాల్లో జమ చే సింది. మరో ఏడుగురులబ్ధిదారులకు బేస్‌మెంట్ పూర్తి కావడంతో లక్ష చొప్పున నగదు జమ చేసింది. ప్రభుత్వ నిబంధనల మేరకు 400 నుంచి 600 అడుగుల మేర ఇ ంటి నిర్మాణం చేపట్టాలని తెలపడంతో దానికి అనుగుణ ంగా లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇందిర మ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి మండల పరిషత్ కార్యాలయం వద్ద నమూనా ఇంటిని అధికారులు నిర్మించారు. ఎంపికైన లబ్ధిదారులు ఆ ఇంటిని పరిశీలించి దా నికి అనుగుణంగా నిర్మాణాలు చేపట్టేలా చర్యలు చేపట్టా రు.

**లబ్ధిదారులకుసూచనలు,సలహాలు:హౌజింగ్ ఎఇపుష్ప**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందిస్తున్నామని హౌజింగ్ ఎఇ పుష్ప తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మల్లేపల్లి గ్రామ పంచాయతీలో ఇండ్ల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. దశల వారీగా వారి ఖాతాల్లోకి నగదు కూడా జమ చేస్తున్నట్లు తెలిపారు. రఘునాథపాలెం వ్యాప్తంగా ఇందిరమ్మ ఇ ండ్లకు సంబంధించి ఇప్పటి వరకు సుమారు 1303 మంది లబ్ధిదారులను గు ర్తించామని త్వరలో తుదిజాబితా ప్రకటించడం జరుగుతుందని ఆమె తెలిపా రు.

**లబ్ధిదారుల్లో ఆనందం :** ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని మాజీ సర్పంచ్ బండి వెంకన్న తెలిపారు.

# బెంగళూరు సమష్టి పోరు..

## పంజాబ్ టార్గెట్ 191

### పంజాబ్‌ను ఊరిస్తున్న ట్రోఫీ..!



### ఫైనల్లో మెరిసిన కోహ్లీ, జితేశ్..

ఐపిఎల్ 18వ సీజన్ ఫైనల్ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లు తడబడ్డారు. పంజాబ్ కింగ్స్ పేసర్లు కైలీ జేమీసన్(348), అర్ష్‌దీప్ సింగ్(340)లు విజృంభించడంతో ఆర్సీబీ 200 లోపే పరిమితమైంది. ఆదిలోనే డేంజరస్ ఫిల్ సాల్ట్(16)ను ఔట్ చేసిన ఈ పొడగరి స్పీడ్‌స్టర్.. ఆ తర్వాత రజత్ పాటిదార్(26)ను ఔట్ చేసిబెంగళూరును దెబ్బకొట్టాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా విరాట్ కోహ్లీ(43) కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. డెత్ ఓవర్లలో జితేశ్ శర్మ(24), రొమారియో షెపర్డ్(17)లు ధనాధన్ ఆడడంతో ఆర్సీబీ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేయగలిగింది. క్వాలిఫయర్ 1లో పంజాబ్ కింగ్స్‌ను చిత్తుగా ఓడించిన ఆర్సీబీ ఫైనల్లో మాత్రం తడబడింది. లీగ్ ఆసాంతం చెలరేగి ఆడిన ప్రధాన బ్యాటర్లు కీలక పోరులో దంచలేకపోయారు. పంజాబ్ కింగ్స్ పేసర్లు కైలీ జేమీసన్(348), అర్ష్‌దీప్ సింగ్ (340) ధాటికి స్వల్ప స్కోర్‌కే పెవిలియన్ చేరారు. రెండో ఓవర్లోనే జేమీసన్ డేంజరస్ ఓపెనర్ ఫిల్ సాల్ట్(16)ను ఔట్



చేయగా.. విరాట్ కోహ్లీ(43) మరోసారి ఆపద్భాందవుడి పాత్ర పోషించాడు.

**కోహ్లీ ఒంటరి పోరాటం..**

సాల్ట్ ఔటయ్యాక యాంకరింగ్ రోల్ పోషించిన విరాట్.. రెండో వికెట్‌కు మయాంక్ అగర్వాల్(24)తో 38 రన్స్ జోడించాడు. దంచుతున్న మయాంక్‌ను ఊరించే బంతితో వెనక్కి పంపాడు చాహల్. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రజత్ పాటిదార్ (26)ధనాధన్ ఆడుతూ స్కోర్ బోర్డును ఉరికించాడు. కోహ్లీతో కలిసి స్కోర్ వంద దాటించాడు. మూడో వికెట్‌కు 27 బంతుల్లోనే 40 రన్స్ రాబట్టిన పాటిదార్‌ను జేమీసన్ ఎల్బీగా ఔట్ చేసి పంజాబ్‌కు మరోసారి బ్రేకిచ్చాడు. కాసేపటికే విరాట్‌ను రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. లివింగ్‌స్టోన్(25), జితేశ్ శర్మ (24)లు దూకుడుగా ఆడారు. జేమీసన్ వేసిన 17వ ఓవర్లో.. రెచ్చిపోయిన జితేశ్ మూడు సిక్సర్లతో 23 రన్స్ పిండుకున్నాడు. అతడి మెరుపులతో ఆర్సీబీ స్కోర్ 170కి చేరుకుంది. మరో మూడు ఓవర్లు ఈ ఇద్దరూ నిలబడితే 200 ప్లస్ ఖాయం అనిపించింది. కానీ, జేమీసన్ ఓవర్లో లివింగ్‌స్టోన్ ఔట్ కాగా.. ఆ తర్వాత జితేశ్‌ను విజయ్‌కుమార్ బౌల్డ్ చేసి ఆర్సీబీ భారీ స్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు. అయితే.. అజ్మతుల్లా వేసిన 19వ ఓవర్లో రొమారియో షెపర్డ్17) వరుసగా 4, 6 బాదాడు. కానీ, అర్ష్‌దీప్ చివరి ఓవర్లో అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు వికెట్లు తీయడంతో ఆర్సీబీ 190కే పరిమితమైంది.

## విజేత ప్రైజ్‌మనీ?

ఐపిఎల్ 2025 సీజన్ తుది దశకు చేరుకుంది. మరికొద్ది క్షణాల్లో ప్రారంభమయ్యే ఫైనల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), పంజాబ్ కింగ్స్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. ఈ రెండు జట్లు ఫైనల్ రావడంతో ఐపీఎల్‌లో కొత్త ఛాంపియన్ అవతరించబోతుంది. ఆర్‌సీబీకి ఇది నాలుగో ఫైనల్ కాగా.. పంజాబ్ కింగ్స్‌కు రెండోది. గతంలో ఆర్‌సీబీ 2009, 2011, 2016 సీజన్లలో ఫైనల్ చేరి తృటిలో టైటిల్ కోల్పోయింది. మరోవైపు పంజాబ్ కింగ్స్ 2014లో ఫైనల్లో కేకేఆర్ చేతిలో ఓటమిపాలైంది. 18 ఏళ్లుగా ఆర్‌సీబీకి ఆడుతున్న విరాట్ కోహ్లీ టైటిల్ అందుకోవాలని ఆ జట్టు ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. గతేడాది కేకేఆర్ కెప్టెన్‌గా ఆ జట్టుకు టైటిల్ అందించిన శ్రేయస్ అయ్యర్.. ఈ సారి పంజాబ్ కింగ్స్‌ను విజేతగా నిలబెట్టాలనే కసితో ఉన్నాడు. అయితే ఐపీఎల్ 2025లో ఛాంపియన్‌గా నిలిచే జట్టుకు రూ. 20 కోట్లు, రన్నరప్‌కు రూ. 13 కోట్ల ప్రైజ్‌మనీని బీసీసీఐ అందజేయనుంది.

క్వాలిఫయర్2లో ఓడిన ముంబై ఇండియన్స్‌కు రూ. 7 కోట్లు, ఎలిమినేటర్‌లో ఓడిన గుజరాత్ టైటాన్స్‌కు రూ. 6.5 కోట్ల ప్రైజ్‌మనీ దక్కనుంది. ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ ప్లేయర్లకు పది లక్షల చొప్పున నగదు పురస్కారం లభించనుంది. ఎమర్జింగ్ ప్లేయర్, మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్, అత్యధిక స్ట్రైక్‌రేట్, అత్యధిక సిక్స్‌లు కొట్టిన ఆటగాళ్లకు కూడా రూ. 10 లక్షల చొప్పున ప్రైజ్‌మనీ దక్కుతుంది. ఐపీఎల్ 2022 సీజన్ నుంచి బీసీసీఐ ప్రైజ్‌మనీ అమౌంట్‌ను మార్చలేదు.

**ఐపీఎల్ ప్రైజ్‌మనీ వివరాలు..**

- విజేత: రూ. 20 కోట్లు
- రన్నరప్ : రూ.13 కోట్లు
- క్వాలిఫైయర్ 2లో ఓడిపోయిన ముంబై ఇండియన్స్‌కు రూ.7 కోట్లు
- ఎలిమినేటర్‌లో ఓడిపోయిన గుజరాత్ టైటాన్స్‌కు రూ.6.5 కోట్లు

**వ్యక్తిగత అవార్డుల విజేతల ప్రైజ్‌మనీ**

- ఆరెంజ్ క్యాప్ (అత్యధిక పరుగులు): రూ.10 లక్షలు
- పర్పుల్ క్యాప్ (అత్యధిక వికెట్లు): రూ.10 లక్షలు
- ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్: రూ.10 లక్షలు
- మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్: రూ.10 లక్షలు
- సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్: రూ.10 లక్షలు
- అత్యధిక సిక్స్‌లు: రూ.10 లక్షలు


## శేఖర్ కమ్ములకు 'చిరు' కానుక



మెగాస్టార్ చిరంజీవి దర్శకుడు శేఖర్ కమ్ములకు ఓ కాస్ట్లీ పెన్ను బహుమతి ఇచ్చారు. చిరంజీవి నివాసానికి శేఖర్ కమ్ములను పిలిపించుకుని మరీ గిఫ్ట్ ఇచ్చారు. మీ లాంటి ఒక అభిమాని ఉండటం ఎంతో ఆనందకరం. మీ ప్రస్థానానికి స్ఫూర్తినిచ్చానని తెలిసి మరింతగా సంతోషించాను. మీ సినిమాలు అంటే నాకు చాలా ఇష్టం. ఫిలిం మేకింగ్‌లో మీకంటూ ఓ ప్రత్యేకమైన శైలిని క్రియేట్ చేసుకున్నారు. మరో ఇరవై అయిదేళ్ళ పాటు మంచి మంచి సినిమాలు రాస్తూ, తీస్తూ మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను అని చిరంజీవి ఎక్స్‌లో పేర్కొన్నారు. శేఖర్ కమ్ములకు చిరంజీవి సంతకం చేసిన పెన్నును బహూకరించారు. ఆనంద్, గోదావరి, ఫిదా లాంటి ఫీల్ గుడ్ సినిమాలను తెరకెక్కించిన శేఖర్ కమ్ముల ఇండస్ట్రీ లో తన సినిమాకు ఓ సెపరేట్ ప్రేక్షకులను క్రియేట్ చేసుకున్నారు. తాజాగా ధనుష్, నాగార్జున తో కలిసి కుబేర సినిమాను శేఖర్ కమ్ముల రూపొందిస్తున్నారు. చిరంజీవి నుంచి బహుమతి అందుకున్న శేఖర్ కమ్ముల ఆనందానికి అవధులు లేవని చెప్పొచ్చు.

## డిసెంబర్ 5న 'రాజా సాబ్' విడుదల

### ఈ నెల 16న టీజర్




రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో రూపొందుతున్న 'రాజా సాబ్' రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. ఈ చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 16న ఉదయం 10.52 నిమిషాలకు 'రాజా సాబ్' టీజర్ విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా పోస్టర్ విడుదల చేశారు. ప్రభాస్ డబ్బులతో నిండి ఉన్న గదిలో ఫెరోషియస్‌గా కనిపించడం ఆసక్తి కలిగిస్తోంది. మరోవైపు 'రాజా సాబ్' రిలీజ్ డేట్, టీజర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'రాజా సాబ్' సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో రాజీ పడకుండా నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో ఈ సినిమాను దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా మీద ఇండస్ట్రీలోనూ ఆసక్తి ఏర్పడుతోంది. 'రాజా సాబ్' సినిమాతో ప్రేక్షకులకు ఎవర్ గ్రీన్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలని డైరెక్టర్ మారుతి తపిస్తున్నారు. ప్రభాస్ సరసన, నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, నటిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు కార్తీక్ పళని కెమెరామెన్‌గా పని పని చేస్తున్నారు.

## గ్రాండ్‌గా 'బద్మాషులు' ప్రీ రిలీజ్



కొత్త పాత నటీనటులతో తెరకెక్కించిన చిత్రం 'బద్మాషులు'. మహేష్ చింతల, విద్యాసాగర్, బలగం సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ కవితా శ్రీరంగం, దీక్ష కోటేశ్వర్ కీలకపాత్రలో నటించారు. శంకర్ చేగూరి దర్శకత్వంలో బి బాలకృష్ణ, రమా శంకర్ నిర్మించారు. హాస్యం, వినోదాత్మకంగా తెరకెక్కించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. దర్శకులు తరుణ్ భాస్కర్, మాలిక్ రామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అన్ని పనులు పూర్తి చేసుకున్న ఈ సినిమాను ఈ నెల 6న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ మాట్లాడుతూ.. మహేష్ చింతలకి అవకాశం వచ్చినట్లే చిత్ర పరిశ్రమంలో ప్రతి ఒక్కరికి ఒక రోజు వస్తుంది. ఒక శుక్రవారం రోజు ప్రతి ఒక్కరు స్టార్లు అయ్యే అవకాశం ఉంటుంది. కాకపోతే దానికి కాస్త టైం పడుతుంది. బద్మాషులు చిత్రంలో నటించిన ప్రతి ఒక్కరూ స్టార్లు కావాలని ఆశిస్తున్నా అని అన్నారు.

ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ కి ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ చాలామంది కామెడీ ని చాలా తేలిగ్గా తీసిపారేస్తుంటారు. కానీ ఆ కామెడీ సన్నివేశాలు వెనుక ఎంత కష్టం, నిజాయితీ దాగుందనేది చూసే వాళ్లకి అర్థం కాదు. ఆ సీన్లు రాసిన వాళ్లకే తెలుస్తుంది. పెళ్లిచూపులు చిత్రంలో కామెడీ సన్నివేశాలు రాస్తున్నప్పుడు మా నాన్న ఆరోగ్యం చాలా సీరియస్‌గా ఉంది. చాలా టెన్షన్ పడుతూ రాత్రి వేళల్లో ఆ సన్నివేశాలు రాశాను. మన టాలెంట్ తో నిజాయితీగా ప్రయత్నిస్తే మన కష్టానికి వడ్డీతో సహా ప్రతిఫలం దక్కుతుంది. మా నాన్నకి కోపం వచ్చినప్పుడు నన్ను కామన్‌గా తిట్టే పదం బద్మాష్. బద్మాషులు చిత్రం మంచి విజయం సాధించాలి. ఆరవ తేదీ ప్రతి ఒక్కరు ఈ చిత్రాన్ని చూడండి అని తరుణ్ భాస్కర్ అన్నారు.

## సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'కలివి వనం'




అడవిలో జరిగే ఓ థ్రిల్లర్ కథను తీసుకుని తెరకెక్కించిన సినిమా 'కలివి వనం'. రాజ్ నరేంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా ట్రైలర్‌ను త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాతల్లో ఒకరైన మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. అడవిలో జరిగే ఒక సంఘటన ఆధారంగా సస్పెన్స్, థ్రిల్లర్ కథగా ఈ సినిమాను రూపొందించామని దర్శకుడు రాజ్ నరేంద్ర చెప్పారు. ఇందులో హాస్య నటుడు రఘుబాబు పాత్ర సినిమాకు ఎంతో కీలకమైందన్నారు. మదిన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు విష్ణువర్ధన్ రెడ్డి, మల్లి కార్జున్ రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. కాసర్ల శ్యామ్, మాట్లా తిరుపతి, కమల్ ఇస్లావత్ పాటలు రాశారు. అన్ని పనులు పూర్తి చేసి నెలాఖరులో గాని, వచ్చే నెలలో గాని విడుదల చేయనున్నారు.

# జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో శ్రీచైతన్య విద్యార్థులదే ఆధిపత్యం

### ఓపెన్ కేటగిరిలో టాప్ 10 లోపు, టాప్ 100లోపు అత్యధిక ఆలిండియా ర్యాంకులు శ్రీచైతన్యవే




**హైదరాబాద్ :** యావత్ భారత దేశంలో విస్తరించిన శ్రీచైతన్య విద్యాసంస్థకు సోమవారం విడుదలైన ఐఐటి–జెఇఇ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్‌తో వచ్చింది. ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 3, 5, 6, 11 ర్యాంకులతో శ్రీచైతన్య తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. 300కి 300 మార్కులతో వంగాల అజయ్ రెడ్డి ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. టాప్ ర్యాంకుల్లోనూ, టోటల్ ర్యాంకుల్లోనూ తిరుగులేని అగ్రస్థానంతో శ్రీచైతన్య దూసుకెళ్ళింది. ఆలిండియా 1వ ర్యాంక్ డిజి రుత్విక్‌సాయి, ఆలిండియ ఓపెన్ కేటగిరిలో 3 వ ర్యాంక్ ఎంఎ జిధుసైన్, 5వ ర్యాంక్ ఉజ్వల్ కేసరి, 6వ ర్యాంక్ అక్షత్‌కుమార్,11వ ర్యాంక్ అర్నవ్ నిగమ్, 16వ ర్యాంక్ దేవ్‌దత్తు మాఝీ, 18వ ర్యాంక్ రుత్విక్ సాయి, 19వ ర్యాంక్ వంగాల అజయ్ రెడ్డి సాధించారు. ఓపెన్ క్యాటగిరీలో టాప్ 10 లోపు 3 ర్యాంకులతో పాటు, 20 లోపు 7 ర్యాంకులు, 50 లోపు 19 ర్యాంకులు, 100 లోపు 29 ర్యాంకులు సాధించారు. ఈసారి కూడా ఐఐటీల్లో మొదటి వరుసతో పాటు మొత్తం సీట్లలోనూ అత్యధిక శాతం శ్రీచైతన్య విద్యార్థులదేనని విద్యాసంస్థల సిఇఒ అండ్ అకడమిక్ డైరెక్టర్ సుష్మ హర్షం వ్యక్తం చేశారు. దేశంలో నిష్ణాతులైన టాప్ ఫ్యాకల్టీతో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో నాణ్యమైన శిక్షణను అందిస్తూ... అనితరసాధ్యమైన ప్రోగ్రాములతో, మైక్రోషెడ్యూల్స్, ఆలిండియా టెస్ట్ సీరీస్ ప్రోగ్రాములతో మాత్రమే ఇంతటి అద్భుతమైన ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. అందువల్లే ఐఐటి ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా విద్యార్థులు శ్రీచైతన్యనే కోరుకుంటున్నారని వివరించారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని సుష్మ అభినందించారు.

### అంగన్‌వాడీ టీచర్ల, ఆయాలకు ఉద్యోగ విరమణ ప్రయోజనాల పెంపు

# ఎఐటియుసి పోరాటాల ఫలితమే

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణ కుమారి

ప్రజాపక్షం/హైదరాబాద్ : అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు ఉద్యోగ విరమణ ప్రయోజనాల పెంపు అని, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణ కుమారి అన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ధన్యవాదాలు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లకు ఉద్యోగ విమరణ ప్రయోజనాలను లక్ష నుండి 2 లక్షలకు, హెల్పర్స్‌కు రూ. 50 వేల నుండి లక్ష రూపాయాలకు పెంచడంతో పాటు 60 ఏళ్లు దాటిన వారికి అనారోగ్యం ఇతర కారణాల వల్ల వాలంటరీ రిటైర్మెంట్ తీసుకునే అవకాశం, కల్పించడంతోపాటు వారికి ఆసరా పెన్షన్ సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం జి.నెం.8ని విడుదల చేయటం పట్ల ముఖ్యమంత్రి రేవంతరెడ్డికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, గ్రాట్యుటీ చెల్లించాలని, పెన్షన్, బీమా పథకం, ఇయస్‌ఐ, పిఎఫ్ తదితర అనేక డిమాండ్లపై రాష్ట్ర వ్యాపితంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మినీ టీచర్లు ఎఐటియుసి ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించారని ఇందుకు తగ్గ ఫలం జిఓ ద్వారా లభించిందన్నారు. అయితే 2024 జులై 1 నుండి వర్తింప చేస్తామని ఇచ్చిన హామీలను ఈ జి.ఓ.లో పొందుపరచలేదని, దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు అన్యాయం జరుగుతుందన్నారు. ఆసరా పెన్షన్ కాకుండా ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఉన్నప్పుడు 24 రోజుల సమ్మె కాలంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, సమ్మెకాలపు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.5 ఏళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించే విధంగా ప్రభుత్వ చర్యలు చేపట్టాలని కరుణ కుమారి కోరారు.

## విచారణకు హాజరయ్యేనా..

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాల ప్రకారం గురువారం విచారణకు హాజరు కావల్సి ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆయన విచారణకు హాజరవుతారా లేదా అనేది ఉత్కంఠ నెలకొంది. హారైతే మాత్రం ప్రభాకర్‌రావుపై ప్రశ్నల వర్షం కురిపించేందుకు దర్యాప్తు అధికారులు అన్ని సిద్ధం చేసుకున్నారు.

**అమెరికాలో ఆశ్రయం తిరస్కరణ..**

ప్రభాకర్ రావు అమెరికాలో రాజకీయ ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే, అమెరికా ప్రభుత్వం ఆయన పిటిషన్‌ను తిరస్కరించింది, తద్వారా ఆయనపై డిపోర్టేషన్ ముప్పు పెరిగింది. ఈ క్రమంలోనే గత నెల 22న నాంపల్లి కోర్టు, ప్రభాకర్ రావును 'ప్రోక్లెయిమ్డ్ ఆఫెండర్'గా ప్రకటించింది. మరోపక్క హైదరాబాద్ పోలీసులు ఆయన నివాసం వద్ద ప్రభాకర్‌రావు కనిపించడం లేదని ప్రకటనను అంటించి, సమీప ప్రాంతాల్లో ప్రజలకు తెలియజేశారు.

**కేసు నేపథ్యం..**

ఈ కేసులో 201823 మధ్యకాలంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో, విపక్ష నాయకులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, ఉన్నతాధికారులు, న్యాయమూర్తుల ఫోన్ కాల్‌లను అనధికారికంగా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కార్యకలాపాలు బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి రాజకీయ ప్రయోజనాలు కల్పించేందుకు జరిగినట్లు తెలంగాణ పోలీసులు ఆరోపిస్తున్నారు.ప్రభాకర్ రావు జూన్ 5న విచారణకు హాజరైన తర్వాత, ఈ కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### ఆలిండియా టాప్ 10లో 5 ర్యాంకులతో

# నారాయణ ఏకఛత్రాధిపత్యం!



**హైదరాబాద్ :** జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో నారాయణ విద్యార్థులు టాప్ ర్యాంకులతో మరోసారి సత్తాచాటారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మాజిద్ హుస్సేన్, 3వ ర్యాంక్, పార్థ్ మందర్ వార్థక్, 4వ ర్యాంకు, అక్షత్ చౌరాసియా, 6వ ర్యాంక్, సాహిల్ డియో, 7వ ర్యాంక్, వడ్లమూడి లోకేష్, 10 వ ర్యాంక్‌తో టాప్ 10 ర్యాంకుల్లో 5 ర్యాంకులు నారాయణ కైవశం చేసుకుంది. అలాగే ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 100 లోపు 43 ర్యాంకులు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్స్ డాక్టర్ పి. సింధూరనారాయణ, పి. శరణినారాయణ తెలిపారు. అలాగే ఆలిండియా అన్ని కేటగిరీల్లో 1, 2, 2, 2, 4, 5, 7, 8, 10, 10 వంటి 10లోపు 10ర్యాంకులు, 50లోపు 42 ర్యాంకులు, 100 లోపు 75 ర్యాంకులను కైవసం చేసుకుని ఐఐటి ఆశయాలను సాకారం చేయటంలో వేరెవ్వరూ నారాయణకు సాటిలేరని, సాటిరారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 180000 మందికి పైగా విద్యార్థులు పోటీపడిన ఈ పరీక్షా ఫలితాలలో అత్యధిక సంఖ్యలో నారాయణ విద్యార్థులు విజయదుందుభి మ్రోగించారని పేర్కొన్నారు టాప్ ర్యాంకులు సాధించిన వారికి అత్యధిక సంఖ్యలో నారాయణ స్కూల్స్‌లో చదివిన విద్యార్థులే ఉన్నారన్నారు.ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప అభినందనలు తెలియజేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

### రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలం లోని ముజ్జుగూడెం, బైరవునిపల్లి, బోదులబండ, నేలకొండపల్లి, చెన్నారం గ్రామాలలో బుధవారం పర్యటించారు. వివిధ అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. తొలి విడతగా 4.50 లక్షల ఇళ్ల ను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతీనియోజకవర్గంలో 3,500 ఇళ్ల ను మంజూరు చేసినట్లు తెలిపారు. శిక్ష ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎవరూ కూడ ఆ భద్రత భావం కు గురికావద్దని సూచించారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేస్తామని పేర్కోన్నారు. పేదోడి సొంతింటి కల నెరవేర్చటం ప్రభుత్వం బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్వెనన పూసల సీతారాములు, శాఖమూరి రమేష్, భద్రయ్య, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, కె.హనుమంతరావు, వంగవీటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com